RNI No.TELTEL/2005/16755

ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 29 ఏప్రిల్ 2026 బుధవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:278

తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా సీవీ ఆనంద్

హైద్రాబాద్ ఏప్రిల్ 28 ;తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా సీవీ ఆనంద్?ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత డీజీపీ శివధర్‌రెడ్డి ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయనున్నారు. 1991 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పదవి నుంచి బదిలీ అయ్యారు. హెడ్ ఆఫ్ పోలీస్ ఫోర్స్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా రెండు విడతల్లో సేవలు అందించారు.

ఇటీవలే యూపీఎస్సీ డీజీపీ పోస్టుకు అర్హులైన ఐపీఎస్‌ల జాబితాను తెలంగాణ ప్రభుత్వానికి పంపించిన సంగతి తెలిసిందే. అందులో సీవీ ఆనంద్‌తోపాటు 1994 బ్యాచ్‌కు చెందిన వినాయక్ ప్రభాకర్ ఆప్టే, సౌమ్యమిశ్రా ఉన్నారు. ఈ ముగ్గురిలో అత్యంత సీనియర్ అయిన సీవీ ఆనంద్‌ను డీజీపీగా ప్రభుత్వం నియమించింది.

గిరి దర్శక్" కార్యక్రమంలో భాగంగా 20 మంది గిరిజన యువతకు నియామక పత్రాలు అందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిది పర్యాటక అభివృద్ధితో పాటు గిరిజన యువతకు జీవనోపాధి కల్పించే ఉద్దేశంతో "గిరి దర్శక్" కార్యక్రమం

భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల్లోని ప్రధాన పర్యాటక ప్రాంతాల్లో గిరిదర్శక్ ల నియామకం

ఎంపిక చేసి శిక్షణ అందించిన "గిరి దర్శక్" లు పర్యాటకులకు స్థానిక సంస్కృతి, చరిత్రను వివరిస్తారు.

అటవీ నియమాలు పాటించేలా చూడటంతో పాటు పర్యాటకుల భద్రత కల్పించనున్న "గిరి దర్శక్" లు.

రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల పెట్రోల్, డీజిల్ కొరత

హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి హైద్రాబాద్ ఏప్రిల్ 28 రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల పెట్రోల్, డీజిల్ కొరత నెలకొంది. హైదరాబాద్‌లోని పలు బంకుల్లో మూడో రోజూ నో స్టాక్? బోర్డులు దర్శనమిస్తున్నాయి. పెట్రోల్ ఉన్న బంకుల ముందు వాహనాలు బారులు తీరుతున్నాయి. చంపాపేట్, ఐఎస్ సదన్‌లో పెట్రోల్ బంకుల ముందు వాహనదారులు ఆందోళనకు దిగారు. గంటల తరబడి క్యూలో ఉండాల్సి వస్తోందని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పెట్రోల్ బంకుల వద్ద వాహనాలు రోడ్లపై నిలవడంతో ట్రాఫిక్‌జామ్ ఏర్పడుతోంది. బంకుల వద్ద ఎలాంటి గొడవలు జరగకుండా ఉండేందుకు కొన్నిచోట్ల పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. వాహనదారులు బాటిల్స్, క్యాన్స్?లలో ఇంధనం నింపుకోకుండా పహారా కాస్తున్నారు.

మిగతా 2లో

మనందరం కలిస్తేనే ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సాధ్యమవుతుంది

రంగారెడ్డి జిల్లా మీర్ఖాన్ పేట్ లో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

పోలీస్ కమిషనరేట్ భవనంతోపాటు పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన సీఎం

శంకుస్థాపన/ ప్రారంభోత్సవం వివరాలు:

మల్కాజ్ గిరి కమిషనరేట్ భవనం ప్రారంభోత్సవం

OCTOPUS అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ ప్రారంభోత్సవం

కుత్బుల్లాపూర్ DCP కార్యాలయ భవనం ప్రారంభోత్సవం

గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన

రంగారెడ్డి ప్రజాబలం ప్రతినిధి:"ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్" శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

తమ గ్రామాలను కూడా ఫ్యూచర్ సిటీలో కలపాలని కొంతమంది నా దగ్గరకు వచ్చి విజ్ఞప్తి చేశారు గ్రామసభలు నిర్వహించి తీర్మానం చేయించి ఆ గ్రామాలను వారి కోరిక మేరకు కమిషనరేట్ పరిధిలోకి తీసుకువచ్చేలా చూడాలని స్థానిక నాయకులను ఆదేశిస్తున్నా

భారత్ ఫ్యూచర్ సిటీని అద్భుతమైన నగరంగా అభివృద్ధి చేసుకుందాం .సింగపూర్, టోక్యో, న్యూయార్క్ లా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది

త్వరలోనే జూన్ 2 లోగా ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ కార్పొరేషన్ కార్యాలయాన్ని ప్రారంభించుకుందాం

ఇక నుంచి ఇక్కడి నుంచే సమీక్షలు నిర్వహించి పెట్టుబడులను ఆహ్వానిద్దాం

ఆనాడు ఔటర్ రింగురోడ్డు నిర్మించేటప్పుడు ఇది అయ్యేది కాదని చాలామంది అనుకున్నారు

160.500 కి.మీ ఔటర్ రింగు రోడ్డు దేశంలో ఏ నగరానికి లేదు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో భాగంగా నష్టపోతున్న రైతులనుప్రభుత్వం ఆదుకుంటుంది మా ప్రభుత్వం ఎవరికీ నష్టం కలగనీయదు మీ సమస్య పరిష్కారానికి మా మంత్రి శ్రీధర్ బాబు ఎప్పుడూ అందుబాటులో ఉంటారు. పేదల పట్ల మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని అధికారులకు సూచిస్తున్నా

మీరు సహకరిస్తే దేశంలోనే కాదు.. ప్రపంచంలోనే అద్భుతమైన నగర నిర్మాణానికి వేగంగా అడుగులు పడతాయి.

ప్రపంచంలో ఏ దేశానికి చెందిన వారైనా ఇక్కడకు వచ్చి పెట్టుబడులు పెట్టేలా ఫ్యూచర్ సిటీని తీరిదిద్దుతాం .దేశంలో ఏడు బుల్లెట్ ట్రైన్స్ మంజూరు చేస్తే మూడు బుల్లెట్ ట్రైన్స్ మన రాష్ట్రానికే వచ్చాయి

బెంగుళూరు- హైదరాబాద్ , శంషాబాద్- పూనే, శంషాబాద్- అమరావతి- చెన్నై వరకు బుల్లెట్ ట్రైన్ కు మార్గం సుగమమైంది.

రంగారెడ్డి జిల్లాలో అద్భుతం జరగబోతుంది..

అందరూ సహకరిస్తేనే అభివృద్ధి ఆ అద్భుతం ఆవిష్కృతమవుతుంది నాపై నమ్మకం ఉంచండి..

మీ సమస్యలను పరిష్కరించే బాధ్యత నాది..

మేం అభివృద్ధి చేస్తామంటే కొందరు ఏడుపులు మొదలు పెట్టారు మీరు ఏడుస్తూనే ఉండండి..

మేం అభివృద్ధి చేసుకుంటూ ముందుకు వెళతాం

రాక్షసుల కుల గురువు శుక్రాచార్యుడు

దేవతలు యజ్ఞాలు చేస్తుంటే శుక్రాచార్యుడు మారీచుడు, సుబాహుడును పంపి భగ్నం చేయాలని ప్రయత్నించే వారు

రాష్ట్రంలో కూడా ఫామ్ హౌస్ లో ఉన్న శుక్రాచార్యుడు మన అభివృద్ధి యజ్ఞాన్ని భగ్నం చేసేందుకు మారీచుడు, సునాహుడిని పంపాడు

రెండు వేసి మాట్లాడే వాళ్ల మాటలను సీరియస్ గా తీసుకోవాల్సిన పనిలేదు

అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంలో భాగంగానే ఇవాళ ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ కు శంకుస్థాపన చేసుకున్నాం.

ఈ వేదికగా మావోయిస్టులకు పిలుపునిస్తున్నా...

ఇంకా ఎవరైనా మావోయిస్టులు అడవుల్లో మిగిలిపోతే వచ్చి జనజీవన స్రవంతిలో కలవండి

మీ ఆరోగ్యం, మీకు భరోసా కల్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది.

గూగుల్ క్లౌడ్ ఇండియా ఏఐ హబ్ శంకుస్థాపన



వార్తా 3 లో

గూగుల్ భారత్ గ్రోత్ ఇంజన్ గా మారుతుంది

ముఖ్యమంత్రి చంద్రబాబు

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా టీజీజెన్కోకు ఐఎస్ఓ సర్టిఫికేషన్ అందజేత

తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థ (TGGENCO) తన నాణ్యత, సామర్థ్యం, నిరంతర మెరుగుదల పట్ల చూపుతున్న కట్టుబాటుకు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. సంస్థ ప్రతిష్టాత్మకమైన ISO 9001:2015 (క్వాలిటీ మేనేజ్మెంట్ సిస్టమ్) సర్టిఫికేషన్‌ను సాధించింది. ఈ సర్టిఫికేషన్‌ను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదుగా ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ నవీన్ మిట్టల్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ హరీష్ అందుకున్నారు. ఒక స్వతంత్ర ఐఎస్ఓ ధృవీకరణ సంస్థ నిర్వహించిన సమగ్ర ఆడిట్ అనంతరం ఈ గౌరవం దక్కింది. ఈ తనిఖీల్లో భాగంగా ఆడిట్ బృందం టీజీజెన్కోలోని అన్ని విభాగాలు, కార్యకలాప విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించింది. ప్రధానంగా ఐఎస్ఓ పత్రాల అనుసరణ, విభాగాల వారీ పనితీరు, కార్యకలాపాల ప్రభావిత్వం, సంస్థ లక్ష్యాల సాధన మరియు నాణ్యత నిర్వహణ వ్యవస్థల అమలును బృందం లోతుగా మూల్యాంకనం చేసింది. ప్రతి విభాగం అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉత్తమ పద్ధతులను పాటిస్తోందని నిర్ధారించిన అనంతరం, ఈ సర్టిఫికేషన్ మంజూరుకు ఆమోదం లభించింది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, టీజీజెన్కో యొక్క ఉన్నత నాణ్యత సేవలకు మరియు బలమైన నిర్వహణ వ్యవస్థలకు ఈ గుర్తింపు ఒక నిదర్శనమని కొనియాడారు. ఈ అంతర్జాతీయ ధృవీకరణ సంస్థ కార్యకలాపాల సామర్థ్యాన్ని మరింత మెరుగుపరచడమే కాకుండా, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా బాధ్యతను పెంచుతుందని అధికారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ చైర్మన్ అన్ మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి. పాటిల్, ఐ ఎస్ ఓ ప్రతినిధి శివయ్య లు పాల్గొన్నారు

మే రెండో వారంలో భారత్ కు ఎస్-400 గగనతల వ్యవస్థలు

వార్తా 3 లో

ప్రజాబలం

29 ఏప్రిల్ 2026 బుధవారం

బంగారం ఆస్తే...

బంగారం కొనుగోలు విషయంలో భారతీయుల ట్రెండ్ మారుతోంది. ఒకప్పుడు బంగారం అంటే అలంకరణ సాధనంగానే చూసేవారు, నగలనే అధికంగా కొనుగోలు చేసేవారు. అయితే, పసిడి ధరలు రికార్డ్ గరిష్ఠాలకు చేరిన క్రమంలో బంగారాన్ని పెట్టుబడిగా పరిగణిస్తున్నారు. బంగారంలో పెట్టుబడి పెడితే అధిక లాభం పొందొచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం దేశీయంగా బంగారం, వెండి ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. గతంలో పరుగులు పెట్టిన రెండు లోహాల ధరలు.. ఇప్పుడు క్రమంగా దిగి వస్తున్నాయి. ధరలు తగ్గడం మహిళలకు కొంత ఉపశమనం కలిగించినట్లే. అయితే దేశీయ మార్కెట్లో గత మూడు రోజులుగా బంగారం, వెండి ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. ఏప్రిల్ 28న కూడా స్వల్పంగా తగ్గాయి. గత వారం రోజులుగా భారీగా తగ్గిన ధరలు ఒక్కసారి మాత్రమే పెరిగాయి. అంటే ఇదే మంచి అవకాశంగా చెప్పవచ్చు. అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు పెరగడం, క్రూడ్ ఆయిల్ ధరలు రికార్డ్ స్థాయిలోనే ఉండడం వంటివి బంగారం ధరలు తగ్గేందుకు కారణమవుతున్నట్లు బులియన్ మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ నెలలో 24న బంగారం ధరలు కాస్త పెరిగినట్లు కనిపించినా రికార్డ్ గరిష్ఠాలకు చాలా దూరంగానే ఉన్నాయి2025లో బంగారాన్ని పెట్టుబడుల కోసం కొనుగోలు చేయడం 40 శాతానికి చేరినట్లు ఓ నివేదిక వెల్లడించింది. ముందు ముందు ఇది మరింత పెరగవచ్చు నివేదిక తెలిపింది.అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులతో బంగారం ధరలు రికార్డ్ స్థాయికి చేరుకున్నాయి. ఏడాది కాలంలోనే ఊహించని విధంగా పెరిగాయి. ఈ క్రమంలో భారతీయులు బంగారం కొనుగోలు చేసే దృక్పథం మార్చుకుంటున్నారని ప్రముఖ రేటింగ్స్ ఏజెన్సీ కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ నివేదిక వెల్లడించింది. భారత్‌లో గత ఏడాది 2025లో బంగారాన్ని పెట్టుబడుల కోసం కొనుగోలు చేయడం 40 శాతానికి ఎగబాకినట్లు తెలిపింది. అంతకు ముందు ఏడాది వరకు అది 30 శాతానికి లోపే ఉండాదని, మిగితా 70 శాతం పైన అలంకరణ కోసం బంగారు ఆభరణాలు మాత్రమే కొనుగోలు చేసే వారని పేర్కొంది. అయితే, ధరలు పెరుగుతుండడం వంటి కారణాలతో నగలకు బదులుగా ఆస్తులకు ప్రాధాన్యత ఇస్తూ పెట్టుబడులు పెడుతున్నారని పేర్కొంది.గత ఏడాదిలో పెట్టుబడుల కోసం మేలిమి బంగారం కొనుగోళ్లు, డిజిటల్ విధానంలో కొనుగోళ్లు అనేవి ఎక్కువగా జరిగాయని కేర్ ఎడ్జ్ నివేదిక పేర్కొంది. బంగారం ఈటీఎఫ్‌ల ద్వారానే ఏకంగా 37.5 టన్నుల బంగారానికి సమానమైన పెట్టుబడులు వచ్చినట్లు తెలిపింది. గత 10 సంవత్సరాల కాలంలో వచ్చిన మొత్తం పెట్టుబడుల కంటే ఇది ఎక్కువగా ఉండడం గమనార్హం. 2026-27 ఆర్థిక సంవత్సరం లోనూ మొత్తం బంగారం వినియోగంలో పెట్టుబడుల విలువ 35-40 శాతం వరకు ఉండవచ్చని అంచనా వేసింది. 2026లోనూ బంగారం ధరలు గరిష్ఠ స్థాయుల్లోనే కొనసాగుతాయని కేర్ ఎడ్జ్ డైరెక్టర్ అఖిల్ గోయల్ అంచనా వేశారు.గత ఏడాది 2025లో నగల గిరాకీ, విలువ పరంగా వార్షికంగా 10 శాతం మేర పెరిగి రూ.4.8 లక్షల కోట్లకు చేరుకున్నట్లు తెలిపింది. అధిక ధరల కారణంగా వినియోగదారులు తేలికైన, తక్కువ క్యారెట్ల ఆభరణాలకు మొగ్గు చూపుతున్నారని, అలాగే ఈ లోహాల అమ్మకాల పరిమాణ 15 శాతం మేర పడిపోయినట్లు నివేదిక వెల్లడించింది. 2025-26 ఆర్థిక ఏడాదిలో ఆభరణాల పెద్ద వ్యాపారులు 35 శాతం ఆదాయ వృద్ధిని నమోదు చేయగా 2026-27 ఆర్థిక సంవత్సరంలో అది 20-25 శాతానికి తగ్గవచ్చని అంచనా వేసిందిఈ ట్రెండ్ భారత్‌కు మాత్రమే పరిమితం కాలేదని, ప్రపంచ వ్యాప్తంగా ప్రజల ధోరణి మారుతోందని కేర్ ఎడ్జ్ రేటింగ్స్ తెలిపింది. 2025లో బంగారం పెట్టుబడుల డిమాండ్ 2175 మెట్రిక్ టన్నులకు చేరిందని, అది అంతకు ముందు 2020లోని 1805 టన్నులను మించినట్లు తెలిపింది. ఇందులో ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ వాటానే ఎక్కువగా ఉందని తెలిపింది. అలాగే బంగారు కడ్డీలు, నాణెల కొనుగోలు సైతం పెరిగిందని, అది 12 ఏళ్ల గరిష్ఠ స్థాయికి చేరుకుందని తెలిపింది. భారత్‌లోనూ గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి పెట్టుబడులు భారీగా వస్తున్నట్లు నివేదిక తెలిపింది. 2025 ఒక్క ఏడాదిలోనే 37.5 టన్నులకు సరిపడా పెట్టుబడులు వచ్చాని పేర్కొంది.అహ్మదాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఇండియా గోల్డ్ పాలసీ సెంటర్ హెడ్ ప్రొఫెసర్ సుందరవల్లి నారాయణస్వామి అంచనాల ప్రకారం ఆర్‌బీఐ వద్ద సుమారు 800-820 టన్నుల బంగారం ఉంది. అలాగే దేశంలో ఆర్థికంగా వెలికితీయగల బంగారం సుమారు 70-80 టన్నులు మాత్రమే" అని ఆయన చెప్పారు.ఆర్థికంగా వెలికితీయగల బంగారం అంటే ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానంతో లాభదాయకంగా తవ్వి తీసుకోగల బంగారం అని అర్థం.భారత్‌లో మంచి నాణ్యత గల బంగారం తక్కువగా ఉంది, కాబట్టి ఇక్కడ మైనింగ్ పోటాపోటీగా ఏమీ జరగదు" అని ప్రొఫెసర్ సుందరవల్లి అంటున్నారు."భారతీయుల దగ్గర చాలా బంగారం ఉంది. ఎంత బంగారం ఉందనే విషయంపై భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ అది సాధారణంగా 25 వేల నుంచి 27 వేల టన్నుల వరకు ఉంటుందని భావిస్తున్నారు" అని ఆయన అన్నారు.ఈ అంకెకు ఆధారం ఏంటని అడగ్గా, ఇది చాలా మంది నమ్మే ఒక సాధారణ అంచనా మాత్రమే అని ఆయన అన్నారు."ప్రతిఏటా 600 నుంచి 700 టన్నుల బంగారం దిగుమతి అవుతుండగా, ఎగుమతి చాలా తక్కువ. అందుకే ఈ బంగారం ఇళ్లలో ఉండిపోయింది" అని ఆయన చెప్పారు.భారత్ వద్ద 2026 ఫిబ్రవరి నాటికి అధికారికంగా సుమారు 880 టన్నుల బంగారం ఉన్నట్టు వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ పేర్కొంది.ఈ విషయంలో భారత్ ప్రపంచంలో 9వ స్థానంలో ఉంది. దీనికంటే ముందు అమెరికా, జర్మనీ, అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్), ఇటలీ, ఫ్రాన్స్, రష్యా, చైనా, స్విట్జర్లాండ్ ఉన్నాయి.అయితే అధికారిక నిల్వలు భారతదేశపు బంగారు కథలో ఒక భాగం మాత్రమే."మన దగ్గర సుమారు 50 కోట్ల టన్నుల పసిడి ధాతువు (అంటే బంగారం కలిగిన రాయి/మట్టి) ఉంది, కానీ ఉత్పత్తి చాలా తక్కువగా ఉంది" అని థరూర్ తన వ్యాసంలో రాశారు.దేశంలో మొత్తం 518.23 మిలియన్ టన్నుల పసిడి ధాతువు ఉన్నట్టు నేషనల్ మినరల్ ఇన్వెంటరీ చెబుతోంది.అయితే దీనర్థం ఈ పసిడిధాతువునంతటినీ వెలికితీయడం తేలికైన పని అని కాదు. ఇందులో 494.50 మిలియన్ టన్నుల బంగారం వెలికితీయడం కష్టపమైనది కాగా, 23.72 మిలియన్ టన్నులను మాత్రం రిజర్వ్‌గా పరిగణిస్తారు.రిజర్వ్ అంటే బంగారాన్ని వెలికితీయడం లాభదాయకంగానూ, సులభంగా సాధ్యమయ్యే స్థితి.

రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల పెట్రోల్, డీజిల్ కొరత

మొదటి పేజీ తరువాయి

పరిమిత స్థాయిలోనే పెట్రోల్ : సంగారెడ్డి జిల్లాలో మొత్తం 193 బంకులు ఉన్నాయి. అందులో ఎక్కువ శాతం బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. డీజిల్ ఎక్కడా దొరకడం లేదని, కొన్ని బంకుల్లో మాత్రమే అదీనూ పరిమిత స్థాయిలోనే పెట్రోల్ లభిస్తుందని వాహనదారులు చెబుతున్నారు. బండి చక్రం నడిస్తేనే తమ బతుకు చక్రం సాగుతుందని వారు చెబుతున్నారు.

కొరతగా ఉందన్న ప్రచారం : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని పెట్రోల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ కొరతగా ఉందన్న ప్రచారంతో వాహనదారులు క్యూ లైన్లు కడుతున్నారు. పెట్రోల్, డీజిల్ దొరకడం లేదన్న వదంతులతో బంకుల్లో వాహనాలతో బారులు తీరిన వాహనదారులు, పెద్ద డబ్బాల్లో పెట్రోల్, డీజిల్ తీసుకెళ్తున్నారు. కొరత లేకుండా పెట్రోల్, డీజిల్ అందించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మరోవైపు బంకుల్లో పెట్రోల్, డీజిల్ అయిపోగానే, సరిపడా స్టాక్ బంకులకు వస్తోందని నిర్వాహకులు చెబుతున్నారు. వాహనదారులు వదంతులను నమ్మి బంకుల్లో బారులు తీరి, పెద్ద డబ్బాల్లో పెట్రోల్, డీజిల్ తీసుకెళ్లవద్దని సూచిస్తున్నారు.స్టాక్ ఉన్నప్పటికీ పంపిణీ చేయని పరిస్థితి : మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా పెట్రోల్, డీజిల్?ల కోసం రైతులు, వాహనదారులు బంకుల ముందు బారులు తీరుతున్నారు. మహబూబాబాద్ పట్టణంలోని ఇల్లందు రోడ్డులో పెట్రోల్? బంకులో స్టాక్ ఉన్నప్పటికీ పంపిణీ చేయడం లేదంటూ బంక్ ఎదుట రహదారిపై వాహనదారులు, రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈ ఆందోళనతో మహబూబాబాద్ఇల్లందు ప్రధాన రహదారిపై ఇరువైపుల కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ఈ ప్రాంతంలో రాకపోకలు స్తంభించాయి. విషయం తెలుసుకున్న సీఐలు అంజలి, మహేందర్ రెడ్డి సిబ్బందితో పెట్రోల్ బంక్ వద్దకు చేరుకొని అందరికీ నచ్చచెప్పి రాస్తారోకోను విరమింపచేశారు. అర్ధరాత్రి దాటినా బంకుల ముందు క్యూ లైన్?లే దర్శనమిచ్చాయి.

ఎక్కడికక్కడే నిలిచిపోయిన ప్రజా రవాణా : పెట్రోల్, డీజిల్ స్టాక్ లేకపోవడంతో ప్రజా రవాణా వ్యవస్థ వాహనాలు, సరకు రవాణా వాహనాలు, వ్యవసాయ, వాణిజ్య యంత్రాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం పెట్రోల్, డీజిల్ ఎప్పుడు వస్తుందో చెప్పేవారే కరవయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వాహనదారులు అయోమయంలో పడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంకులో డీజిల్ అందుబాటులో ఉన్నప్పటికీ పంపిణీ చేయడం లేదని అంటున్నారు. గంటల తరబడి డీజిల్ కోసం బంకు ఎదుట నిరీక్షిస్తున్నామని చెబుతున్నారు.

హార్వెస్టర్లకు డీజిల్ దొరకక రైతుల ఇబ్బందులు : పలు ప్రాంతాల్లో బంకు నిర్వాహకులు తాళం వేసుకొని వెళ్లిపోయారని వాపోయారు. వరి, మొక్క జొన్న కోతలు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో కోత యంత్రాలకు (హార్వెస్టర్స్) డీజిల్ దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణంలో మార్పులు చోటు చేసుకొని వర్షాలు పడితే కల్లాల్లో ఉన్న పంటలు మొలకెత్తే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డీజిల్ పంపిణీ చేయాలని కోరుతున్నారు. లేదంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరిస్తున్నారు. జిల్లా సివిల్ సప్లై అధికారులు మాత్రం జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత లేదని, ఎవరూ ఆందోళన చెందొద్దని చెప్పడం గమనార్హం.

ఇంధన కొరత లేదు

రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ నిల్వలు, సరఫరా సమృద్ధిగా ఉన్నట్లు పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. డిమాండ్?కు మించి సరఫరా చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. నిన్న డిమాండుకు మించి పెట్రోల్, డీజిల్?లను 29 వేల 939 కిలో లీటర్లు సరఫరా చేశామన్నారు. సగటున రోజుకు 5,883 కిలో లీటర్లు పెట్రోల్, 7,348 కిలో లీటర్ల డీజిల్?కు డిమాండ్ ఉంటుందన్నారు. కానీ నిన్న మాత్రం 11,490 కిలో లీటర్లు పెట్రోల్, 18,449 కిలో లీటర్లు డీజిల్?ను వాహనదారులకు సరఫరా చేసినట్లు వెల్లడించారు. సరఫరాపై క్షేత్ర స్థాయి అధికారులు, పెట్రోల్ కంపెనీల ప్రతినిధులతో తరచూ సమీక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. పెట్రోల్, డీజిల్ కొరత ఉందంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలను వాహనదారుల నమ్మొద్దన్ని ఆయన కోరారు. అపోహలతో పెట్రోల్, డీజిల్?ను అవసరానికి మించి నిల్వ చేసుకోవద్దని వినియోగదారులకు పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర సూచించారు.

ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియను వేగవంతం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

గతంలో దరఖాస్తు చేసుకోకపోతే, ఇప్పటికైనా చేసుకోవచ్చు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి హైద్రాబాద్ ఏప్రిల్ 28 :ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియను వేగవంతం చేసేందుకు జిల్లా కలెక్టర్లకు మరిన్ని బాధ్యతలను అప్పగిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు నిరంతర ప్రక్రియ అని స్పష్టం చేశారు. గతంలో దరఖాస్తు చేసుకోకపోతే, ఇప్పటికైనా చేసుకోవచ్చునన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం పర్యవేక్షణ కోసం ఉమ్మడి జిల్లాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించనున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. సాదాబైనామాలపై తుది నిర్ణయం ఆర్డీవోలదేనని మంత్రి తెలిపారు. సర్వేతోనే భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. తహసీల్దార్ కార్యాలయాలకు కొత్త భవనాలు ప్రతీ జిల్లా కేంద్రంలో అత్యాధునిక హంగులతో నిర్మించనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.ప్రతి వారం సమీక్షించండి : ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని మరింత వేగంగా, పారదర్శకంగా అమలు చేయడానికి అధికార వికేంద్రీకరణ చేసి జిల్లా కలెక్టర్లకు మరిన్ని బాధ్యతలు అప్పగిఎస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, జిల్లా హౌసింగ్ అధికారులతో ప్రతి వారం సమీక్షించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుని, సమస్యలు రాకుండా పర్యవేక్షించేందుకు ఉమ్మడి జిల్లాలవారీగా ప్రత్యేక అధికారులను నియమిస్తున్నట్లు వెల్లడించారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు నిరంతర ప్రక్రియ అని స్పష్టం చేసిన మంత్రి పొంగులేటి, గతంలో దరఖాస్తు చేసుకోని వారు ఇప్పుడు దరఖాస్తు చేసుకున్నా అర్హత ఉంటే మంజూరు చేస్తామని తెలిపారు. ప్రజాప్రతినిధులు విస్తృతంగా భాగస్వామ్యులు కావాలన్నారు. రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గానికి 3,500 ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు. లబ్ధిదారులు వేగంగా ఇళ్లను నిర్మించుకునేలా ఎమ్మెల్యేలు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. వివిధ కారణాలతో ఇళ్లు నిర్మించుకోలేని వారు, తమకు అవసరం లేదని చెబితే వారి స్థానంలో మరొకరికి కేటాయించాలని సూచించారు. ఇంటి బేస్‌మెంట్ నిర్మాణం పూర్తయిన తరువాత రూ.లక్ష మంజూరు చేశాక, సాంకేతిక కారణాలతో బిల్లులు రాని వారికి వెంటనే విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు.పట్టణ ప్రాంతాల్లో జీ ప్లస్ వన్ పద్ధతిలో : పేదవారి అభివృద్ధి, సంక్షేమం విషయంలో అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని మంత్రి తెలిపారు. డబుల్ బెడ్ రూం ఇళ్లను పూర్తి చేయాలని మంచి నీరు, కరెంటు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులను కల్పించాలని, ఇళ్లు ఏ దశలో ఉన్నా వెంటనే లబ్ధిదారులకు కేటాయించాలని అధికారులను

ఆదేశించారు.పట్టణప్రాంతాల్లోజీప్లస్‌వన్ పద్ధతిలో ఇందిరమ్మఇళ్లనునిర్మించనున్నట్లు చెప్పారు.

త్వరగా దరఖాస్తులను పరిష్కరిస్తాం

భూసర్వేతోనే భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ఈ దిశగా ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా సర్వే మ్యాపుతో రిజిస్ట్రేషన్ చేస్తున్నామని, రిజిస్ట్రేషన్ పూర్తయిన తరువాత సర్వే పటం నెంబరు, భూదార్ నెంబరు కేటాయిస్తున్నామన్నారు. సాదాబైనామాలకు సంబంధించి వీలైనంత త్వరగా దరఖాస్తులను పరిష్కరిస్తామని తెలిపారు. కొనుగోలుదారుడు డిక్లరేషన్ ఇస్తే సరిపోతుందని, సాదాబైనామాల దరఖాస్తులను వేగంగా పరిష్కరించేందుకు ఆర్డీవోలకే అధికారాలు ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా దశలవారీగా తహసీల్దార్ కార్యాలయాలను నిర్మిస్తామన్నారు. మొదటి విడతలో శిథిలావస్థకు చేరిన చోట నిర్మిస్తామన్నారు.ఉమ్మడి సర్వేల ద్వారా శాశ్వత పరిష్కారం : ప్రతీ జిల్లా కేంద్రంలో అత్యాధునిక వసతులతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మిస్తున్నట్లు తెలిపిన మంత్రి, అవసరమైన ప్రతిపాదనలను రూపొందించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. దశాబ్దాల నుంచి ఉన్న రెవెన్యూ, అటవీ, దేవాదాయ, వక్ఫ్ శాఖల మధ్య సరిహద్దు వివాదాలకు ఉమ్మడి సర్వేల ద్వారా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. సమావేశాల్లో మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, వివేక్, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, పోచారం శ్రీనివాస రెడ్డి, షబ్బీర్ అలీ, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, రెవెన్యూ కార్యదర్శి లోకేశ్ కుమార్, హౌజింగ్ కార్యదర్శి వీ.పీ.గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా ప్రజాబలం ప్రతినిధి:రంగారెడ్డి జిల్లా జల్ పల్లి లో ఛత్రపతి శివాజీ మరాఠా సాంస్కృతిక ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రి శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి తదితరులు

కెసిఆర్... ఒక గతం

రేవంత్ రెడ్డి.. భవిష్యత్తు

మెట్టు సాయికుమార్ చైర్మన్ ఫిషరీస్

హైద్రాబాద్ ఏప్రిల్ 28 :కెసిఆర్... ఒక గతం రేవంత్ రెడ్డి.. భవిష్యత్తు అని ఫిషరీస్ కార్పొరేషన్ చెర్మెన్‌మెట్టు సాయికుమార్ అన్నారు.మంగళవారం గాంధీ భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూదీతీం పార్టీ వారి కమిటీలను రద్దు చేసింది.. కానీ బిఆర్ఎస్ పార్టీని తెలంగాణ ప్రజలు రద్దు చేసారు...కుటుంబ పాలనా.. కోసం కెసిఆర్ ఆరాట పడుతున్నారని ఎద్దేవా చేశారు.

మే రెండో వారంలో భారత్ కు ఎస్-400

గగనతల వ్యవస్థలు

న్యూ డిల్లి ఏప్రిల్ 28 (ఎక్స్) ప్రెస్ న్యూస్) : రష్యా నుంచి నాల్గో విడత అత్యాధునిక ఎస్-400 గగనతల వ్యవస్థలు భారత్‌కు చేరేందుకు సిద్ధమయ్యాయి. మే రెండో వారంలో భారత్‌కు రష్యా వీటిని డెలివరీ చేయనున్నట్లు రక్షణ వర్గాలు తెలిపాయి. గతవారమే రష్యాలో షిప్పింగ్‌కు సిద్ధంగా ఉన్న ూ-400 వ్యవస్థలను భారత వాయుసేన ఉన్నతాధికారులు తనిఖీ చేశారని పేర్కొన్నాయి. పాకిస్థాన్ నుంచి వచ్చే ముప్పును నిర్మూలించేందుకు రాజస్థాన్‌లోని సరిహద్దు వెంబడి వీటిని మోహరించనున్నట్లు తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ నుంచి వచ్చిన ప్రతీ ముప్పును ఈ ఎస్-400లోని క్షిపణులు అత్యంత కచ్చితత్వంతో అడ్డుకున్నాయి. అందుకు గుర్తుగా ఆపరేషన్ సిందూర్ వార్షికోత్సవం రోజునే వీటిని భారత్‌కు డెలివరీ చేసేలా అధికారులు ప్రణాళికలు రచించారు. రష్యాతో కుదిరిన ఒప్పందంలో భాగంగా ఐదో, చివరి విడత ఎస్-400లు నవంబర్‌లో భారత్‌కు చేరనున్నాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ మొత్తం 11 దీర్ఘశ్రేణి ఎస్-400 క్షిపణులను ప్రయోగించి, పాక్ యుద్ధవిమానాలు, గగనతల ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, రవాణా విమానాలతో సహా పలు వైమానిక ముప్పులను నిర్వీర్యం చేసినట్లు సమాచారం. అప్పుడు ఇవి ప్రదర్శించిన సామర్థ్యాన్ని చూసిన తర్వాత మరో ఐదు ఎస్-400లను కొనేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

గూగుల్ క్లౌడ్ ఇండియా ఏఐ హబ్ శంకుస్థాపన

గూగుల్ భారత్ గ్రోత్ ఇంజన్ గా మారుతుంది

ముఖ్యమంత్రి చంద్రబాబు

విశాఖగూగుల్ క్లౌడ్ ఇండియా ఏఐ హబ్ కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేసారు. తరువాత ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఏపీ చరిత్రలో కొత్త టెక్ శకానికి శ్రీకారం చుడుతున్న రోజు ఇది. గూగుల్ రాక విశాఖకే కాదు ఏపికి ఓ గేమ్ చేంజర్. 30 ఏళ్ల క్రితం సైబరాబాద్ ను ఐటీ సిటీగా నిర్మాణం చేస్తే సంపద సృష్టికి కేంద్ర అయ్యింది. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో భారత చరిత్రలో 2026 ఏప్రిల్ 28వ తేదీ శాశ్వతంగా నిలిచిపోతుంది. 5 బిలియన్ డాలర్ల పెట్టుబడితో టెక్నాలజీ రంగంలో ఏపీ తలెత్తుకుని నిలబడుతుంది. ఆసియాలోనే అతిపెద్ద డేటా సెంటర్ ఇది... దేశానికి ఏఐ డేటా గేట్ వేగా ఏపీ నిలుస్తుందని అన్నారు.

సెర్చ్ ఇంజన్ గా మొదలైన గూగుల్ భారత్ గ్రోత్ ఇంజన్ గా మారుతుంది. ప్రతీ ఒక్కరూ గూగుల్ లో సెర్చ్ చేస్తే గూగుల్ ఏపీని వెతుక్కుంది. ప్రతిష్టాత్మక సంస్థ అదానీ గ్రూప్, ఎయిర్ టెల్ లాంటి దిగ్గజ సంస్థలు ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేస్తాయి. 2028 సెప్టెంబరు నాటికి ఈ ప్రాజెక్టు పూర్తి చేసి ప్రారంభించాలని కోరుతున్నాను. ప్రాజెక్టు సకాలంలో పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుంది. ఈ ప్రాంతానికి నీటి సమస్య లేదు. 60 రోజుల్లోనే గోదావరి నీరు విశాఖకు తీసుకువస్తాం. ఏపీ ప్రభుత్వం అందిస్తున్న స్పీడ్ ఆఫ్ గవర్నెన్సుకు గూగుల్ ఏఐ డేటా సెంటర్ నుంచి కూడా సహకారం తీసుకుంటాం. నీ ఎం ఓ లోని నలుగురు కార్యదర్శులతో పాటు నాకు కొత్తగా ఏఐ అసిస్టెంట్ కూడా సుపరిపాలన అందించేందుకు సహకారం అందిస్తుంది. బులెట్ ట్రైన్ లాంటి ప్రాజెక్టుతో పాటు రాష్ట్రంలోని వివిధ రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తున్నాం. వచ్చే నాలుగేళ్లలో ఈ ప్రాజెక్టులు సాకారమయ్యేలా చూడాలని

కోరుతున్నాను. జూన్ 1వ తేదీ నుంచి సౌత్ కోస్టల్ రైల్వే జోన్ కు అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేస్తున్నందుకు రైల్వే మంత్రికి ధన్యవాదాలని అన్నారు.

ఈస్ట్ వెస్ట్ కారిడార్ ను కలపటం ద్వారా ఈ ప్రాంతాన్ని లాజిస్టిక్స్ పరంగా కూడా అభివృద్ధి చేయవచ్చు. దేశంలోకి వచ్చిన 25 శాతం పెట్టుబడులు ఏపీకే వచ్చాయి. ఒప్పందాలకు, పెట్టుబడులకే కాదు... ప్రాజెక్టుల గ్రౌండింగ్ లో కూడా ఏపీ నెంబర్ 1గా ఉంది. పోలవరం ప్రాజెక్టు 2027 నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. 90 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి ఇప్పటికే ఒప్పందం చేసుకున్నాం. గూగుల్ రావటంతో విశాఖలోని యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు వస్తాయి. ఉత్తరాంధ్ర అంటే గతంలో వలసలు, నిరుద్యోగం కానీ ఇప్పుడు ఇతర ప్రాంతాల నుంచి ఉత్తరాంధ్రకే వలస వస్తారు. ఇక ట్యాలెంట్ మైగ్రేషన్ ముగిసింది. జూలైలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేస్తాం. 2028 నాటికి ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ నుంచి కూడా తొలి షిప్ మెంట్ ఎగుమతి అవుతుంది. ? రెన్యూ పవర్ ద్వారా ఇంగాట్ సోలార్ వేఫర్స్ ఉత్పత్తి కూడా మొదలవుతుంది. అనకాపల్లి జిల్లా మరో రంగారెడ్డి జిల్లాగా తయారై అభివృద్ధికి కేంద్రం అవుతుందని అన్నారు.

అండర్ వరల్డ్ డాన్ దావూద్

ఇబ్రహీంఅనుచరుడు, డ్రగ్ కింగ్‌పిన్ సలీం డోలా

న్యూ డిల్లి ఏప్రిల్ 28 ;ముంబయి బాంబు పేలుళ్ల సూత్రధారి, అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీంకు షాక్ తగిలింది. తుర్కియేలోని ఇస్తాంబుల్‌లో అరెస్టైన ఆయన అనుచరుడు, డ్రగ్ కింగ్‌పిన్ సలీం డోలాను ప్రత్యేక విమానంలో దిల్లీకి తీసుకొచ్చారు భారత అధికారులు. దావూద్ డ్రగ్ సామ్రాజ్యం వెనుక కీలక వ్యక్తిగా ఉన్న సలీం డోలా ప్రస్తుతం నిఘా సంస్థల విచారణను ఎదుర్కొనున్నాడు. సలీం డోలాను అధికారులు ముంబయి పోలీసులకు అప్పగించనున్నారు. ఆ తర్వాత అతడ్ని దర్యాప్తు సంస్థలు అతడిని విచారించనున్నాయి.

తుర్కియే భద్రతా సంస్థలు, ఇస్తాంబుల్ పోలీసులు సంయుక్తంగా ఓ భారీ ఆపరేషన్ జరిపి భారత్‌కు చెందిన మోస్ట్ వాంటెడ్ డ్రగ్ స్మగ్లర్ సలీం డోలా ఏప్రిల్ 25న అరెస్ట్ చేశారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా కేసులో మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న డోలా బెలికెదుజు జిల్లాలోని ఒక నివాసంలో దాక్కుని ఉన్నట్లు ఇస్తాంబుల్ పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో విస్తృతమైన సాంకేతిక, భౌతిక నిఘా ద్వారా తుర్కియే భద్రతా సంస్థలు, పోలీసులు అనుమానితుడి కచ్చితమైన ఆచూకీని నిర్ధారించుకున్నారు. అనంతరం ఆపరేషన్ నిర్వహించి సలీం డోలాను విజయవంతంగా పట్టుకున్నారు. తాజాగా డ్రగ్ కింగ్‌పిన్ సలీంను భారత్‌కు అప్పగించారు. కాగా, ఇప్పటికే సలీం డోలాపై భారత్ ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసు జారీ చేసింది.

ముంబయిలో సలీం అనుచరులు అరెస్ట్

తుర్కియేలో మాదకద్రవ్యాల స్మగ్లింగ్ కేసులో కీలక సూత్రధారి సలీం అలీ అరెస్ట్ కావడంతో అతడిని దర్యాప్తు సంస్థలు విచారించనున్నాయి. కాగా, ముంబయిలోని కుర్లా ప్రాంతంలో ఇటీవలే సలీం అలీ అనుచరులు పోలీసులకు పట్టుబడ్డారు. వారు పోలీసుల ఎదుట సలీం డోలా ఆదేశాల మేరకే తాము పనిచేస్తున్నట్లు ఒప్పుకున్నారు. ఈ క్రమంలో సంబంధిత దాడులలో అధికారులు 126కిలోల 141 గ్రాముల మెఫెడ్రోన్, రూ.25,22,000 నగదును స్వాధీనం చేసుకున్నారు.

సలీం డోలాపై భారత్ ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసు జారీ చేసింది. డోలాపై 1985 నాటి నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌డీపీఎస్) చట్టం కింద పలు అభియోగాలను ఎదుర్కొంటున్నారని అందులో స్పష్టం చేసింది. అంతలో ఇస్తాంబుల్ పోలీసులు సలీం డోలాను అరెస్ట్ చేశారు. అనంతరం మంగళవారం అతడ్ని భారత్‌కు అప్పగించారు. డోలాను ప్రత్యేక విమానంలో దిల్లీకి తీసుకొచ్చారు భారత అధికారులు. కాగా, డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ చట్టం ప్రకారం తీవ్రమైన నేరాలకు కనీసం పదేళ్ల జైలు శిక్ష పడుతుంది. బెయిల్‌కు కఠినమైన నిబంధనలు ఉంటాయి. ముఖ్యంగా వాణిజ్య స్థాయి పరిమాణంలో మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నప్పుడు ఈ నిబంధనలు మరింత కఠినంగా ఉంటాయి. సలీం డోలా చేసిన నేరాలకు గాను, అధికారులు ఇప్పుడు అతనిపై ఎన్‌డీపీఎస్ చట్టం, ఇతర చట్టాలలోని నిబంధనల కింద అభియోగాలు మోపనున్నట్లు తెలుస్తోంది.

దావూద్‌కు షాక్

మోస్ట్ వాంటెడ్ దావూద్ ఇబ్రహీంకు భారత్‌కు చెందిన సలీం డోలా కీలక అనుచరుడు. దావూద్‌కు చెందిన డి-కంపెనీ విదేశాల్లో నిర్వహించే డ్రగ్ ఆపరేషన్లకు సలీం డోలానే ప్రధాన సూత్రధారిగా వ్యవహరిస్తున్నారు. ఇతడి కనుసన్నల్లో ఏడాదికి రూ.5వేల కోట్ల డ్రగ్స్ వ్యాపారం సాగుతోందనే ఆరోపణలు ఉన్నాయి. అయితే తాజాగా సలీం డోలా పోలీసులకు పట్టుపడడం వల్ల దావూద్ ఇబ్రహీంకు షాక్ తగిలినట్లైంది.అయితే సలీం డోలాను పట్టుకునే ప్రయత్నం భారత్ చాలా కాలం నుంచి చేస్తోంది. కొన్నాళ్ల క్రితం సలీం డోలా డ్రగ్స్ నెట్‌వర్క్‌కు చెందిన సలీమ్ సోహైల్ షేక్ అనే డీలర్ దుబాయ్‌లో అరెస్ట్ అయ్యాడు. అతడిని భారత్‌కు అప్పగించిన తర్వాత ఈ డ్రగ్ నెట్‌వర్క్ తీగ లాగితే 2025 జూన్‌లో సలీమ్ డోలా కుమారుడు తాహెర్ దొరికాడు. తాహెర్‌ను కూడా యూఏఈ నుంచి భారత్‌కు తీసుకొచ్చారు. ఇక్కడ విచారణ జరిపారు. ఈ క్రమంలో తాహెర్ తండ్రి సలీమ్ డోలా ఆచూకీ దొరికినట్లు తెలుస్తోంది.

సైనిక వ్యయంలో భారత్ కు ఐదో స్థానం

అత్యధికంగా సైనిక వ్యయం చేసే దేశాల జాబితాలో భారత్ ఐదో స్థానంలో నిలిచింది. స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సిప్రి) విడుదల చేసిన నివేదిక ప్రకారం 2025లో భారత్ రక్షణ వ్యయం గణనీయంగా పెరిగింది. ఈ జాబితాలో అమెరికా, చైనా, రష్యా, జర్మనీ తొలి నాలుగు స్థానాల్లో ఉన్నాయి. ప్రపంచ మొత్తం సైనిక వ్యయంలో భారత్ వాటా 3.2 శాతంగా నమోదైంది.2025లో భారత్ రక్షణ వ్యయం 92.1 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇది 2024తో పోలిస్తే 8.9 శాతం అధికం. పాకిస్థాన్తో సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' వంటి పరిణామాల కారణంగా సైనిక సన్నద్ధతను పెంచుకోవడానికి భారత్ అత్యవసర ఆయుధ కొనుగోళ్లు చేపట్టింది. ఈ కారణాలతోనే రక్షణ వ్యయం పెరిగినట్లు నివేదిక స్పష్టం చేసింది. ప్రపంచంలో రెండో అతిపెద్ద రక్షణ వ్యయం కలిగిన చైనా, తన బడ్జెట్‌ను 7.4 శాతం పెంచుకుని 336 బిలియన్ డాలర్లకు చేర్చింది. మరోవైపు, పాకిస్థాన్ కూడా తన సైనిక వ్యయాన్ని 11 శాతం పెంచి 11.9 బిలియన్ డాలర్లకు తీసుకువెళ్లింది. ప్రపంచ దేశాల జాబితాలో పాకిస్థాన్ 31వ స్థానంలో నిలిచింది.

అప్పుడు సైబరాబాద్.. ఇప్పుడు గూగుల్

రాకతో విశాఖ

విశాఖపట్టణం, ఏప్రిల్ 28 ప్రపంచమంతా గూగుల్‌లో సెర్చ్ చేస్తుంటే.. గూగుల్ మాత్రం ఏపీని ఎంచుకుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఏపీ చరిత్రలో కొత్త టెక్ శకానికి శ్రీకారం చుట్టిన రోజు ఇది. 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో టెక్నాలజీ రంగంలో ఏపీ తలెత్తుకుని నిలుస్తుందన్నారు.. ఆసియాలోనే అతిపెద్ద డేటా సెంటర్ ఇదేనని.. దేశానికి ఏఐ డేటా గేట్ వేగా ఏపీ నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో భారత చరిత్రలో 2026 ఏప్రిల్ 28వ తేదీ శాశ్వతంగా నిలిచిపోతుంది. విశాఖపట్నంలో గూగుల్ ఏఐ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన ప్రసంగిస్తూ, ఈ ప్రాజెక్టు కేవలం విశాఖకే కాకుండా మొత్తం రాష్ట్రానికే ఒక గేమ్ ఛేంజర్ అని పేర్కొన్నారు. 1997లో తాను హైటెక్ సిటీని ప్రారంభించి సైబరాబాద్ నగరాన్ని నిర్మించానని, ఇప్పుడు గూగుల్ రాకతో ఏపీ టెక్నాలజీ ప్రపంచంలో సగర్వంగా తలెత్తుకుని నిలబడుతుందని ధీమా వ్యక్తం చేశారు. సెర్చ్ ఇంజిన్‌గా మొదలైన గూగుల్, ఇప్పుడు భారత్ గ్రోత్ ఇంజిన్‌గా మారబోతోందని, ఒక గిగావాట్ సామర్థ్యంతో పనిచేసే ఈ డేటా సెంటర్ ద్వారా ఆంధ్రప్రదేశ్ అంతర్జాతీయ డేటా గేట్‌వేగా నిలుస్తుందని స్పష్టం చేశారు.ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు వెనుక మంత్రి నారా లోకేష్ కృషిని సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా కొనియాడారు. లోకేష్ అమెరికాలోని గూగుల్ క్యాంపస్‌కు వెళ్లి వారిని ఏపీకి ఆహ్వానించారని, ఏ పని అప్పగించినా పట్టుదలతో పూర్తి చేస్తారని ప్రశంసించారు. అదానీ, ఎయిర్‌టెల్ వంటి దిగ్గజ సంస్థలతో కలిసి గూగుల్ ఇక్కడ పెట్టుబడులు పెట్టడం శుభపరిణామమని, ఏపీ ప్రభుత్వం అనుసరిస్తున్న 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' వల్లే ఇది సాధ్యమైందని అన్నారు. 2028 సెప్టెంబర్ నాటికి ఈ డేటా సెంటర్ పూర్తి కావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అవసరమైతే రెండు, మూడు నెలలు ముందుగానే పూర్తి చేసేందుకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కేవలం ఎంఓయూలకే పరిమితం కాకుండా, పనుల ప్రారంభంలోనూ ఏపీ ముందుంటుందని నిరూపించామన్నారు.రాష్ట్ర మౌలిక సదుపాయాల అభివృద్ధిపై కూడా చంద్రబాబు పలు కీలక ప్రకటనలు చేశారు. జూలై నాటికి భోగాపురం ఎయిర్‌పోర్టును జాతికి అంకితం చేస్తామన్నారు. కేంద్ర మంత్రులతో చర్చించిన మేరకు రాబోయే ఏడెనిమిదేళ్లలో అమరావతి, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు నగరాలను కలుపుతూ బుల్లెట్ ట్రైన్లు వస్తాయని, అలాగే జూన్ 1న దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రారంభమవుతుందని తెలిపారు. మిగిలిన నగరాలతో పోలిస్తే ఏపీలో వ్యాపార నిర్వహణ ఖర్చు చాలా తక్కువగా ఉంటుందని, పెట్టుబడిదారులు ఏపీని తమ గమ్యస్థానంగా మార్చుకోవాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.ఉత్తరాంధ్ర దశ మార్చిన గూగుల్..

దేశంలోనే ఏపీ నెంబర్ వన్

విశాఖపట్నంలో గూగుల్ ఏఐ డేటా సెంటర్ శంకుస్థాపన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధిపై కీలక ప్రకటనలు చేశారు. జూన్ 1వ తేదీ నుంచి సౌత్ కోస్టల్ రైల్వే జోన్‌కు అధికారిక నోటిఫికేషన్ ఇస్తున్నందుకు కేంద్ర రైల్వే మంత్రికి ధన్యవాదాలు తెలిపిన ఆయన, ఈస్ట్ వెస్ట్ కారిడార్ అనుసంధానంతో ఈ ప్రాంతం లాజిస్టిక్స్ హబ్‌గా మారుతుందని పేర్కొన్నారు.

దేశంలోకి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే రావడం విశేషమని, కేవలం ఒప్పందాలకే కాకుండా ప్రాజెక్టుల గ్రౌండింగ్‌లోనూ ఏపీ దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచిందని సీఎం స్పష్టం చేశారు.

నిర్ణయాలు... బౌన్స్ అవుతున్నాయా....

విజయవాడ, ఏప్రిల్ 28, వైఎస్ జగన్ నిర్ణయాలను ఆ పార్టీ నేతలే తప్పు పడుతున్నట్లుగానే ఉంది. ప్రధానంగా మావిగన్ తో పాటు అనేక అంశాల విషయంలో జగన్ తీసుకునే నిర్ణయాలు సహేతుకంగా లేవని పార్టీ నేతలే ఆఫ్ ది రికార్డుగా చెబుతున్నారు. మావిగన్ విషయంలో వైసీపీ కీలక నేత ఒకరు జగన్ పై చేసిన వ్యాఖ్యలను టీడీపీ సోషల్ మీడియా వైరల్ చేస్తుంది. అయితే తాను ఆ వ్యాఖ్యలను చేయలేదని నేత చెబుతున్నప్పటికీ ఎక్కువ మంది అభిప్రాయం అలాగే ఉందన్న అభిప్రాయం టీడీపీ బలంగా సోషల్ మీడియాలో వైరల్ చేస్తుంది. ఏదైనా ఒక కీలక ప్రకటన చేసే ముందు ముఖ్యమైన నేతలను, ఆ ప్రాంతనేతలతో సంప్రదించడానికి జగన్ కు ఏం ఇగో అడ్డమన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.దీని ప్రకారం చూస్తే వైసీపీ నేతలే మావిగన్ ప్రతిపాదనను వ్యతిరేకించారంటే మిగిలిన ప్రాంత నేతలు ఎందుకు వ్యతిరేకించరన్నది అర్థమవుతుంది. అయితే జగన్ లో తొలి నుంచి ఒక లోపం స్పష్టంగా కనపడుతుంది. అన్నీ ఏకపక్ష నిర్ణయాలే. తనకు తోచింది మీడియా ముందు చెబుతారు. అధికారంలో ఉన్నప్పుడు అమలు చేశారు. విపక్షంలో ఉన్నప్పుడు నిర్ణయాలను ప్రకటిస్తారు. అధికారంలో ఉన్నప్పుడు వాలంటీర్ల వ్యవస్థపై పార్టీ సీనియర్ నేతలతో పాటు అందరి నిర్ణయాలను తీసుకుంటే బాగుండేది. అలాగే ఎన్నికల సమయంలో సీట్లను మార్పు చేసినప్పుడు కూడా సీనియర్ల సలహాలు తీసుకోవచ్చు.అసలు వైసీపీకి ఒక పొలిట్ బ్యూరో ఉందో లేదో తెలియదు. ఏ విషయం కూడా జగన్ సీనియర్ నేతలతో చర్చించే అలవాటు లేదు. ఇదే ఆయన నిర్ణయాలు బూమ్ రాంగ్ అవుతున్నాయి. గతంలో మూడు రాజధానుల విషయంలోనూ, వాలంటీర్ల వ్యవస్థ విషయంలోనూ, అభ్యర్థుల ఎంపికలోనూ, చివరకు మావిగన్ వరకూ అన్నీ సొంత నిర్ణయాలేనా? ఎవరైనా ఇచ్చిన ఐడియాలా? అన్నది పక్కన పెడితే మొత్తం మీద జగన్ ఏకపక్ష నిర్ణయాలు పార్టీలో అసంతృప్తిని, అసహనాన్ని పరోక్షంగా వెళ్లగక్కు తున్నారు. ఇప్పటికైనా జగన్ గుర్తించి తగిన సలహాలు, సూచనలు సీనియర్ల నుంచి తీసుకుంటే బాగుంటుందన్న సూచనలు వెలువడుతున్నాయి.

ట్రెండింగ్ లో జగన్

జగన్మోహన్ రెడ్డి సాధారణ సంప్రదాయ విస్తరణకు విరుద్ధంగా.. ట్రెండీ లుక్ లో కనిపించారు. జీన్ ప్యాంటు తో పాటు జీన్స్ షర్టుతో.. ఖరీదైన వాచీ తో పాటు షూస్ తో ఒక కొత్త లుక్ లో కనిపించారు జగన్మోహన్ రెడ్డి. ఆయనతో ఫోటోలు దిగేందుకు బెంగళూరు ఎయిర్ పోర్ట్ లో ప్రయాణికులు బారులు తీరారు. వారితో సెల్ఫీలు దిగారు జగన్మోహన్ రెడ్డి. జగన్ న్యూ ట్రెండీ లుక్ తో కూడిన ఫోటోలను, వీడియోలను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు వైరల్ చేస్తున్నారు. అయితే ఈ క్రమంలో జగన్మోహన్ రెడ్డి ధరించిన షూస్ ధరపై రకరకాల ప్రచారం నడుస్తోంది.సాధారణంగా రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడు వైట్ కలర్ షర్టుతో పాటు గోధుమ రంగుతో కూడిన ప్యాంటును ధరిస్తుంటారు జగన్మోహన్ రెడ్డి. సాధారణంగా చెప్పులతోనే ఎక్కువగా కనిపిస్తారు. అయితే విదేశీ పర్యటనకు వెళ్ళినప్పుడు మాత్రం ట్రెండీ లుక్ తో కనిపించడం జరుగుతూ ఉంటుంది. ఈసారి కూడా ట్రెండీ లుక్ తో కూడిన కొత్త జగన్ ఆవిష్కృతమయ్యారు. అయితే ఇప్పుడు ఆయన ధరించిన షూస్ పై విస్తృత ప్రచారం సాగుతోంది. ఆయన ఇటాలియన్ లగ్జరీ బ్రాండ్ జగ్నా షూస్ ధరించారు. వాటి విలువ అక్షరాల లక్ష 85 వేల రూపాయలు అని తెలుస్తోంది. రకరకాల ట్రోల్స్ ప్రారంభం అయ్యాయి.జగన్మోహన్ రెడ్డి మొన్నటి ఎన్నికలకు ముందు చాలా ఇంటర్వ్యూ లో మాట్లాడారు. తనకు కనీసం ఫోన్ కూడా లేదని చెప్పుకొచ్చారు. తాను ఒక పేద ముఖ్యమంత్రిని అని చెప్పుకొచ్చారు. అయితే ఇప్పుడు 1 లక్ష 85 వేల రూపాయల షూస్ పై రకరకాల కామెంట్స్ వినిపిస్తున్నాయి. జగన్ హయాంలో వాలంటీర్లు మూడు సంవత్సరాలు పనిచేస్తే కానీ ఆ షూస్ వరకు అందుకోలేరని సోషల్ మీడియాలో అదే పనిగా ప్రచారం చేస్తున్నారు కొందరు. పేద సీఎం అంటూ కౌంటర్ అటాక్ చేస్తున్నారు. మరోవైపు ట్రెండీ లుక్ పై సైతం చాలా రకాలుగా ప్రచారం సాగుతోంది. సోషల్ మీడియాలో ఇప్పుడు ఇదే హాట్ టాపిక్ అవుతోంది. దీనిపై సమాధానం చెప్పలేక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సతమతం అవుతున్నాయి.

విజయ్ సాయిరెడ్డి టార్గెట్ ఎవరు...



నెల్లూరు, ఏప్రిల్ 28, అసలు విజయసాయిరెడ్డి లక్ష్యం ఏంటి? ఆయన రాజకీయ పార్టీ ఎందుకు పెడుతున్నారు? మీడియా ఛానల్ ఏర్పాటు వెనుక ఉన్న అసలు కారణం ఏంటి? పొలిటికల్ సర్కిల్లో ఇదే ప్రచారం నడుస్తోంది. ఇప్పటివరకు పార్టీలు ప్రకటించిన వారంతా చరిష్మ ఉన్నవారు. కానీ విజయసాయిరెడ్డి విషయానికి వచ్చేసరికి ఆయన కేవలం జగన్మోహన్ రెడ్డి వెనుక పని చేశారే తప్ప.. ఆయనకంటూ ఒక సొంత ఇమేజ్ లేదు. పైగా వివాదాస్పద ముద్ర ఉంది. కానీ రాజకీయ పార్టీ ఏర్పాటు వెనుక అసలు వ్యూహం ఏంటనేది తెలియడం లేదు. పైగా మీడియా ఛానల్ ఏర్పాటుకు సమాంతరంగా రాజకీయాలు చేస్తామనడం మాత్రం ఏదో ఒక లక్ష్యంతో అన్నట్టు కనిపిస్తోంది. కచ్చితంగా ఎవరినో ఒకరిని టార్గెట్ చేసి ఈ చర్యకు దిగినట్లు అర్థమవుతోంది.ఒకవేళ జగన్ మోహన్ రెడ్డి వెనుక ఉండి ఇలా చేయిస్తారు అనుకోవడం ఎంత మాత్రం సహేతుకం కాదు. ఎందుకంటే జగన్మోహన్ రెడ్డికి మీడియా ఉంది. ఆయన పార్టీ ప్రతిపక్షంలో ఉంది. ఈ సమయంలో విజయసాయిరెడ్డి పార్టీ పెడితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఇబ్బంది కరం. పైగా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి. ఆపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో నెంబర్ 2 గా ఎదిగిన నాయకుడు. ఆయన పార్టీ పెడితే తప్పకుండా ఆ ప్రభావం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై ఉంటుంది. పైగా విజయసాయిరెడ్డి తో జగన్మోహన్ రెడ్డి పార్టీ పెట్టిస్తే అది అంతిమంగా వైసీపీకి నష్టం. ఇప్పటికే వైసీపీకి సాక్షి మీడియాతో పాటు అనుకూల మీడియా చాలా వరకు ఉంది. కొత్తగా విజయసాయిరెడ్డితో మీడియాను ఏర్పాటు చేసే అవసరం జగన్మోహన్ రెడ్డికి ఎంత మాత్రం లేదు.పోనీ చంద్రబాబు ఇలా చేయిస్తున్నారు అంటే మాత్రం కొంతవరకు నమ్మవచ్చు. ఎందుకంటే చంద్రబాబుతో సాయి రెడ్డికి బంధుత్వం ఉంది. నందమూరి తారకరత్న భార్యకు విజయసాయిరెడ్డి స్వయానా చిన్నాన్న అవుతారు. అప్పట్లో తారకరత్న చనిపోయే సమయంలో విజయసాయిరెడ్డి అన్ని తానై వ్యవహరించారు. అటు చంద్రబాబుతో పాటు నందమూరి బాలకృష్ణ సైతం విజయసాయిరెడ్డి తో ప్రత్యేకంగా గడపాల్సి వచ్చింది. అటు తరువాతనే జగన్మోహన్ రెడ్డితో విజయసాయి రెడ్డికి ఒకలాంటి గ్యాప్ ఏర్పడింది. పార్టీకి దూరమైన క్రమంలో విజయసాయిరెడ్డి పై జగన్మోహన్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు కూడా చేశారు. ఇవన్నీ చంద్రబాబుతో విజయసాయిరెడ్డి దగ్గర కావడం వల్ల జరిగిన పని అంటూ అనుమానాలు ఉన్నాయి. అందుకే చంద్రబాబు విజయసాయిరెడ్డి తో ఈ పని చేయించి ఉంటారన్న అనుమానాలకు ఎంతో కొంత బలం చేకూరుస్తోంది.అయితే ఏకకాలంలో మీడియా ఏర్పాటుతో పాటు కొత్త రాజకీయ పార్టీ ప్రకటన చేశారు విజయసాయిరెడ్డి. అయితే గెలుపు ఓటములను పక్కన పెడితే విజయసాయిరెడ్డి ఎవరినో విపరీతంగా టార్గెట్ చేసుకున్నట్టు కనిపిస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి కోసం ఎంత చేయాలో అంత చేశారు విజయసాయిరెడి. 16 నెలల జైలు జీవితాన్ని గడిపారు జగన్మోహన్ రెడ్డి తో కలిసి. వైసీపీ నే అధికారంలోకి తెచ్చేందుకు సర్వశక్తులు వడ్డారు. గౌరవభావం సంపాదించుకున్నారు. పదవులు అనుభవించారు. కానీ ఇవన్నీ నాణానికి ఒకవైపే. జగన్మోహన్ రెడ్డి వల్ల గౌరవ భావాన్ని కోల్పోయారు. కేసులను ఎదుర్కొన్నారు. అవమానాలు కూడా పడ్డారు. అయితే తన ఈ పతనానికి జగన్మోహన్ రెడ్డి కారణం అన్నది విజయసాయిరెడ్డి ఆలోచనగా తెలుస్తోంది. అందుకే ఆయనను టార్గెట్ చేసుకుని మీడియాతో పాటు కొత్త పార్టీ ఏర్పాటు అన్నది ఒక అనుమానం. దీనిలో ఎంత నిజం ఉందో తెలియాలి.

జనసేనలో ఏం జరుగుతోంది...

విజయవాడ, ఏప్రిల్ 28, రాజకీయ నాయకుడైనా అధికారంలో ఉన్న పార్టీ నుంచి వెళ్ళిపోవడం చాలా అరుదు. కానీ జనసేన పార్టీలో లో గొంతు ఎత్తి మాట్లాడే నేతలందరూ మీద ఎన్నికల తర్వాత తీవ్ర ఆరోపణలు రావడం లేదా పార్టీ నుంచి వెళ్ళిపోవడం చూస్తుంటే నిజమే అనిపిస్తుంది. ఈ ఆరోపణలు తర్వాత వాళ్ళు పార్టీలో ఉన్న ఇంతకు ముందులా బలంగా మాట్లాడగలరా? మాట్లాడిన వారి మాటల్ని జనాలు ఎంతవరకు విశ్వసిస్తారు అనే అనుమానం వస్తుంది. పార్టీ ఆవిర్భవించిన తర్వాత అనేక మంది నేతలు పార్టీని విడిచివెళ్లిపోయారు. వారిలో ఎక్కువ మంది కాపు సామాజికవర్గానికి చెందిన వారే కావడం విశేషం.కోట వినుత, కిరణ్ రాయల్, అరవ శ్రీధర్, బొలిశెట్టి సత్యనారాయణలు ఇటీవల కాలంలో పార్టీ నుంచి బయటకు పంపారు. అయితే వీరిలో కొందరు అనవసర వివాదాల్లో చిక్కుకోవడంతో వారిని పార్టీకి దూరంగా పెట్టారు. అందులో తప్పుపట్టాల్సిన పనిలేదు. కానీ జనసేన కోసం నిలబడి పార్టీ కోసం ఒళ్లూ, ఇల్లూ హూనం చేసుకు?న్న వారిని సయితం బయటకు పంపుతుండటం జనసేనలో చర్చనీయాంశమైంది. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత జనసేనను వీడే నేతలు ఎక్కువగా ఉంటారని ఆ పార్టీ నేతలే సోషల్ మీడియాలో బహిరంగంగా చెబుతున్నారంటే నాయకత్వం కొంత ఆలోచన చేసుకోవాల్సిన అవసరం ఉంది.నియోజకవర్గాల్లో జనసేన కార్యకర్తలతో పాటు నేతలు కూడా సంతృప్తి కరంగా లేరు. అందుకే పవన్ కల్యాణ్ పై విమర్శలు ఎవరు చేసినా పెద్దగా స్పందన రావడం లేదు. అధికారంలో ఉన్నప్పటికీ పనులు అవ్వటం లేదన్న అసంతృప్తి పార్టీ ఎమ్మెల్యేలో, నాయకులలో కూడా ఉంది. కిందస్థాయిలో చిన్న చిన్న పనులు కూడా చేయించుకో లేకపోతుండటం వారిని బాధిస్తుంది. జెండా మోసిన తమకు కలిగే ప్రయోజనం ఏంటన్నది వారిలో కలుగుతుంది. అయితే ఇదంతా ఒక పద్ధతి ప్రకారం జరుగుతుందా అనే అనుమానం నాయకత్వంలోనూ కలుగుతుంది. జనసేనను కాపాడుకోవాల్సిన బాధ్యత పవన్ కల్యాణ్ తో పాటు రాష్ట్ర నాయకత్వంపై ఉంది. లేకుంటే రాజకీయ ఇబ్బందులు తప్పవు.

వివాదం అవుతున్న స్టాండప్ కామెడీ

తిరుపతి ఏప్రిల్ 28, ఇటీవల స్టాండప్ కామెడీవివాదాస్పదం అవుతోంది. మొన్న మధ్యన స్టాండప్ కమెడియన్ ఒకరు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆయన అరెస్ట్ కూడా జరిగింది. ఆ ఘటన మరువకముందే.. అటువంటి ఘటనే ఒకటి చోటుచేసుకుంది. టిడిపి అధినేత చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ తెలుగుదేశం మద్దతుదారులు హైదరాబాద్ కు చెందిన స్టాండప్ కమెడియన్ శరత్ ఉదయ్ కామెడీ షో ను అడ్డుకున్నారు. రెండేళ్ల కిందట చంద్రబాబుపై శరత్ ఉదయ్ చేసిన కామెడీ అభిమానుల్లో ఆగ్రహం నింపింది. ఇప్పుడు అదే శరత్ ఉదయ్ కామెడీ షో ను టిడిపి నేతలు అడ్డుకోవడం కూడా సంచలనంగా మారింది.చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2003లో నక్సలైట్లు దాడి చేసిన సంగతి తెలిసిందే. తిరుమలలో శ్రీవారిని దర్శించుకునేందుకు గాను వెళ్తున్న చంద్రబాబు వాహనంపై బాంబుతో దాడి చేశారు. క్లైమరా మైన్స్ పెట్టి వాహనాన్ని తేల్చే ప్రయత్నం చేశారు. బుల్లెట్ ప్రూఫ్ వాహనం కావడంతో గాయాలతో బయటపడ్డారు చంద్రబాబు నాడు. అయితే స్టాండప్ కామెడీలో భాగంగా? రెండేళ్ల కిందట నక్సలైట్ల దాడిని ప్రస్తావిస్తూ శరత్ ఉదయ్ జోక్ చేశాడు. దీనిపై అప్పట్లోనే తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి డిమాండ్ మేరకు దానిపై అప్పట్లోనే శరత్ ఉదయ్ క్షమాపణలు చెప్పాడు. దీంతో అంతటితో ఆ వివాదం ముగిసిపోయిందని అంతా భావించారు.మరోసారి క్షమాపణ చెప్పించిన వైనం బెంగళూరులోని కోరమంగళ లో శనివారం రాత్రి 7 గంటల సమయంలో శరత్ ఉదయ్ స్టాండప్ కామెడీ షో ప్రారంభం అయింది. ఈ క్రమంలో ప్రేక్షకుల నుంచి ఓ వ్యక్తి శరత్వతయు వద్దకు చేరుకున్నాడు. తాను మీ అభిమాని నంటూ పరిచయం చేసుకున్నాడు. మీరు బాగా కామెడీ చేస్తారని.. అయితే ఒక షోలో తమ నాయకుడిని అవమానించారని అన్నారు. ఆ వెంటనే మరో ఇద్దరు వ్యక్తులు అతనితో చేరారు. శరత్ ఉదయ్ ను బెదిరించడం ప్రారంభించారు. ఆ తర్వాత వారితో మరికొంతమంది చేరారు. అయితే అప్పట్లోనే తాను క్షమాపణలను కోరినట్లు శరత్ ఉదయ్ చెప్పారు. అయినా సరే వారు వినలేదు. చంద్రబాబుతో పాటు లోకేష్ కు ఆయనతో క్షమాపణలు చెప్పించారు. చంద్రబాబు నాయుడు గారికి, నారా లోకేష్ గారికి క్షమాపణలు చెబుతున్నాను. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను కూడా క్షమాపణ కోరుతున్నానని' వీడియో రికార్డింగ్లో శరత్ ఉదయ్ మరోసారి సారీ చెప్పారు. అంతటితో ఆగకుండా జై తెలుగుదేశం, జై చంద్రబాబు అనాలని అతడిపై టీడీపీ కార్యకర్తలు ఒత్తిడి పెంచారు. చేసిన వ్యాఖ్యలపై తప్పిదానికి క్షమాపణ చెబుతా కానీ, మీ పార్టీకి, నేతకు జై కొట్టాలని ఎలా అడుగుతారని.. తాను వైసీపీ నేతలపై సైతం జోక్స్ వేశానని శరత్ ఉదయ్ గుర్తుచేశాడు. మరోసారి జాగ్రత్తగా మాట్లాడాలని అతడికి వార్నింగ్ ఇచ్చి అక్కడినుంచి వెళ్లిపోయారు. సారీ చెప్పాను కదా.. ఇక నా షో నుంచి వెళ్లిపోండి అని టీడీపీ మద్దతుదారులకు అతడు సూచించగా.. టికెట్ డబ్బులు తిరిగిస్తావా అని వాళ్లు అడిగారు. మీ డబ్బులు తిరిగిచ్చేస్తా, మొత్తం ఎంత మంది వచ్చారని అడగగా 10 మంది వచ్చామన్నారు. వారికి పేమెంట్ చేసి అక్కడి నుంచి పంపించేశారు. తమకు డబ్బులు ముఖ్యం కాదని మరోసారి చంద్రబాబు, నారా లోకేష్ గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండకపోతే ఈసారి పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేయవద్దని హెచ్చరించారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

నారా లోకేశ్ కు పెద్ద సవాల్

గుంటూరు, ఏప్రిల్ 28, తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి నారా లోకేశ్ కు పెద్ద సవాల్ అని చెప్పాలి. ఇప్పటి వరకూ చంద్రబాబు ఇమేజ్ పైనే పార్టీ ఇన్నాళ్లు గెలుస్తూ వచ్చింది. నాలుగు సార్లు అధికారంలోకి వచ్చింది. అయితే రానున్న కాలంలో లోకేశ్ నాయకత్వంలోనే ఎన్నికలకు వెళ్లనున్నారన్నది అందరికీ తెలిసిన విషయమే. టీడీపీ ఇప్పటికే లోకేశ్ చేతుల్లోకి వెళ్లిపోయింది. 2029 ఎన్నికలు లోకేశ్ నాయకత్వంలోనే జరగనున్నాయి. అభ్యర్థుల ఎంపిక నుంచి మ్యానిఫేస్టో రూపకల్పన వరకూ ఆయనే అన్నింటికీ పర్యవేక్షణ వహిస్తారు. లోకేశ్ పార్టీ క్యాడర్ విశ్వాసాన్ని బలంగా పొందగలిగారు.అయితే ప్రజల నమ్మకాన్ని పొందాల్సి ఉంటుంది. చంద్రబాబు ఇమేజ్ తో, అనుభవంతో పోల్చుకుంటే లోకేశ్ కు ఇప్పట్లో సాధ్యం కాదు. ఒకరకంగా లోకేశ్ విపక్ష నాయకుడు జగన్ కంటే తక్కువ రాజకీయ అనుభవం ఉన్న వారి కిందే జనం చూస్తారు. పార్టీని నడపగలగడం అంత ఆషామాషీ కాదు. గెలిస్తే పూలదండలు..ఓడితే అవే చేతులు రాళ్లు వేస్తాయన్నది లోకేశ్ మర్చి పోకూడదు. చంద్రబాబు నాయుడు పార్టీ పగ్గాలు చేపట్టే నాటికీ, లోకేష్ బాధ్యతలు స్వీకరిస్తున్న సమయానికి చాలా తేడా ఉంది. ఒకరకంగా చెప్పాలంటే సంబంధమే లేదు. చంద్రబాబు గద్దెనెక్కే సమయంలో కూడా ఎన్టీఆర్ను బలవంతంగానే గద్దె దించవలసి వచ్చింది. శాసనసభ్యులు తీసుకున్న ఆ నిర్ణయాన్ని పార్టీ శ్రేణులు ఆహ్వానించటం చంద్రబాబు సాధించిన విజయాల్లోకే ఘనవిజయం. పార్టీ శ్రేణులు కూడా చంద్రబాబును ఆహ్వానించి నాయకత్వ మార్పిడిని, బాబు నాయకత్వాన్ని ఆమోదించాయి.ప్రస్తుతం లోకేశ్ నాయకత్వ బాధ్యతలను స్వీకరించే సమయానికి చంద్రబాబు పూర్తిగా ఫిట్ గా, ఆరోగ్యంగా ఉన్నారు. పవన్ కల్యాణ్ కూడా మరో పదిహేనేళ్లు అనుభవమున్న చంద్రబాబు నాయకత్వమే రాష్ట్రానికి అవసరమని పదేపదే చెబుతున్నారు. మరొకవైపు జగన్ పాలనలోని లోపాలు కలసి వస్తాయని భావించినా అవి ఎంత వరకూ అనేది ఇప్పుడే చెప్పలేం. అటువంటి పరిస్థితుల్లో టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంటుగా బాధ్యతలు స్వీకరిస్తున్నాడు లోకేశ్. బాధ్యతను తీసుకుంటున్న సమయానికి చుట్టూ ఎటు చూసినా ఆహ్లాదంగానే కనిపిస్తున్నది. ?కానీ ఇప్పుడు నడుస్తున్నది చాలా సంక్లిష్ట రాజకీయం. దీనిని లోకేశ్ ఎలా అధిగమిస్తారోనన్నది చూడాలి.

నారా లోకేష్ విశాఖ విమానాశ్రయంలోప్రత్యక్షం అయ్యారు. చింతకాయల విజయ్ ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు భారీగా తరలి వచ్చాయి విమానాశ్రయానికి. పెద్ద ఎత్తున స్వాగతం పలికాయి. అసలు లోకేష్ ఎక్కడికి వెళ్లారు? అనే చిక్కుముడి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వీడలేదు. లోకేష్ వెళ్ళింది వ్యక్తిగత పర్యటన నిమిత్తం. దానిని కూడా తట్టుకోలేకపోతోంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. ఈ గోప్యత వెనుక ఉన్న కారణం ఏంటి అనేది ఆ పార్టీకి అంతుపట్టడం లేదు. దీనికి తోడు విశాఖ విమానాశ్రయంలో లోకేష్ స్వాగతం చూస్తుంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మైండ్ బ్లాక్ అవుతోంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఈ రకమైన ఆందోళన కోసమే లోకేష్ పర్యటనను గోప్యంగా ఉంచినట్లు అర్థం అవుతోంది. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన జరగనుంది. లోకేష్ ప్రత్యేక చొరవతోనే ఈ డేటా సెంటర్ విశాఖకు వచ్చింది. కేంద్ర ప్రభుత్వంతో ఎప్పటికప్పుడు ప్రత్యుత్తరాలు జరుపుతూ.. పట్టు గూగుల్ సంస్థతో ప్రభుత్వం తరుపున చర్చిస్తూ.. ఒప్పించడంలో లోకేష్ పాత్ర ఉంది. ఈనెల 18 నుంచి కనిపించకుండా పోయిన లోకేష్ ఈరోజు విశాఖ ఎయిర్పోర్ట్లో ప్రత్యక్షం అయ్యారు. జాబ్ క్రియేటర్ ఆఫ్ చీఫ్ అంటూ పెద్ద ఎత్తున ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. లోకేష్ కు స్వాగతం పలకడం విశేషం. అసలు ఏం జరుగుతుందో వైసీపీకి అర్థం కాని పరిస్థితి.

క్లీన్ ఇమేజ్ కోసం నానా తంటాలు

ఏలూరు, ఏప్రిల్ 28, డ్రగ్స్ ఆరోపణల డ్యామేజ్ను కంట్రోల్ చేస్తూ క్లీన్ ఇమేజ్ కోసం ఎంపీ పక్కా ప్లాన్తో రంగంలోకి దిగారా? నియోజకవర్గంలోకి భారీ ర్యాలీతో ఎంట్రీ ఇచ్చి తన బలం తగ్గలేదని ప్రత్యర్థులకు సంకేతాలు పంపారా? ఏ తప్పూ చేయలేదని ఆయన చెబుతున్న మాటలను జనం ఎంతవరకు రిసీవ్ చేసుకుంటారు? ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ సింపతీ ప్లాన్ వర్కౌట్ అవుతుందా లేదా అనేది..ఏలూరు పాలిటిక్స్లో ఇంట్రెస్టింగ్గా మారింది. రయ్రయ్ మంటూ దూసుకెళ్లే ప్లాన్ చేస్తున్న ఎంపీకి క్షేత్రస్థాయి నేతల సహకారం ఎలా ఉంది? క్యాడర్ ఉత్సాహంగా ఉన్నా, సీనియర్ నేతలు మనస్ఫూర్తిగా తోడుంటారా..లేకపోతే ఇదే సందు అని హ్యాండ్ ఇస్తారా అన్నది సస్పెన్స్గా మారింది.మామూలుగానే ఎంపీ మహేశ్ ఏలూరు ప్రజలకు అందుబాటులో ఉంటారన్న టాక్ ఉంది. అభివృద్ధి, సంక్షేమం అంటూ ఎప్పుడూ ఏదో యాక్టివిటీ చేస్తుంటారు. అయితే ఇప్పుడు తన మీదున్న నెగిటివిటీని డైవర్ట్ చేసేలా ఇంకా దూకుడు పెంచారన్న టాక్ నడుస్తోంది. ఆరోపణలు వచ్చినప్పుడు వెనక్కి తగ్గితే తప్పు ఒప్పుకున్నట్టు అవుతుందని భావించి, మునుపటి కంటే రెట్టింపు వేగంతో ప్రజల్లోకి వెళ్లడమే ఆయన వ్యూహమన్న చర్చ జరుగుతోంది. మొన్నటి దాకా డ్రగ్స్ ఆరోపణల సెగతో సైలెంట్గా ఉన్న ఎంపీ, ఇప్పుడు ఒక్కసారిగా గేర్ మార్చినట్లు కనిపిస్తున్నారు. భారీ ర్యాలీలు..సుడిగాలి పర్యటనలు..పార్టీ మీటింగ్లతో మహేశ్ లవ్స్ ఏలూరు అని ఇండికేషన్ పంపిస్తున్నారట. ఈ స్పీడుతోనే డ్రగ్స్ మరకలు పోగొట్టుకునేలా ప్లాన్ చేస్తున్నారని అంటున్నారు.రాజకీయంలో మౌనం కంటే..మాట కంటే..టైమింగే చాలా ముఖ్యమని పుట్టా మహేష్ ప్రూవ్ చేస్తున్నారని చెప్పుకుంటున్నారు. పక్కా ప్లాన్తో బిగ్ సౌండ్ చేస్తూ నియోజకవర్గంలో అడుగు పెట్టారని అంటున్నారు. నేను నిప్పు..విచారణలో తేలుతుంది అంటూ సింపతీ అస్త్రం వదిలి ప్రజల్లోకి చర్చకు తెరలేపారు. ప్రొఫెషనల్ ప్లానింగ్తో దూసుకుపోతున్న ఎంపీ..విచారణ రిపోర్ట్ రాకముందే ప్రజాకోర్టులో 'క్లీన్' ఇమేజ్ తెచ్చుకునేందుకు వేస్తున్న అడుగులు ఇంట్రెస్టింగ్గా మారాయి. ఎంపీ మాటల్లోని ధీమా జనాన్ని ఆలోచనలో పడేసిందంటున్నారు.నియోజవర్గంలో అడుగుపెట్టిన తర్వాత అభిమానులు, నేతలు, కార్యకర్తలు ఆయనకు మద్దతు తెలపడం చూస్తుంటే..డ్రగ్స్ ఆరోపణలను ప్రజలు ఏమాత్రం పట్టించుకోవడం లేదనేది టీడీపీ శ్రేణుల మాట. మరోవైపు కూటమి ప్రజాప్రతినిధులు కూడా ఎంపీకి తమ మద్దతు తెలుపుతూ మీ వెంటే మేమనే సంకేతాలివ్వడం ఆయనకు మరింత ఉత్సాహాన్ని ఇస్తున్నాయట. తనపై పడ్డ మరకను చెరిపేసేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తాయా? విచారణలో క్లీన్ చిట్ వచ్చేలోపే..తాను మిస్టర్ పర్ఫెక్ట్ అని ప్రూవ్ చేసుకుంటారా అనేది చూడాలి.

ఆకట్టుకున్న లోకేష్ సైకత శిల్పం

విశాఖపట్నం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాంతంలో గూగుల్ డేటా సెంటర్ తో పాటు పలు ఐటీ కంపెనీలను తీసుకువచ్చి, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న తరుణంలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కి ధన్యవాదాలు తెలియజేస్తూ సైకత శిల్పం రూపొందించారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ ఆధ్వర్యంలో బీచ్ రోడ్ ఎం జీ ఎం ఆవరణ లోని సముద్ర తీరంలో ఏర్పాటుచేసిన ఈ సైకత శిల్పం సందర్శకులను, పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. విశాఖ లో గూగుల్ డేటా సెంటర్ శంకుస్థాపన పురస్కరించుకొని, గూగుల్ డేటా సెంటర్ విశాఖ కి తీసుకురావటంలో కీలక పాత్ర పోషించిన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కి విశాఖ నిరుద్యోగుల తరుపున కృతజ్ఞతలు తెలియజేస్తూ ఈ సైకత శిల్పం ఏర్పాటు చేసారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి

విజయనగరం జిల్లాలో సోమవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పూసపాటిరేగ వద్ద జాతీయ రహదారిపై కారు, లారీ ఢీకొన్న ప్రమాదంలో నలుగురు మృతి చెందగా, ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, ప్రత్యక్షసాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆగి ఉన్న లారీని వెనుక నుంచి అతివేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. ప్రమాదం కారణంగా నలుగురు అక్కడికక్కడే ప్రాణాలొదిలారు.మరొకరు తీవ్ర గాయాల పాలయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అతివేగమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా నిర్ధరించారు. ఈ ఘటనపై మరింత పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

విశాఖలో భారీ త్రిశూలం...

విశాఖపట్టణం, ఏప్రిల్ 28, సిటీ అఫ్ డెస్టీనీ' గా పేరుపడ్డ విశాఖలో ఈ మధ్య కాలంలో చాలా టూరిజం ఎట్రాక్షన్స్ వచ్చాయి. వాటి జతకి కొత్తగా కైలాసగిరి పై భారీ త్రిశూలాన్ని ఏర్పాటు చేసింది వైజాగ్ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్మెంట్ అథారిటీ. కైలాస గిరి కొండపై ఏర్పాటు చేసిన 65 అడుగుల పొడవైన త్రిశూలాన్ని వైజాగ్ లోని ముఖ్య ప్రాంతాల నుండి చూస్తే కనపడేలా ప్లాన్ చేశారు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తయిన ఈ భారీ త్రిశూలాన్ని ఈ వారంలోనే అధికారికంగా ప్రారంభించేందుకు ప్లాన్ చేస్తున్నట్టు వివిఆర్డీఏ చైర్మన్ ఓఎ ప్రణవ్ గోపాల్ తెలిపారు.వైజాగ్ లో కైలాసగిరి అంటే వెంటనే గుర్తు వచ్చేది ఆ కొండపై ఏర్పాటు చేసిన శివ పార్వతుల విగ్రహాలు. వాటికి తోడుగా ఒక త్రిశూలాన్ని ఏర్పాటు చేయాలని ఈ మధ్య సంకల్పించింది. దానికోసం 2.50 కోట్లు బడ్జెట్ కేటాయించి రకరకాల డిజైన్లు పరిశీలించారు. చివరకు సెలక్ట్ అయిన డిజైన్ తో కైలాసగిరి కొండకు మరోవైపున ఈ త్రిశూలాన్ని ఏర్పాటు చేశారు. టూరిజం ప్లస్ ఆధ్యాత్మికం రెండూ ఉట్టిపడే 65 అడుగుల ఎత్తుతో ఉండే భారీ త్రిశూలం పగటిపూట విశాఖపట్నంలోని ముఖ్య ప్రాంతాల నుంచి కైలాసగిరి వైపు చూస్తే కనబడుతుంది.ప్రత్యేకంగా రాత్రి వేళల్లో ఈ త్రిశూలం మరింత అందంగా కనపడేలా 110 వాట్ల శక్తివంతమైన ఎల్ఈడి బల్బులను అమర్చారు. మోదరన్ టెక్నాలజీ తో ట్రాన్స్ లూసెంట్ ఫైబర్ రీన్ఫోర్డ్ ప్లాస్టిక్ తో నిర్మించడం వల్ల ఈ త్రిశూలం సహజంగా వైజాగ్ తీరంలో వచ్చే తుఫాన్లను బలమైన గాలులను కూడా తట్టుకునే సామర్థ్యం కలిగి ఉంటుందని చైర్మన్ ప్రణవ్ తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా కైలాసగిరిలో పర్యాటకుల సంఖ్య మరింతగా పెరుగుతుందని టూరిస్టులకు కొత్తరకం అనుభూతిని ఇవ్వడమే తమ లక్ష్యం అని అధికారులు చెబుతున్నారు. నిజానికి ఈ ఆదివారం నాడే దీన్ని ప్రారంభించాల్సి ఉన్నా కొన్ని అనుకోని కారణాల వల్ల "త్రిశూల్" అధికారికంగా ప్రారంభం రావడానికి మరొక వారం పడుతుందని అధికారులు అంటున్నారు.వైజాగ్ లో బీచ్ ఎంత ఫేమస్సో కైలాసగిరి కొండ కూడా అంతే ఫేమస్. ప్రతి ఏటా కనీసం మూడు లక్షల మంది టూరిస్టులు కైలాసగిరి కొండను విజిట్ చేస్తూ ఉంటారు. వీరిలో ఇండియన్స్ తో పాటు ఫారినర్స్ కూడా ఉంటారు. కైలాసగిరి నుండి విశాఖలోని సముద్ర తీరాన్ని చూడడం ఒక మరుపురాని అనుభూతిగా పర్యాటకులు చెబుతూ ఉంటారు. అందుకే 2003లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కైలాస గిరిని "బెస్ట్ టూరిస్ట్ స్పాట్ " గా ఎంపిక చేసింది. ఈ కొండ విశాఖపట్నం రైల్వే స్టేషన్ నుంచి పది కిలోమీటర్ల దూరంలోనూ, ద్వారకా బస్ స్టేషన్ నుండి ఐదుకిలోమీటర్ల దూరంలోనూ దూరం లోనూఉంటుంది. అరెండుచోట్ల నుంచి డైరెక్ట్ బస్సులు ఉంటాయి.కైలాసగిరి కొండపై ఉన్న శివపార్వతుల విగ్రహాలకు తోడు 350మీ పొడవుండే కేబుల్ కార్ కూడా చాలా ప్రసిద్ధమైనది. ఈమధ్య ఏర్పాటు చేసిన గ్లాస్ బ్రిడ్జ్ కూడా చాలా పాపులర్ అయింది. వీటికి తోడు ఇప్పుడు ఈ భారీ త్రిశూలం కూడా కైలాసగిరి పై స్పెషల్ ఎట్రాక్షన్ గా మారనుంది. అన్నట్టు ఈ త్రిశూలం వద్ద ఎలాంటి ఫీజు వసూలు చేయబోవడం లేదు. పూర్తిగా ఉచితమని అధికారులు చెబుతున్నారు. దానితో వీకెండ్ లోనూ హాలిడేస్ లోనూ ఫ్యామిలీతో సరదాగా వెళ్లడానికి అనువుగా ఉండే కైలాసగిరి పై ఈ "త్రిశూల్" వల్ల మరొక కొత్త ఆకర్షణ వచ్చినట్టే అయిందని అంటున్నారు వైజాగ్ వాసులు

కుక్కల రక్తంతో వ్యాపారం...

హైదరాబాద్, ఏప్రిల్ 28 హైదరాబాద్ షేక్‌పేటలోని ఒక ప్రైవేట్ వెటర్నరీ హాస్పిటల్‌లో దారుణమైన 'బ్లడ్ బిజినెస్' వ్యవహారం వెలుగులోకి వచ్చింది. వీధి కుక్కలను సంరక్షణ పేరుతో తీసుకొచ్చి.. వాటిని బోన్లలో బంధించి రక్తాన్ని సేకరిస్తూ ప్యాకెట్ రూ. 25 వేల వరకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. జంతు హక్కుల కార్యకర్త మేనకా గాంధీ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన జంతు సంక్షేమ బోర్డు, జీహెచ్ఎంసీ అధికారులు విచారణ చేపట్టారు. సరైన రక్తనిధి కేంద్రాలు లేకపోవటాన్ని ఆసరాగా చేసుకుని కొందరు కేటుగాళ్లు మూగజీవాలను హింసిస్తున్న ఘటన ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.ఇప్పటి వరకు మనుషుల రక్తంతో, అవయవాలతో వ్యాపారాలు చేశారు. కిడ్నీలను ఇడ్లీల మాదిరిగా అమ్మేసిన ఘటనలు అనేకం. తాజాగా.. హైదరాబాద్ నగరంలోని షేక్‌పేట ప్రాంతంలో ఉన్న ఒక ప్రైవేట్ వెటర్నరీ హాస్పిటల్‌లో మూగజీవాలను కూడా వదలకుండా వాటి రక్తాన్ని అమ్ముకుంటున్నారు. చికిత్స, సంరక్షణ పేరుతో వీధి కుక్కలను హాస్పిటల్‌కు తీసుకువచ్చి.. బంధించి అక్రమంగా రక్తాన్ని సేకరిస్తున్నారని జంతు ప్రేమికులు జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై జంతు హక్కుల ఉద్యమకర్త మేనకా గాంధీ సైతం రాష్ట్ర జంతు సంక్షేమ సంస్థకు ఫిర్యాదు చేయడంతో అధికారులు లోతైన విచారణ ప్రారంభించారు.

ఆసుపత్రి సిబ్బంది ద్వారా బయటకు వచ్చిన ఫోటోలు, వీడియోలు ఈ క్రూరత్వాన్ని కళ్లకు కడుతున్నాయి.

నిర్వాహకులు ముందుగా వీధి కుక్కలను పట్టుకొచ్చి బోన్లలో ఉంచి పెంచుతారు. అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చే ఖరీదైన పెంపుడు కుక్కల యజమానులే వీరి ప్రధాన లక్ష్యం. ఆ పెంపుడు శునకాలకు అవసరం ఉన్నా లేకపోయినా రక్తహీనత ఉందని తప్పుడు రిపోర్టులు సృష్టించి యజమానులను భయాందోళనకు గురిచేస్తారు. ప్రాణాలు కాపాడాలంటే రక్తం ఎక్కించాలని నమ్మబలికి.. బోన్లలో బంధించిన కుక్కల రక్తాన్ని తీసి విక్రయిస్తారు. ఒక్కో బ్లడ్ ప్యాకెట్‌ను డిమాండ్‌ను బట్టి రూ. 18 వేల నుంచి రూ. 25 వేల వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం.ఈ అమానుష ప్రక్రియలో నిరంతరం రక్తాన్ని తీయడం వల్ల ఆరోగ్యంగా ఉన్న వీధి కుక్కలు తీవ్ర రక్తహీనతకు లోనై మృత్యువాత పడుతున్నాయి. కొన్నిసార్లు వీధి కుక్కల రక్తం అందుబాటులో లేకపోతే.. చికిత్స కోసం వచ్చిన ఇతర పెంపుడు జంతువుల నుంచి కూడా బలవంతంగా రక్తాన్ని సేకరిస్తున్నట్లు తెలిసింది.

నిబంధనల ప్రకారం.. ఆరోగ్యంగా ఉన్న జంతువు యజమాని సమ్మతితోనే రక్తమార్పిడి జరగాలి. కానీ ఇక్కడ ఎలాంటి అనుమతులు లేకుండా.. కనీస మానవత్వం లేకుండా వ్యాపారమే పరమావధిగా బ్లడ్ బిజినెస్ దందా కొనసాగుతోంది.

నగరంలో జంతువుల కోసం ప్రత్యేకంగా ప్రభుత్వ రక్తనిధి కేంద్రాలు లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని ఇలాంటి అక్రమ వ్యాపారాలు పుట్టుకొస్తున్నాయని జీహెచ్ఎంసీ పశు వైద్యాధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆసుపత్రి రికార్డులను, నిల్వ ఉంచిన రక్తపు ప్యాకెట్లను అధికారులు స్వాధీనం చేసుకుని విచారణ జరుపుతున్నారు. కాగా, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని జంతు ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు.

ఒకటి, రెండు రోజుల్లో టెన్త్ రిజల్ట్స్

హైదరాబాద్, ఏప్రిల్ 28, తెలంగాణలోని లక్షలాది మంది విద్యార్థులు ఎంతో ఉత్కంఠతో ఎదురుచూస్తున్న పదో తరగతి పరీక్షా ఫలితాల విడుదలకు ముహూర్తం దాదాపు ఖరారైంది. ఈ నెల 29 లేదా 30వ తేదీల్లో ఫలితాలను వెల్లడించేందుకు ప్రభుత్వ పరీక్షల విభాగం అధికారులు సర్వం సిద్ధం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మార్చి 14న ప్రారంభమైన పదో తరగతి ప్రధాన పరీక్షలు.. ఈ నెల 13వ తేదీతో విజయవంతంగా ముగిశాయి. సుమారు 5.15 లక్షల మంది రెగ్యులర్ విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు.పరీక్షలు ముగిసిన వెంటనే విద్యాశాఖ యుద్ధప్రాతిపదికన మూల్యాంకన ప్రక్రియను చేపట్టింది. ఈ నెల 23వ తేదీ నాటికే జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి కావడంతో.. ఫలితాలను అనుకున్న సమయం కంటే ముందే విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. వాస్తవానికి మే మొదటి వారంలో ఫలితాలు విడుదల చేయాలని భావించినప్పటికీ, విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు, పై చదువుల ప్రవేశాలకు వీలుగా ఈ నెల 29నే ఫలితాలను విడుదల చేసేందుకు రంగం సిద్ధమైంది. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుండి కూడా సానుకూల స్పందన లభించినట్లు సమాచారం.ఒకవేళ సాంకేతిక కారణాల వల్ల వీలుకాని పక్షంలో.. మరుసటి రోజైన 30వ తేదీన ఫలితాలను కచ్చితంగా వెల్లడిస్తామని అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది ఫలితాలను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు అధికారికంగా విడుదల చేయనున్నారు. ఇప్పటికే మార్కుల నమోదు, సాంకేతిక తనిఖీలు పూర్తి కావచ్చాయని, విద్యార్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్లలో చూసుకునేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని విద్యాశాఖ తెలిపింది. ఫలితాల విడుదల తేదీపై స్పష్టత రావడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల నిరీక్షణకు తెరపడనుంది.ఇక తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యార్థులకు విద్యాశాఖ కీలక అప్డేట్ అందించింది. ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఆశించిన మార్కులు రాని వారు, ఫెయిల్ అయిన విద్యార్థులు దరఖాస్తు చేసుకున్న రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ ఫలితాలను మే 10వ తేదీలోపు ప్రకటించనున్నట్లు ఇంటర్ బోర్డు వర్గాలు వెల్లడించాయి. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో.. విద్యార్థుల్లో ఉన్న సందిగ్ధతను తొలగించేందుకు మే 5 నుంచి 10వ తేదీల మధ్య ఫలితాలను వెల్లడించాలని బోర్డు నిర్ణయించింది.ఇక ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్‌ను బోర్డు ఇప్పటికే ఖరారు చేసింది. ఏప్రిల్ 12న వెలువడిన ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించని వారు, అలాగే మార్కులు పెంచుకోవాలనుకునే ఫస్టియర్ విద్యార్థుల కోసం మే 13 నుంచి మే 21 వరకు థియరీ పరీక్షలు నిర్వహించనున్నారు. థియరీ పరీక్షలు మే 13 ? మే 21 వరకు ప్రాక్టికల్ పరీక్షలు మే 22 ? మే 25 వరకు నిర్వహించనున్నారు. రీవెరిఫికేషన్ ఫలితాల వెల్లడి అనంతరం విద్యార్థులు తమ సప్లిమెంటరీ పరీక్షల ప్రిపరేషన్‌పై ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకోవచ్చని.. ఎలాంటి ఆందోళన చెందకుండా విద్యార్థులు పరీక్షలకు సిద్ధం కావాలని బోర్డు అధికారులు సూచించారు.

భారీగా పెరుగుతున్న బిలీయనీర్లు

ముంబై, ఏప్రిల్ 28, (న్యూస్ పల్స్) ప్రపంచంలోనే అధికంగా జనాభా ఉన్న దేశం.. మేధస్సుపరంగా అత్యంత విలువైన యువత ఉన్న దేశం.. వనరులపరంగా.. సాంస్కృతిక వైవిధ్యం పరంగా ప్రపంచానికే పాఠాలు చెప్పే దేశం.. భిన్న వాతావరణాలు.. భిన్న సంస్కృతులు.. భిన్నమైన ప్రజలతో అలరారే దేశం.. ఇంతటి విశేషణం.. విశ్లేషణం కేవలం మన దేశానికి మాత్రమే సొంతం. అందువల్లే ప్రపంచానికి భారత్ ఒక మార్గదర్శి.. దిక్సూచి.ఇంతటి స్థాయిలో అనుకూలతలు ఉన్నప్పటికీ భారతదేశాన్ని ఇప్పటికీ అభివృద్ధి చెందుతున్న దేశమనే అంటుంటారు. దీనికి అనేక రకాల కారణాలు ఉన్నాయి. అవి ఎలా ఉన్నప్పటికీ.. భారత్ గొప్ప దేశం. శాస్త్ర సాంకేతికతలనుంచి మొదలుపెడితే.. వ్యవసాయం వరకు భారత్ ఇప్పటికీ తన విభిన్న తత్వాన్ని నిరూపించుకుంటూనే ఉంటుంది.అవినీతి, ఇతర వ్యవహారాల వల్ల ఇప్పటికి అభివృద్ధి చెందుతున్న దేశం గానే భారత్ ఉండిపోతోంది. అయినప్పటికీ మన దేశంలో శ్రీమంతుల సంఖ్య ఏమాత్రం తగ్గడం లేదు. తాజాగా నైట్ ఫ్రాంక్ అనే సంస్థ మనదేశంలో ఉన్న ఆగర్భ శ్రీమంతుల సంఖ్యను లెక్క కట్టింది.

2031 నాటికి మనదేశంలో 313 మంది బిలియనీర్లు ఉంటారని పేర్కొంది. ఈ జాబితాలో ఒక్కో వ్యక్తి 100 కోట్లకు పైగా ఆస్తులను సంపాదించుకుంటారని ఆ సంస్థ ప్రకటించింది . 2026 లో 207 మంది బిలియనీర్లు మనదేశంలో ఉన్నారు. ఆ సంఖ్యతో పోల్చి చూస్తే 2031 నాటికి 51 శాతం శ్రీమంతులు పెరిగే అవకాశం ఉంది. చైనాలో 20%.. అమెరికాలో 12% శ్రీమంతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆ సంస్థ వెల్లడించింది. ది వెల్త్ రిపోర్టులో ఆ సంస్థ ఈ నివేదికను వెల్లడించింది.ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న వ్యాపారాలు.. ఇతర వ్యవహారాల వల్ల ప్రతిరోజు ప్రపంచంలో 89 మంది ఆల్ట్రా రిచ్ (30 మిలియన్ డాలర్ల సంపద) గా మారుతున్నట్టు తెలుస్తోంది.

ప్రపంచ వ్యాప్తంగా మొత్తం 3,110 మంది బిలియనీర్లు ఉన్నారు. వచ్చే ఐదేళ్లలో ఈ సంఖ్య 3,915 కి పెరుగుతుందని సమాచారం. "ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేకమైన పరిస్థితులు ఉన్నప్పటికీ.. విభిన్నమైన వ్యాపారాలు చేసేవారు తమ సంపదను పెంచుకుంటున్నారు.

ప్రపంచ వ్యాప్తంగా ప్రజల అవసరాలు మారిపోతున్న క్రమంలో.. కొంతమంది ప్రత్యేకమైన వ్యాపారాలు చేస్తున్నారు. అందువల్ల వారు తమ సంపాదనను పెంచుకుంటున్నారు. అందువల్లేవారు ఈ స్థాయిలో శ్రీమంతులుగా మారిపోతున్నారని" నైట్ ఫ్రాంక్ సంస్థ ది వెల్త్ రిపోర్టులో పేర్కొంది.

నిప్పుల కొలిమిలా తెలంగాణ.. వడదెబ్బ, పిడుగుపాటుతో నలుగురి మృతి

రాష్ట్రంలో 46 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు

రానున్న మూడు రోజులు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం

పలు జిల్లాల్లో సాయంత్రం కురిసిన చిరుజల్లులతో ఉపశమనం

ఉత్తర తెలంగాణ జిల్లాలకు వడగాల్పుల హెచ్చరిక

తెలంగాణలో భానుడు భగభగ మండుతున్నాడు. ఈ వేసవిలో తొలిసారిగా ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల మార్కును తాకడంతో రాష్ట్రం నిప్పుల కొలిమిని తలపిస్తోంది. సోమవారం ఒక్కరోజే తీవ్రమైన ఎండల ధాటికి తట్టుకోలేక వడదెబ్బతో ముగ్గురు, పిడుగుపాటుకు ఒకరు ప్రాణాలు కోల్పోయారు.

సోమవారం రాష్ట్రంలోనే అత్యధికంగా నిజామాబాద్ జిల్లాలో 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అదిలాబాద్, నిర్మల్, పెద్దపల్లి జిల్లాల్లో 45.9 డిగ్రీలు, పలు ఇతర జిల్లాల్లో కూడా 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. హైదరాబాద్‌లో సైతం కొన్ని ప్రాంతాల్లో 42.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

ఈ తీవ్రమైన వాతావరణ పరిస్థితుల కారణంగా వివిధ జిల్లాల్లో విషాద ఘటనలు చోటుచేసుకున్నాయి. మంచిర్యాల జిల్లాలో భోగారపు మారయ్య (56), పెద్దపల్లి జిల్లాలో దశరథం సౌమ్య (19), నారాయణపేట జిల్లాలో గుర్తు తెలియని వృద్ధుడు వడదెబ్బకు గురై మరణించారు. మరోవైపు, సంగారెడ్డి జిల్లాలో కుర్మరంగు జంగయ్య (51) అనే రైతు పొలంలో పనిచేస్తుండగా పిడుగుపడి మృతిచెందాడు.

మధ్యాహ్నం వరకు ఉగ్రరూపం చూపిన సూరీడు సాయంత్రానికి చల్లబడ్డాడు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ సహా పలు జిల్లాల్లో చిరుజల్లులు కురవడంతో ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. అయితే, రానున్న మూడు రోజులు వడగాల్పుల తీవ్రత కొనసాగుతుందని, ఉష్ణోగ్రతలు మరో 1-2 డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఉత్తర తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో వడగాల్పులు, మరికొన్ని చోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

పెట్రోల్ బంకుల్లో పెట్రోల్ డీజిల్ కొరత

"నో స్టాక్ " బోర్డులతో వినియోగదారులకు ఇబ్బందులు

ఎల్బీనగర్ నియోజకవర్గం లోని పలు ప్రాంతాల్లో డీజిల్ పెట్రోల్ కొరత తీవ్రంగా కనిపిస్తోంది. అనేక పెట్రోల్ బంకుల్లో "ఔనీ ాబినీఞ ఎ" బోర్డులు దర్శనమిస్తున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల లో నో స్టాక్ బోర్డులు ఉండగా మరికొన్నిచోట్ల పెట్రోలు ఉన్నా పెద్ద ఎత్తున క్యూ లైన్లు ఉన్నాయి కాగా కొంతమంది ఇది రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం అని చెబుతుండగా మరి కొంతమంది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యంగా చెబుతున్నారు. ఏది ఏమైనా ప్రజలు మాత్రం ఇబ్బందులు పడుతున్నారు అనేది వాస్తవం

బెంగాల్ లోనే బీజేపీ టీమ్...

కోల్ కత్తా, ఏప్రిల్ 28, (న్యూస్ పల్స్) బెంగాల్ లో ఈసారి ఎలాగైనా అధికారాన్ని చేపట్టి, మమతా బెనర్జీకి చుక్కలు చూపించాలని బీజేపీ నిర్ణయించుకుంది. ఇందులో భాగంగానే మొదటి దశ లో బీజేపీ భారీగానే ప్రచారం చేసింది. ముఖ్యంగా ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యవహారాన్నంతా తమ భుజాలపైనే వేసుకున్నారు. తృణమూల్ పై, సీఎం మమతాపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, విమర్శలకు దిగారు.మరోవైపు మొదటి దశలో దాదాపు 90 శాతం పోలింగ్ జరిగింది. దీంతో తామే అధికారంలోకి వస్తామని బీజేపీ ఘంటాపథంగా చెబుతోంది. అయితే.. రెండో దశ పోలింగ్ నేపథ్యంలో బీజేపీ మరింత అలర్ట్ అయ్యింది. ఇప్పటికే మొదటి దశ పోలింగ్ జరుగుతున్న సమయంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్వయంగా బెంగాల్ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలోనే వుండిపోయారు. అక్కడి నుంచే ఎప్పటికప్పుడు కార్యకర్తలకు దిశా నిర్దేశం చేస్తూ వచ్చారు. అలాగే రెండో దశ పోలింగ్ పై కూడా వారందరితో మాట్లాడినట్లు బీజేపీ వర్గాలు పేర్కొంటున్నాయి.మరోవైపు ప్రధాని మోదీ కూడా ప్రస్తుతం బెంగాల్ లోనే పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా హుగ్లీ నదిలో బోట్ రైడ్ కి వెళ్లారు. తన వెంట ఓ కెమెరాను కూడా తీసుకెళ్లారు. దీంతో అందరి దృష్టినీ ఆకర్షించారు. అక్కడి నది అందాలను క్లిక్ అనిపించారు. హుగ్లీ నది బెంగాల్ సంస్కృతితో ముడిపడి వుందని బెంగాల్ సెంటిమెంట్ ను తట్టిలేపారు. అంతేకాకుండా బెంగాలీల జీవితాల్లో గంగానదికి ప్రత్యేక స్థానం వుందని, దాని జలాలు ప్రాచీన నాగరికత స్ఫూర్తిని మోసుకెళ్తాయన్నారు. ఈ సందర్భంగా నదిలో పడవలు నడిపే వారితో, మార్నింగ్ వాక్ కి వచ్చిన వారితో కాసేపు ముచ్చటించారు.మరో వైపు కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా బెంగాల్ లోనే తిష్ఠ వేశారు. విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మె?దటి దశ ఎన్నికల్లో 152 స్థానాలకు గాను బీజేపీ 110కి పైగా సీట్లు కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో బీజేపీ విజయం తథ్యమన్నారు. రెండో దశలోనూ తామే ఎక్కువ సీట్లు నెగ్గుతామన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేది బీజేపీనే అంటూ ప్రకటించారు.మమతా బెనర్జీ, టీఎంసీ ప్రభుత్వానికి ఘోర పరాజయం తప్పదని హోంమంత్రి అమిత్ షా జోస్యం చెప్పారు. అందుకు మె?దటి దశలో 92.88 శాతం ఓటింగ్ నమోదు కావడమే నిదర్శనమన్నారు. బెంగాల్ ఓటర్లు అభివృద్ధిని ఎంచుకున్నారని తొలి దశ ఎన్నికలతో స్పష్టమైందని చెప్పుకొచ్చారు. బెంగాల్‌లో మార్పు కోసం ప్రజలు ఉత్సాహంగా ఓట్లు వేశారన్నారు. మహిళల రక్షణ బీజేపీ మొదటి ప్రాధాన్యత అని పేర్కొన్నారు. స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా పోలింగ్ ప్రక్రియను నిర్వహించారంటూ ఎన్నికల సంఘం, స్థానిక పోలీసులు, భద్రతా దళాలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. చాలా కాలం తర్వాత ఒక్కరి ప్రాణం కూడా పోకుండా జరిగిన బెంగాల్ ఎన్నికలు ఇవేనని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు.

అన్నీ రద్దు చేసి పడేసిన బాస్

హైదరాబాద్, ఏప్రిల్ 28, టీవల జగిత్యాలలో సభ నిర్వహించిన తర్వాత.. కొద్దిరోజులపాటు వ్యవసాయ క్షేత్రానికి పరిమితమైన భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు కేసీఆర్ బయటికి వచ్చారు. సోమవారం భారత రాష్ట్ర సమితి వ్యవస్థాపక దినాన్ని పురస్కరించుకొని ఆయన.. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీఆర్ పార్టీ ప్రక్షాళనకు నడుం బిగించారు. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా సరే అధికారాన్ని దక్కించుకుంటామని చెబుతున్న కేసీఆర్.. దానికి అనుసరించాల్సిన విధానాలలో ఆయన ఇప్పటినుంచే అమలు చేయాలని పార్టీ కార్యకర్తలకు హిత బోధ చేశారు.పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర కమిటీ మినహా.. జిల్లా.. ఇతర కమిటీలను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేసే వారికి మాత్రమే టికెట్లు ఇస్తామని కేసీఆర్ అన్నారు. వచ్చే ఎన్నికల్లో ముఖం చూసి టికెట్ ఇవ్వడం కుదరదని కేసీఆర్ స్పష్టం చేశారు. కొంతమంది నాయకులలో ఇంకా అహంకారం తగ్గలేదని.. వారు తమ ధోరణి మార్చుకోకపోతే కష్టమని కేసీఆర్ అన్నారు. "అసెంబ్లీ ఎన్నికల్లో గెలుస్తామని అనుకున్నాం. పార్లమెంటు ఎన్నికల్లో కూడా అద్భుతమైన విజయాన్ని అందుకుంటామని భావించాం. కానీ ఫలితం వేరే విధంగా వచ్చింది. కొంతమంది నాయకులు ఇంకా అహంకారంతో ఉన్నారు.. వారు తమ ధోరణి మార్చుకోవాలని" కెసిఆర్ సూచించారు.రాష్ట్ర కమిటీ మాత్రమే మనుగడలో ఉంటుందని ప్రకటించిన కేసీఆర్.. జిల్లాస్థాయి కమిటీలను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. త్వరలోనే అన్ని స్థాయిలలో కొత్త కమిటీలను ప్రకటిస్తామని కెసిఆర్ అన్నారు. వారికి శిక్షణ ఇచ్చే బాధ్యతను కేటీఆర్ కు అప్పగించారు. భారత రాష్ట్ర సమితి సభ్యత్వ నమోదును కూడా ప్రారంభించాలని కేసీఆర్ అన్నారు. సభ్యత్వ రుసుము పది రూపాయలుగా ప్రకటించారు. ఆన్లైన్లో.. ఆఫ్లైన్లో సభ్యత్వ నమోదు చేపట్టాలని కెసిఆర్ ఆదేశించారు.ఇటీవల కవిత టిఆర్ఎస్ పేరుతో కొత్త పార్టీని ప్రకటించిన నేపథ్యంలో.. కెసిఆర్ ఆమె గురించి మాట్లాడలేదు. పార్టీ ఆవిర్భావ సభలో కవిత కెసిఆర్ ను ఉద్దేశించి మారిన మనిషి.. మర మనిషి అని వ్యాఖ్యానించారు. అంతేకాదు కేసీఆర్ చుట్టూ పందికొక్కులు ఉన్నాయని ఆరోపించారు. అయితే కవిత పార్టీ ఆవిర్భావ సభ తర్వాత.. భారత రాష్ట్ర సమితి సోషల్ మీడియా హ్యాండిల్ లో డూప్లికేట్ ఒరిజినల్ అంటూ ఒక పోస్ట్ చేసింది. ఆ తర్వాత పార్టీ కార్యకర్తలను కవిత పార్టీ ఏర్పాటు మీద ఎటువంటి వ్యాఖ్యలు చేయకూడదని భారత రాష్ట్ర సమితి అధినాయకత్వం సూచించింది. ఈ నేపథ్యంలో ఉన్న కేసీఆర్ కూడా కవిత పార్టీ పట్ల ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదని తెలుస్తోంది.

కనిపించని కార్యచరణ

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాటల్లో ఉండే పదును చేతల్లో ఉండదు. గత రెండు సంవత్సరాల నుంచి ఇదే తంతు నడుస్తుంది. ఎప్పుడో ఒకసారి సమావేశాలకు రావడం హడావిడి చేయడం తర్వాత కలుగులో దూరడం అలవాటుగా మారింది. తెలంగాణ ఎన్నికలు ఇంకా మూడేళ్లు మాత్రమే సమయం ఉంది. అయితే ఒక ఏడాది ముందు వచ్చి హడావిడి చేసినంత మాత్రాన సరిపోదు. నిత్యం జనంలో ఉండేందుకు ప్రయత్నించాలి. ఆయన ఆరోగ్యం సహకరించకపోవచ్చు. కానీ బాగున్న సమయంలోనైనా జిల్లాల పర్యటనలు చేస్తే ఆ జిల్లాల క్యాడర్ లో కొంత ఊపు వస్తుంది.కొన్నాళ్ల క్రితం పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై మూడు భారీ బహిరంగ సభలను ఏర్పాటు చేస్తానని కేసీఆర్ ఆర్భాటంగా ప్రకటించారు. ఇది ప్రకటించి నెలలు గడిచింది. తర్వాత ఎర్రవెల్లి ఫామ్ హౌస్ లో ఆ యా జిల్లాల నేతలతో సమావేశమై సభల ఏర్పాటు పై చర్చించారు. మహబూబ్ నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో జరిగే సభలకు తానే స్వయంగా హాజరవుతానని ప్రకటించారు. అసలు దానిని అటకెక్కించారు. అంతకు ముందు వరంగల్ లో జరిగిన ఆవిర్భావ సభలో ఇక జనంలో ఉంటానని ప్రజా సమస్యలపై పోరాడతానని, ప్రభుత్వం మెడలు వంచుతానని కేసీఆర్ ప్రకటించారు. కానీ ఏడాది పూర్తయినా అతీ లేదు. గతీ లేదుఈ విషయాన్ని ఎవరో చెప్పలేదు. కేసీఆర్ మరమనిషి అని.. మారిన మనిషి అని, సారు జనం సమస్యలను గురించి పట్టించుకోవడం మానేశారని సాక్షాత్తూ ఆయన కుమార్తె టీఆర్ఎస్ ఆవిర్భావ సభలోనే వ్యాఖ్యానించారు. అందులో నిజం ఉండబట్టే కవిత ఆ వ్యాఖ్యలు చేసి ఉంటారు. కేసీఆర్ ప్రజల్లోకి వస్తే ఆ క్రేజ్ వేరు.

తెలంగాణ సెంటిమెంట్‌పై పోరు.. కవిత ఓటు..ఎవరికి చేటు

హైదరాబాద్, ఏప్రిల్ 28, తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత 'తెలంగాణ రాష్ట్ర సేన' (టీఆర్ఎస్) పేరుతో కొత్త రాజకీయ పార్టీని ప్రకటించారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో జరిగిన ఆవిర్భావ సభలో ఆమె పార్టీ పేరు, జెండాను ఆవిష్కరించి, రానున్న రాజకీయాల్లో తాను స్వతంత్ర శక్తిగా ఎదగనున్నట్లు సంకేతాలిచ్చారు. ప్రస్తుతం కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ప్రధాన పార్టీలుగా ఉన్నాయి. ఈ క్రమంలో కవిత పెట్టిన పార్టీ ఎవరిని దెబ్బతీస్తుంది అన్న చర్చ పొలిటికల్ సర్కిల్స్‌లో జరుగుతోంది.కవిత తన పార్టీకి 'టీఆర్ఎస్' అని పేరు పెట్టడం రాజకీయ విశ్లేషకులను ఆశ్చర్యపరిచింది. ఒకప్పుడు కేసీఆర్ నేతృత్వంలోని ఉద్యమ పార్టీ 'టీఆర్ఎస్' (తెలంగాణ రాష్ట్ర సమితి) పేరును బీఆర్ఎస్‌గా మార్చుకున్న తర్వాత ఏర్పడిన సెంటిమెంట్ శూన్యాన్ని భర్తీ చేసేందుకు కవిత ఈ వ్యూహాన్ని ఎంచుకున్నట్లు కనిపిస్తోంది. 'బీఆర్ఎస్ తన ఆత్మను కోల్పోయింది' అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు పాత తరం ఉద్యమకారులను ఆకట్టుకునే ప్రయత్నంలో భాగమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిణామం బీఆర్ఎస్‌కు అతిపెద్ద ముప్పుగా మారనుందని, పార్టీ ఓటు బ్యాంకును, ముఖ్యంగా కేడర్‌ను కవిత వైపు మళ్లించే అవకాశం ఉందని స్పష్టమవుతోందికవిత తన తొలి ప్రసంగంలో కాంగ్రెస్, బీజేపీలను పక్కనబెట్టి, కేసీఆర్, కేటీఆర్ నాయకత్వాన్ని టార్గెట్ చేయడం గమనార్హం. 'కేసీఆర్ ఇప్పుడు మారు మనిషి అయ్యారు, గుంట నక్కల చేతిలో బందీ అయ్యారు' అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు కుటుంబ కలహాల తీవ్రతను తెలియజేస్తున్నాయి. ఆస్తుల పంపకాల విషయంలో తలెత్తిన విభేదాలే ఈ పార్టీ ఆవిర్భావానికి ప్రధాన కారణమని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్‌లోని అసంతృప్త నేతలను, కేటీఆర్, హరీష్‌రావుల ఆధిపత్యాన్ని వ్యతిరేకించే శ్రేణులను తనవైపు తిప్పుకోవడమే కవిత ప్రధాన వ్యూహంగా కనిపిస్తోంది.రాష్ట్రంలో తనదైన ముద్ర ఉన్న కవిత, క్షేత్రస్థాయిలో ప్రజలను ప్రభావితం చేయగల సామర్థ్యం కలిగి ఉన్నారు. కేసీఆర్ ఇటీవల మళ్లీ తెలంగాణ సెంటిమెంట్ కార్డును తెరపైకి తెచ్చినప్పటికీ, కవిత అదే సెంటిమెంట్‌ను 'తెలంగాణ రాష్ట్ర సేన' పేరుతో వాడుకోవడం బీఆర్ఎస్‌కు పెద్ద ఇబ్బందిగా మారింది. ఒకప్పుడు షర్మిల రాజకీయ ప్రవేశం జరిగినప్పటికీ ఆమెకు లభించిన స్పందన కంటే, కవితకున్న సామాజిక గుర్తింపు మరియు తెలంగాణ ఉద్యమకారులతో ఉన్న అనుబంధం కారణంగా, బీఆర్ఎస్ ఓటు బ్యాంకును ఆమె చీల్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. కవిత ఎత్తుగడలు కేసీఆర్ కుటుంబంలోనే కాకుండా, పార్టీ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి.కేసీఆర్ ఇటీవల జీవన్‌రెడ్డి చేరిక సభలో తెలంగాణ సెంటిమెంటును రెచ్చగొట్టే ప్రసంగం చేశారు. కొత్త ఎత్తులు పనిచేయకపోవడంతో పాత సెంటిమెంటును రగిలించే యత్నం చేశాడు. ఇప్పుడు కవిత కూడా తెలంగాణ సెంటిమెంటును పండించంఆలనుకుంటుంది. దీంతో బీఆర్ఎస్‌కు ఇది ఇబ్బందిగా మారే అవకాశం ఉంది. కవితకు తెలంగాణలో మంచి పట్టు ఉంది. ప్రజలను ప్రభావితం చేయగలదు. దీంతో కవిత పార్టీతో ముప్పు ఎదుర్కొనేది బీఆర్ఎస్ పార్టీనే అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

అనుకున్నంతా ఈజీ కాదు...

ఒక రాజకీయ పార్టీని నడపాలంటే ఒకప్పుడు ఆర్థిక వనరులు అంతగా ఉండాల్సిన అవసరం ఉండదు కాదు. ఎందుకంటే కార్యకర్తలు పార్టీకి పని చేయడాన్ని ఒక గౌరవంగా భావించేవారు. రాజకీయ నాయకులు కూడా ఇప్పటి మాదిరిగా లేరు కాబట్టి.. అప్పుడు అంతగా ఖర్చు ఉండేది కాదు. పైగా దోచుకోవడం, దాచుకోవడం అనే సిద్ధాంతాన్ని నేతలు పాటించేవారు కాదు. దీనివల్ల రాజకీయాలు అంత ఖరీదుగా ఉండేవి కాదు.. మీడియా కూడా న్యూట్రల్ గా ఉండేది. అందువల్ల నాటి రోజుల్లో రాజకీయ పార్టీని నిర్వహించడానికి నేతలకు భారీగా డబ్బు అవసరం పడేది కాదు.ఇప్పటి రోజులు వేరు. ప్రతిదీ ఖరీదుగా మారిపోయింది. పార్టీ కార్యాలయాన్ని నిర్వహించాలి. జిల్లాలో కార్యాలయాలను నిర్వహించాలి. విలేకరుల సమావేశం పెడితే కవర్లు ఇవ్వాలి. సోషల్ మీడియాను రన్ చేయాలి. ప్రత్యర్థి పార్టీల నేతల మీద నిత్యం బురద చల్లుతూనే ఉండాలి. లీగల్ టీం బలోపేతంగా ఉండాలి. అన్నింటికీ మించి దండిగా సంపాదించుకోవాలి. తరాలు తిని కూర్చున్నా కూడా తగ్గని ఆస్తులను వెనకేసుకోవాలి. ఇదంతా జరగాలంటే దోపిడీ చేయాలి. దుర్మార్గాలకు పాల్పడాలి. అక్రమాలకు శ్రీకారం చుట్టాలి. అందువల్లే రాజకీయ నాయకులు అంటే ప్రజల్లో చులకన భావం.. మేధావుల్లో హేయమైన భావం.తెలంగాణ రాష్ట్రంలో మరో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు అయింది. ఈ పార్టీని ఏర్పాటు చేసింది తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె కవిత. తన పార్టీ పేరును ఆమె టిఆర్ఎస్ గా ప్రకటించారు. వాస్తవానికి ఒక మహిళ రాజకీయ పార్టీని ఏర్పాటు చేయడం మన దేశంలో కొత్తగాక పోయినప్పటికీ.. మఖలో పుట్టి పుబలో మునిగిపోయిన మాదిరిగా కాకుండా.. రాజకీయ పార్టీ సుదీర్ఘకాలం పనిచేయాలంటే కచ్చితంగా ఆర్థిక వనరులు ఉండాల్సిందే. కవిత పార్టీ ఏర్పాటు చేశారు కాబట్టి ఆమె దానిని కొనసాగిం చగలుగుతారా.. ఆమె దగ్గర ఉన్న ఆర్థిక స్థాయి ఎంత.. తెర వెనుక ఏవైనా భారీ అండదండలు ఉన్నాయా.. అనే ప్రశ్నలు ఇప్పుడు తెలంగాణ వ్యాప్తంగా వ్యక్తం అవుతున్నాయి. రాజకీయ పార్టీని ఏర్పాటుచేసిన కవిత ఆర్థిక పరిస్థితిని ఒకసారి పరిశీలిస్తే.. 2021లో ఎమ్మెల్సీ ఎలక్షన్ అఫిడబిట్ లో ఆమె తన పేరు మీద 39.79 కోట్ల ఆస్తులు ఉన్నాయని ప్రకటించారు. 21.62 కోట్ల అప్పులు ఉన్నాయని వెల్లడించారు. 1.9 కిలోల బంగారం, 11.2 కిలోల వెండి ఉన్నట్టు వెల్లడించారు. 2014 పార్లమెంటు ఎన్నికల్లో 6.19 కోట్ల ఆస్తులు.. 2019 ఎన్నికల్లో 17.9 3 కోట్ల ఆస్తులు.. 2020లో ఎమ్మెల్సీ ఎన్నికల్లో 27.64 కోట్ల ఆస్తులు ఉన్నట్టు కవిత వెల్లడించారు. అయితే ఈ స్థాయి ఆస్తులతో రాజకీయ పార్టీని ఎలా నడుపుతారని విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. ఆమె పార్టీలో ఆర్థికంగా బలంగా ఉన్న నాయకులు కనిపించడం లేదు. ఆమె చెప్పినట్టుగా గొప్ప గొప్ప నాయకులు పార్టీలో చేరలేదు. ఇప్పటికైతే పార్టీలో పెట్టుబడి పెట్టాల్సింది.. నిర్వహణ ఖర్చు చూసుకోవాల్సింది మొత్తం కవితనే. పైగా ఆర్థికంగా కవిత బలంగానే ఉన్నప్పటికీ.. అధికార పార్టీని.. ప్రతిపక్ష పార్టీని ఆమె ఏక కాలంలో విమర్శిస్తున్నారు. అలాంటప్పుడు ఆమెకు ఆర్థికంగా సహాయం చేయడానికి ఎవరు ముందుకు వస్తారు.. ఒకవేళ వచ్చినా ప్రభుత్వం ఒత్తిడికి వారు తట్టుకుంటారా.. ప్రతిపక్షం దూకుడు ముందు నిలబడతారా.. వీటిని సమర్థవంతంగా ఎదుర్కొంటేనే కవితకు, ఆమె రాజకీయ పార్టీకి మనగడం ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు."పార్టీ ఆవిర్భావ సభను అత్యంత ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న వంటకాలు మొత్తం కార్యకర్తలకు వడ్డించారు. కార్యకర్తలు కూడా భారీగానే వచ్చారు. జన సమీకరణ అనుకున్న దానికంటే ఎక్కువగానే చేశారు. పత్రికలలో భారీగా ప్రకటనలు ఇచ్చారు. ఇవన్నీ చూస్తుంటే కవిత అంత ఈజీగా లేరు. పైగా తను కేసీఆర్ కుమార్తె. అలాంటప్పుడు ఆమె తన పార్టీని గట్టిగానే నిర్వహిస్తారు. కెసిఆర్ కూడా ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నారు. చివరికి పార్టీని బలోపేతం చేసుకున్నారు.

కవిత కూడా అలానే ఉంటుందేమో. ఎందుకంటే తను మాట్లాడుతున్న ప్రతి మాటలో కూడా స్పష్టత కనిపించింది. ధిక్కార స్వభావం వినిపించింది. అలాంటప్పుడు కవిత కచ్చితంగా పార్టీని బలోపేతం చేసుకుంటుందని నమ్మకం కనిపిస్తోందని" విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

అమెరికాలో ఏం జరుగుతోంది...

కరిగిపోతున్న డాలర్ డ్రీమ్స్...

హైదరాబాద్, ఏప్రిల్ 28, అమెరికాను సుసంపన్నం చేసిందే హెచ్1బీ వీసా.. ఎందుకంటే ఈ వీసా ఆధారంగా చేసుకుని ప్రపంచం నలుమూలల నుంచి ప్రతిభావంతులు అమెరికా గడ్డపై అడుగుపెట్టి.. అక్కడే తమ భవిష్యత్తును నిర్మించుకున్నారు. అంతేకాదు.. దాంతో పాటు అమెరికా ఆర్థికవ్యవస్థను సైతం సుసంపన్నం చేశారు. అందుకే వారిని అమెరికా సైతం అంతేస్థాయిలో గౌరవించింది కూడా. కానీ ఎప్పుడైతే ట్రంప్ అధికారంలోకి వచ్చారో.. అప్పటి నుంచి వారిని వేరు చేసి మాట్లాడడం మొదలు పెట్టారు. వారిని దొంగలుగా, దోపిడీ దారులుగా చిత్రీకరించడం పెరిగిపోయింది.సొక్షాత్తూ అధ్యక్షుడే .. ఎన్నారైలు ఇక్కడకు వచ్చి, తమ అవకాశాలను దోచేస్తున్నారని పదేపదే ప్రకటిస్తుండడంతో.. ఇక ప్రజలు ఊరుకుంటారా..? దీంతో ఇప్పుడు అమెరికాలో తమ కలల సౌధాన్ని నిర్మించుకున్న సగటు ఎన్నారై.. తాము దశాబ్దాల క్రితం చేసింది తప్పా అని అంతర్మథనంలో పడిపోయాడు. ఎందుకంటే అక్కడే ఆస్తులు కొన్నారు. అక్కడే ఉద్యోగాలు చేస్తున్నారు.. అక్కడే పిల్లలు పుట్టి పెరిగి పెద్దవాళ్లై అమెరికా సిటిజన్లుగా మారిపోయారు. ఇప్పుడు వారందరికి మీరు ఇక్కడి వాళ్లు కాదు.. వెళ్లిపోండని అల్టిమేటమిస్తే.. ఎలా ఉంటుంది. మనస్సు చివుక్కు మనదూ..దీంతో ఇప్పుడు అమెరికాలో స్థిరపడిన ఎన్నారైల్లో 40 శాతం మంది తిరిగి వెళ్లిపోతే బాగుంటుందా అన్న ఆలోచనలో పడ్డారు. ఇది సాధారణ విషయం కాదు.. ఎందుకంటే.. ఓ స్థాయికి వెళ్లిన వ్యక్తి? దేశంకోసం జీవితాంతం కష్టపడిన కుటుంబాలు తిరిగి వెళ్లిపోదామని భావించాయంటే.. అది వారిని ఎంతగా మానసికంగా , శారీరకంగా ఇబ్బంది పెట్టాయో అర్థమవుతుంది. వీరు వెళ్లిన తర్వాత మళ్లీ ప్రతిభావంతులను రమ్మని అమెరికా ఆహ్వానించగలదా.. ఆహ్వానించినా వీటన్నింటిని చూసిన యువత.. మళ్లీ అటువైపు చూస్తుందా.. అంటే అమెరికా.. ఇక అమెరికన్లకే పరిమితం కానుంది.దీనర్థం ఇక అమెరికా ప్రతిభావంతులకు ఆహ్వానం పలికే పరిస్థితి ఉండదు.. కేవలం వారు అమెరికన్లు అయితే చాలు అన్న సంకుచిత స్వభావాన్ని వంట పట్టించుకుంటోంది. దీంతో ఇక అక్కడ నూతన ఆవిష్కరణలు తగ్గిపోతాయి. కొత్త కంపెనీల రాక, పెట్టుబడులు నిలిచిపోతాయి. సాదారణ సగటు దేశంగా అమెరికా మారనుందన్న అంశం దీంతో అర్థమవుతోంది.ఓవైపు ఇరాన్ యుద్ధంతో అమెరికా ఆర్థిక వ్యవస్థ .. తీవ్ర ఇబ్బందులు పడుతోంది. ముఖ్యంగా? ఆయుధాలకే లక్షల డాలర్లు ఖర్చుపెడుతోంది. వీటన్నింటికీ ఎవరి దగ్గర వసూలు చేస్తుంది. మళ్లీ సగటు అమెరికన్ దగ్గరే. ఓవైపు ఖర్చులు పెరుగుతున్నాయి. మరోవైపు..ఆర్థికాన్ని పరుగు పెట్టించే ప్రతిభావంతులు దేశం దాటిపోనున్నారు. ఇక అమెరికాకు మంచి రోజులు అన్నవి గతమేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఖజానా నింపేదెలా..

హైదరాబాద్, ఏప్రిల్ 28, తెలంగాణ ఖజానాను నింపే మార్గాలను అన్వేషించేందుకు ఏర్పాటైన 'రెవెన్యూ రిసోర్స్ మొబిలైజేషన్' సబ్‌కమిటీ పనితీరుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కేవలం ఫైళ్లు కదలడం, సమావేశాలు జరగడం వల్ల రాష్ట్రానికి ఒరిగేదేమీ లేదని, క్షేత్రస్థాయిలో ఆదాయం పెరిగినప్పుడే ఆ కమిటీ ఉనికికి సార్థకత ఉంటుందని ఆయన కుండబద్దలు కొట్టారు. అధికారుల తీరుపై సీఎం అసహనం వ్యక్తం చేస్తూ, పరిపాలనలో వేగం పెంచాలని హెచ్చరించారు.ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ఆర్థిక వనరుల సమీకరణపై ప్రత్యేక దృష్టి సారించిన సీఎం, ఇందుకోసం మంత్రుల నేతృత్వంలో సబ్‌కమిటీని ఏర్పాటు చేశారు. అయితే, ఈ కమిటీ పలుమార్లు భేటీ అయినప్పటికీ, ఆదాయాన్ని పెంచే దిశగా ఇప్పటివరకు ఎలాంటి విప్లవాత్మకమైన లేదా స్పష్టమైన ప్రతిపాదనలు ముందుకు రాలేదు. దీనిపై సీఎం మండిపడ్డారు. సమావేశాలు నిర్వహించడం ముఖ్యం కాదని, ఆ సమావేశాల ద్వారా ఖజానాకు ఎంత ఆదాయం సమకూరిందో లెక్కలు చూపాలని అధికారులను నిలదీశారు. కేవలం అంకెలు, అంచనాలకే పరిమితం కాకుండా, ఆదాయ మార్గాలను అన్వేషించడంలో ఎందుకు జాప్యం జరుగుతోందని ఆయన ప్రశ్నించినట్లు సమాచారం.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రస్తుతం అత్యంత కీలక దశలో ఉంది. ఒకవైపు సంక్షేమ పథకాల అమలు, మరోవైపు ఉద్యోగుల జీతభత్యాలు, పెన్షనర్ల చెల్లింపులు ప్రభుత్వానికి పెను సవాలుగా మారాయి. ఖర్చులు గణనీయంగా పెరుగుతున్న తరుణంలో, అందుకు తగ్గట్టుగా ఆదాయ వనరులు పెరగకపోవడం పట్ల సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఆర్థిక క్రమశిక్షణ పాటించకపోతే, సంక్షేమ పథకాల నిర్వహణలో ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఖజానా గండం గట్టెక్కాలంటే సంప్రదాయేతర మార్గాల్లో కూడా ఆదాయాన్ని రాబట్టాలని సూచించారు.ఈ జాప్యాన్ని ఇక ఎంతమాత్రం సహించేది లేదని స్పష్టం చేసిన సీఎం రేవంత్ రెడ్డి, అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. వచ్చే 100 రోజుల్లో తక్షణమే అమలు చేయగలిగే, ఫలితాలను ఇచ్చే ఆదాయ పెంపు మార్గాలపై స్పష్టమైన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. మే 4వ తేదీ నాటికి పూర్తి స్థాయి నివేదికను ప్రభుత్వానికి అందజేయాలని స్పష్టం చేశారు. అదే రోజు మళ్లీ కేబినెట్ సమావేశం నిర్వహించి, కమిటీ ఇచ్చే నివేదికపై చర్చించి తదుపరి కఠిన నిర్ణయాలు తీసుకుంటామన్నారు.తెలంగాణను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న పట్టుదలతో ఉన్న ముఖ్యమంత్రి, అధికారుల అలసత్వాన్ని ఏమాత్రం ప్రోత్సహించడం లేదని తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఆదాయం పెంచే విషయంలో 'వంద రోజుల లక్ష్యం' ఇప్పుడు అధికారుల ముందున్న పెద్ద సవాలు. మే 4న జరగబోయే కేబినెట్ భేటీలో ఎలాంటి విప్లవాత్మక నిర్ణయాలు వెలువడతాయో, రాష్ట్ర ఆర్థిక గమనం ఏ మలుపు తిరుగుతుందో చూడాలి. కేవలం మాటలు కాకుండా, అంకెల్లో ప్రగతిని చూడాలని కోరుకుంటున్న రేవంత్ రెడ్డి సర్కార్, రెవెన్యూ యంత్రాంగాన్ని పరుగులు పెట్టించే పనిలో నిమగ్నమైంది.

వర్క్ ఫ్రమ్ హోమ్ కు డిమాండ్

హైదరాబాద్, ఏప్రిల్ 28, పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచ దేశాలతో పాటు భారత్‌లోనూ చమురు, గ్యాస్ సరఫరాలో కొరత ఏర్పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో చమురు కంపెనీలు పెట్రోల్ బంకులకు సరఫరా చేసే పెట్రోల్, డీజిల్ నిబంధనలు మార్చడంతో చాలా రాష్ట్రాల్లో ఇబ్బందులు మొదలయ్యాయి. ఏపీతోపాటు తెలంగాణ రాజధాని హైదరాబాద్ లోనూ పెట్రోల్, డీజిల్ కొరత తీవ్రంగా వేదిస్తోంది. బంకుల వద్ద వాహనదారులు పెట్రోల్, డీజిల్ కోసం గంటల తరబడి బారులు తీరాల్సిన పరిస్థితి నెలకొంది. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ కొరత తీవ్ర మవుతున్న నేపథ్యంలో వర్క్ ఫ్రమ్ హోం డిమాండ్ మళ్లీ తెరపైకి వచ్చింది.గతంలో కరోనా సమయంలో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించింది. ఈ సమయంలో ఉద్యోగులకు కంపెనీలు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇచ్చాయి. ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ కొరత నేపథ్యంలో రవాణా వ్యవస్థ స్తంభించి పోతోంది. ఈ క్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు వర్క్ ఫ్రమ్ హోం ఇవ్వాలన్న డిమాండ్ వినిపిస్తోంది.పెట్రోల్, డీజిల్ కొరతతో పాటు ఎండలు కూడా మండిపోతున్నాయి. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 9గంటల తరువాత బయటకు వచ్చేందుకు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి ఇబ్బందికర పరిస్థితుల్లో ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోంను తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు కోరుతున్నారు.పెట్రోల్, డీజిల్ కొరత తీవ్రమైతే దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించేందుకు కేంద్రం మొగ్గుచూపే అవకాశాలు ఉన్నాయన్న ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే, లాక్ డౌన్ కంటే ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇస్తే ఎంతో ఉపయోగం ఉంటుందని సోషల్ మీడియాలో నెటిజన్లు పేర్కొంటున్నారు. వర్క్ ఫ్రమ్ హోం విధానం వల్ల పెట్రోల్, డీజిల్ కొరతతో ఎదురవుతున్న ఇబ్బందుల నుంచి బయటపడంతోపాటు ఎండల నుంచి రక్షణ పొందొచ్చని, మరోవైపు ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టొచ్చని, పొల్యూషన్ తగ్గుతుందని పలువురు నెటిజన్లు సూచిస్తున్నారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోం తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది.

పెట్రోల్ బంకు లను పరిశీలించిన కలెక్టర్

ఏలూరు నగరంలోని పలు పెట్రోల్ బంకులను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫైర్ స్టేషన్ సెంటర్లోని భారత్ పెట్రోలియం బంకును జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెట్రోల్ డీజిల్ నిల్వల పై బంకు యజమానితో ఆరా తీసిన జిల్లా కలెక్టర్ సోషల్ మీడియా లో వచ్చే వదంతులను నమ్మకండి. జిల్లా ప్రజల అవసరాల మేర పెట్రోల్, డీజిల్ నిల్వలు జిల్లాలో ఉన్నాయి.అవసరమైన మేర మాత్రమే డీజిల్ కొనుగోలు : డీజిల్ కొరత ఏర్పడుతుందని ఆందోళనతో కొనుగోలు చేయవద్ద జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి విజ్ఞప్తి చేశారు

తిరుపతి చేరుకున్న ఉప రాష్ట్రపతి

రేణిగుంట తిరుమల పర్యటన సందర్భంగా విశాఖపట్నం నుండి ప్రత్యేక విమానంలో భారత ఉపరాష్ట్రపతి సీపీ.రాధాకృష్ణన్ రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. అయనకు అధికారులు , బిజెపి నాయకులు కార్యకర్తలు భారీ స్వాగతం పలికారు. తరువత అయన రోడ్డు మార్గం గుండా తిరుమల కు పయనం అయ్యారు.

మండల స్థాయికి ప్రజావాణి

హైదరాబాద్, ఏప్రిల్ 28, రాష్ట్రంలో ప్రజల అర్జీలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పకడ్బందీగా అమలు చేయాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజావాణి సేవలను క్షేత్రస్థాయికి విస్తరించాలని, తద్వారా వేగంగా సమస్యలు పరిష్కారం అవుతాయని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన మరుసటి రోజున ప్రజావాణి కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ప్రతి మంగళవారం, శుక్రవారం నాడు మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజాభవన్‌లో ప్రజావాణి (ఎఖతీజీతీజీలజీనితి) విజయవంతంగా అమలవుతోంది.అన్ని విభాగాలకు చెందిన అధికారులు అక్కడికక్కడే ప్రజలు ఇచ్చే అర్జీలు, అప్లికేషన్లు స్వీకరించి వేగవంతంగా వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నారు. జిల్లా స్థాయిలోనూ కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రతి వారం ప్రజావాణి ద్వారా ఫిర్యాదుల స్వీకరణను నిర్వహిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి ప్రజలు హైదరాబాద్‌కు, జిల్లా కేంద్రానికి వచ్చే బదులు ప్రజావాణి సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని ఎంసీహెచ్?ఆర్?డీలో జరిగిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి సీఎస్ కె. రామకృష్ణారావుతో పాటు సీఎంవో అధికారులను ఆదేశించారు.వెంటనే రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం ప్రారంభించాలని చెప్పారు. తరువాత దశలో మండల స్థాయికి ప్రజావాణిని విస్తరించాలని యోచిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి అన్ని స్థాయిల్లో అధికారులకు పూర్తి అధికారాలు ఇవ్వాలని ఆయన ఆదేశించారు. ప్రజలు ఇచ్చే ప్రతి ఫిర్యాదును నమోదు చేయాలని, సంబంధిత విభాగాలకు పంపించడంతో పాటు పరిష్కార పురోగతిని ఆ వ్యక్తులకు తెలియజేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదుల పరిష్కారానికి నిర్దిష్ట గడువులు ఉండాలని, తద్వారా అప్లికేషన్ పరిష్కారంలో ఆలస్యం జరగకూడదని చెప్పారు. ప్రజలకు నమ్మకంగా ఉండేలా ప్రజావాణి సేవలు అందించాలని, అప్పుడే ప్రభుత్వం నమ్మకం మరింత పెరుగుతుందన్నారు.ప్రజావాణి ఫిర్యాదుల నమోదు, ట్రాకింగ్, పరిష్కారానికి ఏకీకృత డిజిటల్ ప్లాట్‌ఫాం అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రియల్ టైమ్ మానిటరింగ్ ఉండాలన్నారు. ప్రతి స్థాయిలో ప్రజావాణికి ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాలని సీఎస్, ఉన్నతాధికారుల్ని ఆయన ఆదేశించారు. ప్రతి జిల్లాలోనూ, ప్రతి శాఖలో ప్రత్యేక ప్రజావాణి విభాగాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఒకస్థాయిలో పరిష్కారం కాకపోతే, పైస్థాయి అధికారికి అర్జీ అందేలా ఆటో ఎస్కలేషన్ వ్యవస్థను ప్రవేశపెట్టి పారదర్శకంగా అమలు చేయాలని చెప్పారు. అవసరమైతే అప్పీల్ వ్యవస్థను ప్రవేశపెట్టాలని అధికారులకు ఆయన సూచించారు.ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియలో ఎలాంటి రాజీ ఉండకూడదని, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నిరంతరం సమీక్షలు నిర్వహించాలన్నారు. పెండింగ్ ఫిర్యాదులపై స్పెషల్ ఫోకస్ పెట్టాలని చెప్పారు. డ్యాష్‌బోర్డ్ ద్వారా పరిష్కార పురోగతి తెలుసుకునే వీలుండాలని, ఎక్కడైనా ఆలస్యం జరిగితే సంబంధిత అధికారులను బాధ్యులుగా చేయాలని సూచించారు. ప్రజావాణి సేవలను వికేంద్రీకరించటంతో జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో పెండింగ్ అర్జీల సంఖ్య తగ్గుతుందని, కిందిస్థాయిలోనే తక్కువ సమయంలోనే పలు సమస్యలు పరిష్కరించే వీలుంటుందని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

ట్రాఫిక్ ఫ్రీ సిటీగా మహానగరం

హైదరాబాద్, ఏప్రిల్ 28, హైదరాబాద్ నగరాన్ని ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలతో తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'హెచ్-సిటీ' ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకోసం రూ. 7,042 కోట్ల భారీ బడ్జెట్‌కు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ముఖ్యంగా కేబీఆర్ పార్కు చుట్టూ ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఫ్లైఓవర్లు, అండర్ పాసుల నిర్మాణం ప్రారంభమైంది. నల్లగొండ ఎక్స్ రోడ్స్ నుంచి ఓవైసీ జంక్షన్ వరకు చేపట్టిన కీలక ఫ్లైఓవర్ పనులు 90 శాతం పూర్తయ్యాయి. యుద్ధప్రాతిపదికన ఈ పనులు జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు.హైదరాబాద్ మహా నగరాన్ని గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దే లక్ష్యంతో 'హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్' పేరుతో తెలంగాణ ప్రభుత్వం భారీ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వ హయాంలో వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం కింద మొదలై పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులతో పాటు.. ప్రస్తుతం కొత్తగా గుర్తించిన ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ మూడు కార్పొరేషన్ల పరిధిలోని ఇంజినీరింగ్ పనులను వేగవంతం చేసేందుకు ముగ్గురు కమిషనర్లు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ముఖ్యంగా జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ప్రతివారం సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ పనుల పురోగతిని పర్యవేక్షిస్తున్నారు.ఈ భారీ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం మొత్తం రూ. 7,042 కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఇందులో సింహభాగం.. అంటే సుమారు రూ. 5,942 కోట్లను హెచ్-సిటీ పనులకే కేటాయించింది. ప

లండన్ లో ఘనంగా బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు

గులాబీ జెండా - కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష

బీఆర్ఎస్ పార్టీలో చేరిన పలువురు ఎన్నారైలు

- ఎన్నారై బీఆర్ఎస్ నాయకులు అనిల్ కూర్మాచలం ఉ నవీన్ రెడ్డి

బీఆర్ఎస్ పార్టీ 26వ వసంతంలో అడుగిడుతున్న సందర్భంగా లండన్ లో ఎన్నారై బీఆర్ఎస్ యూకే ఆధ్వర్యంలో ఘనంగా పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు.

ముందుగా పార్టీ జెండా ఆవిష్కరించి గులాబీ జెండా పండుగ నిర్వహించి, అమరవీరులకు, జయశంకర్ సర్ ని స్మరించుకొని నివాళుర్పించి, ఎన్నారైలంతా జై తెలంగాణ.. జై బీఆర్ఎస్.. జై కేసీఆర్.. జై జై కేసీఆర్ నినాదాలతో మార్మోగించారు. అనంతరం కేక్ కట్ చేసి బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకలను ప్రారంభించారు.

యూకే లోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న ఎందరో తెలంగాణ ఎన్నారైలు, ఎన్నారై బీఆర్ఎస్ యూకే అధ్యక్షుడు నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగింది. వారందరికీ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

ఈ కార్యక్రమంలో భారీగా తెలంగాణ ఎన్నారైలు పార్టీలో చేరినట్టు సంయుక్త కార్యదర్శి నవీన్ మాదిరెడ్డి తెలిపారు.

కేసీఆర్ - కేటీఆర్ గార్ల నాయకత్వంలో పనిచేయాలనే సంకల్పంతో పార్టీలో చేరుతున్నామని, అలాగే తెలంగాణ రాష్ట్రానికి కేసీఆర్ గారి నాయకత్వమే శ్రీరామ రక్షా అని భావిస్తున్నట్టు ఎన్నారైలు తెలిపారు.

బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకల సందర్భంగా క్షేత్రస్థాయిలో, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతీ బీఆర్ఎస్ కార్యకర్తలకు నాయకులకు ఎన్నారై బీఆర్ఎస్ యూకే అధ్యక్షుడు నవీన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

మన ఇంటి పార్టీ మన తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి , పది సంవత్సరాల కేసీఆర్ పాలనలో దేశంలోనే మన రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలబెట్టిన బీఆర్ఎస్ పార్టీని మనం కాపాడుకోవాలని, కెసిఆర్ నాయకత్వమే మనకు శ్రీరామ రక్షా అని ఎన్నారై బీఆర్ఎస్ యూకే కమ్యూనిటీ అఫైర్స్ చైర్ పర్సన్ రమేష్ ఎసెంపల్లి తెలిపారు.

నాటి ఉద్యమం నుండి నేటి వరకు లండన్ నుండి ప్రత్యేక కార్యాచరణతో అనుక్షణం పార్టీ వెంట ఉన్నామని, అవకాశం కల్పించిన కేసీఆర్ గారికి, కేటీఆర్ గారికి ఇతర పార్టీ పెద్దలకు కార్యదర్శి సురేష్ గోపతి కృతజ్ఞతలు తెలిపారు.

26 సంవత్సరాల గులాబీ పండగ వేళ అన్ని సందర్భాల్లో పార్టీ వెంట ఉన్న ప్రతీ కార్యకర్తలకు, అలాగే లండన్ లో మమ్మల్ని ప్రోత్సహించి నడిపించిన ఎన్నారై బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం గారికి, ప్రతీ ఎన్నారై బీఆర్ఎస్ బాధ్యులకు సంయుక్త కార్యదర్శి ప్రశాంత్ కటికనేని కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ రాష్ట్రంలో మళ్ళీ బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చే వరకు కేసీఆర్ గారిని ముఖ్యమంత్రిని చేసే వరకు అలుపెరగకుండా పోరాటం చేస్తామని కార్యదర్శి అబ్దుల్ జాఫర్ తెలిపారు.

రాబోయే తరాలకు బీఆర్ఎస్ పార్టీ చరిత్రను, కేసీఆర్ గారి పోరాటాన్ని తెలియజేసేలా కృషి చేస్తామని, యువతరమంతా కేసీఆర్ - కేటీఆర్ గార్ల నాయకత్వాన్ని కోరుకుంటుందని, పార్టీ బలపర్చడానికి ఎన్నారై బీఆర్ఎస్ యూకే యువజన విభాగం ప్రత్యేకంగా కృషి చేస్తుందని సంయుక్త కార్యదర్శి అబ్దుల్ ఖుదూస్ తెలిపారు.

తెలంగాణ ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ కేసీఆర్ గారి నాయకత్వమే శ్రీరామ రక్షా, తెలంగాణ ప్రజల కోసం పని చేసేది, అన్ని సందర్భాల్లో తెలంగాణ ప్రజల పక్షాన నిలిచింది కేవలం బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని, బీఆర్ఎస్ పార్టీని కెసిఆర్ గారి నాయకత్వాన్ని నమ్మిన ప్రజలకు మేలే జరిగిందని కాబట్టి మనమంతా కేసీఆర్ గారి వెంటే ఉండాలని, ఎన్నారైలంతా కేసీఆర్ వెంటే ఉన్నారని ఎన్నారై బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం తెలిపారు.

శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్న ఉప రాష్ట్రపతి సి పి రాధాకృష్ణన్





భారత ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ మంగళవారం తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు.ఆలయం వద్దకు చేరుకున్న ఉపరాష్ట్రపతికి అర్చకులు సంప్రదాయబద్ధంగా ఇస్తికాపాల్ స్వాగతం పలికారు. ఆయన ఆలయంలోని ధ్వజస్తంభానికి మొక్కుకుని శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆశీర్వాద మండపంలో టీటీడీ ఈవో ఎం. రవిచంద్ర అమ్మవారి ప్రసాదాలు అందజేసి శేష వస్త్రంతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, టీటీడీ బోర్డు సభ్యులు జి.భానుప్రకాశ్ రెడ్డి, జేఈవో వి వీరబ్రహ్మం, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ, తిరుచానూరు ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

శ్రీ వేద నారాయణ స్వామివారి ఆలయంలో శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి, 2026 ఏప్రిల్ 28 నాగలాపురం శ్రీ వేదవల్లీ సమేత శ్రీ వేదనారాయణ స్వామివారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయంలో మే 1 నుండి 9వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్న విషయం విదితమే. బ్రహ్మోత్సవాల ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి సహస్రనామార్చన, శుద్ధి నిర్వహించారు. అనంతరం ఉదయం 7.30 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు.

శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి, 2026 ఏప్రిల్ 28- ఏప్రిల్ 29న అంకురార్పణ- ఏప్రిల్ 30 నుండి మే 2వ తేదీ వరకు వసంతోత్సవాలు తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన, శుద్ధి నిర్వహించారు. అనంతరం ఉదయం 6 నుండి 9 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు.ఏప్రిల్ 29న అంకురార్పణ :అమ్మవారి ఆలయంలో వసంతోత్సవాలకు బుధవారం సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ నిర్వహిస్తారు. ఏప్రిల్ 30 నుండి మే 2వ తేదీ వరకు వసంతోత్సవాలు : ఉత్సవాల్లో భాగంగా మే 1వ తేదీ ఉదయం 9.30 గంటలకు స్వర్ణ రథోత్సవం కన్నులపండువగా జరుగనుంది. వసంతోత్సవాలు జరిగే మూడు రోజులు మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 4.30 గంటల వరకు శుక్రవారపు తోటలో అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. రాత్రి 7.30 నుండి 8.30 గంటల వరకు ఆలయ నాలుగు మాడ వీధుల్లో అమ్మవారు విహరించి భక్తులను కటాక్షించనున్నారు. ఇందుకోసం భక్తులు ఒక్కొక్కరు రూ.150/- చెల్లించి వసంతోత్సవంలో పాల్గొనవచ్చు. ఈ ఉత్సవాల కారణంగా ఏప్రిల్ 30 నుండి మే 2వ తేదీ వరకు కల్యాణోత్సవం, ఊంజలసేవ, వేద ఆశీర్వచనం మే 1న లక్ష్మీ పూజ, కుంకుమార్చన, బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది.

కవిత పార్టీ తెలంగాణ రాష్ట్ర సేన'నా, 'తెలంగాణ. రావుల సేన'నా లేక 'రేవంత్ రెడ్డి సేన'నా?

బ్లూ ఇండియా పార్టీ అధ్యక్షులు బొగ్గు ప్రసాద్

హైద్రాబాద్ ఏప్రిల్ 28 'తెలంగాణ రాష్ట్ర సేన' అనే పేరుతో కవిత తెలంగాణలో ఒక కొత్త రాజకీయ పార్టీని ప్రారంభించడం ఒక ముఖ్యమైన మలుపు. కాలం గడిచే కొద్దీ, ఏమీ అంటే ఏమిటో మనం తెలుసుకోవాలి: అది 'తెలంగాణ రాష్ట్ర సేన'నా, 'తెలంగాణ. రా వుల సేన'నా ((ప్రజల సేన), లేక 'రేవంత్ రెడ్డి సేన'నా?

ఇక్కడ ప్రధానంగా లేవనెత్తిన అంశం సామాజిక న్యాయం. నిజమైన సామాజిక న్యాయం అంటే, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు మరియు ఇతర వర్గాలకు వారి జనాభా నిష్పత్తికి అనుగుణంగా పాలనలోనూ, అన్ని రంగాలలోనూ వాటా దక్కడం మాత్రమే.

కవిత చెప్పే 'సామాజిక న్యాయం', కాంగ్రెస్, బిజెపీ లేదా బిఆర్ఎస్ పార్టీలు చెప్పేది ఒక్కటేనా? ఒక కఠినమైన సత్యాన్ని మనం ఎదుర్కోవాలి తెలుగు రాష్ట్రాల్లో జనాభాలో, ఓటర్లలో మరియు పౌరులలో ఎక్కువ మందిగా ఉన్నప్పటికీ, బీసీలకు ఇప్పటివరకు ఏ రాజకీయ పార్టీ కూడా ముఖ్యమంత్రి పదవిని అందించలేదు. 'తెలంగాణ రాష్ట్ర సేన' అధికారంలోకి వచ్చి, మొదటిసారిగా ఒక బీసీ నాయకుడిని ముఖ్యమంత్రిగా నియమిస్తే, అది నిజమైన సామాజిక న్యాయం అవుతుంది. అయితే, సామాజిక న్యాయం పేరుతో కవిత మళ్ళీ ముఖ్యమంత్రి అయితే, అది దిగువ కులాలకు గల అన్యాయమే తప్ప సామాజిక న్యాయం కాదు. ఇది సామాజిక తెలంగాణ కాదు. అభివృద్ధి పేరుతో దోపిడి చేస్తూ, అధికారపు ఫలాలను ఆస్వాదిస్తూ కవిత గారు స్పష్టంగా మౌనం పాటించారు. కానీ తన అవసరం కోసం ఇప్పుడు అకస్మాత్తుగా ఆమెకు సామాజిక న్యాయం గుర్తొచ్చింది . ఉద్యమకారులపై ఒక్కొక్కరిపై అన్యాయం జరుగుతూ ఉండగా, అప్పుడు మాట్లాడలేదు. అది ఆమె వరకు వచ్చేసరికి స్వంత ప్రయోజనాల కోసం మాత్రమే కొత్త పార్టీ మరియు సామాజిక న్యాయం గురించి మాట్లాడుతున్నారు.

దీని నుండి స్పష్టమవుతోంది: మీ అజెండా వ్యక్తిగతం, సామాజిక న్యాయం కాదన్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడటానికి ఉద్యమం యొక్క మొదటి మరియు రెండవ దశలలో అనేక మంది అమరవీరులు తమ ప్రాణాలను త్యాగం చేశారు. కార్మికుల నుండి రైతుల వరకు, అటెండర్ స్థాయి నుండి ఐఏఎస్ అధికారుల వరకు ప్రతి ఒక్కరూ పాల్గొని, ఢిల్లీ మెడలు వంచి రాష్ట్రాన్ని సాధించారు. ఈ గొప్పతనం ఉద్యమానికి మరియు అమరవీరుల త్యాగానికి చెందినది. అనేక కవులు, కళాకారులు తమ జీవితాలను అర్పించి, మన పోరాట బలం ప్రపంచానికి చూపించారు.

అయితే, ఉద్యమంలో చిట్టెలుకలా దూరిన కవిత గారు, లిక్కర్ కేసులో ఢిల్లీలో తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు. ఇది నిజం కాదా? మనం ఢిల్లీ లో తెలంగాణ విముక్తి కోసం ధైర్యంగా పోరాడినా, చివరికి దోపిడీదారుల కుటుంబం చేతుల్లోకి రాష్ట్రం వెళ్లింది. కవిత గారు ఆ దోపిడీదారుల కుటుంబానికి చెందినవారు. మీరు దోచుకున్న సొమ్ము ఎక్కడ ఉంది? మీరు పార్టీ పెట్టారు, దానిని నడపడానికి నిధులు ఎక్కడి నుండి వస్తున్నాయి? ప్రజలకు స్పష్టం చేయాలి.

దీని అర్థం స్పష్టం: మీరు కూడా ఆ దోపిడీలో భాగస్వామ్యం వహించారు. 'బంగారు తెలంగాణ' అనే నినాదం 'సామాజిక తెలంగాణ' నిర్మాణాన్ని అడ్డుకునే ప్రయత్నంలో మీ భాగస్వామ్యం కూడా ఉన్నది మీరు మీ కుటుంబానికి బంగారు జీవితం అందింది తెలంగాణ ప్రజలకు కాదన్నారు.

అలాగే, 'దొరల' పాలన తర్వాత 33% మహిళా రిజర్వేషన్ బిల్లుతో 'దొరసానుల' పాలన కు మార్గం సుగమమైంది. రేపు ఇలాంటి పరిణామాలే జరుగుతాయని దీనికి సాక్ష్యం. దొరల పాలన తొలగిపోతుందని మనం భావించిన 'తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ, దొరసానుల పాలనను తీసుకువస్తుంది. కాబట్టి, జాగ్రత్త!అని హెచ్చరించారు.

క్రేన్ ప్రమాద బాధితులను పరామర్శించిన మంత్రి వివేక్

శంకర్ పల్లి శంకర్పల్లి సమీపంలో జరిగిన క్రేన్ ప్రమాదంలో గాయపడిన వారిని మంత్రి వివేక్ వెంకటస్వామి పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. సోమవారం జరిగిన ఈ ప్రమాదంలో ఐదుగురు వలస కార్మికులు ప్రాణాలు కోల్పోవడం ఎంతో బాధాకరం. మరో 12 మంది గాయపడిన విషయం తెలిసి తీవ్రంగా కలచివేసింది. అధికారుల వివరాల ప్రకారం, ఎన్సిసి సంస్థకు చెందిన నిర్మాణ క్రేన్ బలమైన గాలుల కారణంగా ఒక షెడ్పై కూలిపోవడంతో, వర్షం నుంచి రక్షణ కోసం అక్కడ నిలబడి ఉన్న కార్మికులపై పడింది. ఈ దుర్ఘటనలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందగా, పలువురికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఎమ్మెల్యే కాలె యాదయ్య తో కలిసి ఆసుపత్రికి వెళ్లి గాయపడిన వారికి అందుతున్న చికిత్సపై వివరాలు మంత్రి తెలుసుకున్నారు. ఈ ఘటనపై పూర్తి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాల సహాయం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు.

చంపాపేట లో ఎంపి ఈటల పర్యటన



హైదరాబాద్ చంపాపేట్ డివిజన్ లో కాలనీ సమస్యలను పరిశీలించి, పలు అభివృద్ధి కార్యక్రమాలలో ఎంపి ఈటల రాజేందర్ పాల్గొన్నారు.

ఎంపి మాట్లాడుతూ సాయి నగర్ మద్దెల చెరువు ఒక మురికి కూపం లాగా ఉండేది. ఈ ప్రాంతంలో ఉన్న డ్రైనేజ్ అంత ఇక్కడే నిల్వ ఉండి, ఈగలు, కంపు వాసన, చుట్టుపక్కల ఎక్కడ బోరు వేసినా పొల్యూటెడ్ వాటర్ తో సతమతమవుతున్నారాని దివంగత నేత వంగ మధు గారు మంచినీళ్ల చెరువుగా చేయాలని ప్రయత్నం చేసి కోటి రూపాయలతో డ్రైనేజీ పైప్ లైన్ వేయించారు. కానీ శుభ్రపరిచే వాళ్ళు లేక పైపు కెపాసిటీ సరిపోక ఎక్స్రా ఆయన నీరంతా కూడా చెరువులోకి పోయి మళ్ళీ మురికి కూపం లాగా మిగిలిపోయింది. దీని ప్రక్షాళన కోసం మురికి నీరు చెరువులోకి రాకుండా ఉండటం కోసం, అవసరమైతే ఇంకో పైప్లైన్ వేసి దాని కెపాసిటీ పెంచుతామని అన్నారు.

చెరువు దగ్గర జులాయిల, పోకిరిల అడ్డాగా మారిపోయింది. ఇది మాదకద్రవ్యాలకు అడ్డాగా కాకుండా ఉండాలని పోలీసులకు ఫిర్యాదు చేస్తాము. చెరువు చుట్టూ ఫెంక్షన్ కూడా వేయించాలని కోరారు. దానిపై నేను అధికారులతో మాట్లాడి వేయించే ఏర్పాటు చేస్తానని హామీ ఇస్తున్నాను. ప్రజలు సమస్యలతో సతమతమవుతుంటే రాజకీయాల, ఫోటోల, ఆధిపత్యం కోసం పాకులాడే వాళ్ళని చూస్తున్నాం. ప్రజలకు ఎవరు ఏం చేస్తారో గమనిస్తూనే ఉన్నారు. ఈ ప్రాంత ప్రజలు నా దగ్గరకు వచ్చి కంప్లైంట్ చేస్తే నేను పరిశీలిస్తానని చెప్పాను ఇప్పుడు వచ్చి పరిశీలిస్తున్నాను. దీనికి ఏమేమి పనులు పెండింగ్ ఉన్నాయో అవన్నీ చేసే ప్రయత్నం చేస్తానని అన్నారు.

హైదరాబాదులో ఎక్కడ చూసినా ఏదో ఒక మూలన పైప్ లైన్ కోసం తవ్వుతూనే ఉంటారు. వేగంగా పెరుగుతున్న సిటీకి అనుగుణంగా పైప్లైన్ కెపాసిటీ ఉండాలి. మెగా ఫంక్షన్ హాల్ దగ్గర దివంగత నేత వంగ మధు గారి ప్రోత్బలం, నేను లెటర్ పెట్టి 6 కోట్ల రూపాయలతో కొత్త బాక్స్ డ్రైనేజీ కట్టడం జరుగుతుంది. దాన్ని కూడా అధికారులతో మాట్లాడి సకాలంలో పూర్తయ్యే ప్రయత్నం చేస్తాను. కార్పొరేటర్ల కాల పరిమితి అయిపోతున్నప్పుడే చెప్పినం... ఎంతోమంది కార్పొరేటర్లు నిత్యం ప్రజల మధ్యలో ఉంటేనే సమస్యలు పరిష్కారం అవడం కష్టం ఉంది వారంతా దిగిపోయారు కాబట్టి మీరు స్పెషల్ ఆఫీసర్లు గంట, రెండు గంటలు గాని ఈ ప్రాంతంలో తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించాలి కానీ ఎక్కడ జరుగుతున్నట్టు కనిపించడం లేదు. మాలాంటివారు ఈ ప్రాంతాల్లో తిరిగి ఈ పనుల పర్యవేక్షణ చేసి, ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలను పై తప్పకుండా దృష్టి పెడతామని అన్నారు.

రిపోర్టర్ జగన్మోహన్ రెడ్డి హత్య పై ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావుగ్రాంతి

- కఠిన చర్యలకు ఆదేశం

చిత్తూరు జిల్లా వి. కోట మండలంలో ఆంధ్రజ్యోతి విలేకరి జగన్మోహన్ రెడ్డి దారుణ హత్యకు గురికావడం పై చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ల ప్రసాదరావు తీవ్రగ్రాంతి వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ఫోర్త్ ఎస్టేట్గా భావించే జర్నలిస్టుల పై ఇలాంటి దాడులు జరగడం అత్యంత దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, జర్నలిస్టులకు రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఉమ్మడి వరంగల్ బీఆర్ఎస్ నేతలతో కేటీఆర్ భేటి

వరంగల్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో సమావేశమైయారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పార్టీ సభ్యత్వ నమోదుపై ప్రధానంగా చర్చ జరిగింది. సభ్యత్వ నమోదు, ప్రతి గ్రామం మరియు వార్డులో పార్టీని మరింత బలోపేతం చేయడంపై నేతలకు కేటీఆర్ దిశానిర్దేశం చేసారు. త్వరలో జరగనున్న వరంగల్ కార్పొరేషన్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అనుసరించాల్సిన వ్యూహాలపై కూడా విస్తృతంగా చర్చ జరిగింది. ఉమ్మడి జిల్లాలోని ప్రతి నియోజకవర్గాల వారీగా పార్టీ స్థితిగతులను సమీక్షించారు. అదేవిధంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో పార్టీ పోషించాల్సిన పాత్రపై చర్చ జరిపారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో చురుకుగా పాల్గొని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు కృషి చేయాలనికేటీఆర్ సూచించారు.

అరాచక శక్తులకు సహించేది లేదు

ఎస్పీ ఎ. ఆర్.దామోదర్ మాస్ వార్నింగ్

విజయనగరం పట్టణంలో తరచూ అల్లర్లకు పాల్పడుతూ, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న యువకులకు పోలీసులు గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. జొన్నగుడ్డి, లంకాపట్నం తదితర ప్రాంతాల్లో జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. మద్యం, గంజాయి సేవించి రోడ్లపై అల్లర్లకు పాల్పడే యువతకు పోలీస్ స్టైల్ లో కౌన్సెలింగ్ చేస్తామని, అలాంటి వాటికి యువకులు దూరంగా ఉండి, పద్ధతిగా లేకపోతే తమదైన స్టైల్ లో చర్యలు ఉంటాయని ఎస్పీ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.

ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్, మజ్జిగ పంపిణీ

చేసిన సర్పంచ్ బండెల సుజాత

కోహెడ సిద్దిపేట జిల్లా కోహెడ మండలం కోహెడ గ్రామంలో ఎండల తీవ్రత దృష్ట్యా ఉపాధి హామీ కూలీల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సర్పంచ్ బండెల సుజాత–బాలకిషన్ మంచి కార్యక్రమాన్ని చేపట్టారు. ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లి, కూలీలకు వడదెబ్బ తగలకుండా ఓఆర్ఎస్ మరియు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ. కూలీలు ఎండలో ఇబ్బంది పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పని ప్రదేశంలో నీడ మరియు తాగునీటి సౌకర్యం ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ పంపిణీ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేందర్,వెల్పుల వెంకటస్వామి,8వ వార్డు మెంబర్ గజ్జెల ప్రవీణ్, 10వ వార్డు మెంబర్ నంగునూరి కిరణ్, మరియు 9వ వార్డు మెంబర్ కల్పన పాల్గొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ ఎత్తి మహేశ్, ఆశా కార్యకర్తలు పాల్గొని కూలీలకు ఆరోగ్య సూచనలు అందజేశారు.తమ సంక్షేమం పట్ల శ్రద్ధ వహించి, సమయానికి మజ్జిగ మరియు ఓఆర్ఎస్ అందజేసినందుకు కూలీలు సంతోషం వ్యక్తం చేస్తూ గ్రామ పాలకవర్గానికి మరియు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మారుతోన్న విశాఖ ముఖచిత్రం

విశాఖపట్టణం, ఏప్రిల్ 28 టెక్ దిగ్గజం గూగుల్ రాకతో విశాఖపట్నం ముఖచిత్రం నుంచే మారబోతోందని ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఆశాభావం వ్యక్తం చేశారు. విశాఖ జిల్లా తర్లువాడలో గూగుల్ ఏఐ డేటా సెంటర్ నిర్మాణానికి భూమి పూజ చేసిన సందర్భంగా నారా లోకేష్ కీలక ప్రసంగం చేశారు. ఈ రోజు (ఏప్రిల్ 28న) తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్, ఏఐ హబ్ కోసం కేవలం ఒక భవనానికి జరిగిన భూమి పూజ మాత్రమే కాదని, ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ చరిత్రలో ఒక కొత్త అధ్యాయానికి పునాది వేసిన పవిత్రమైన రోజని ఆయన అభివర్ణించారు. ఏపీ అభివృద్ధిలో భాగస్వాములు అవుతున్న ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా నారా లోకేష్ కృతజ్ఞతలు తెలిపారు. ఐదేళ్లలో రాష్ట్రం ఎదుర్కొన్న పరిస్థితులను గుర్తు చేస్తూ, పెట్టుబడిదారులు ఏపీ వైపు చూడాలంటేనే భయపడే పరిస్థితి ఉండేదని నారా లోకేష్ పేర్కొన్నారు. అయితే 2024 ఎన్నికల్లో ప్రజలు ఎన్డీయే ప్రభుత్వానికి పట్టం కట్టడంతో, మళ్లీ రాష్ట్రంలో పెట్టుబడుల పండుగ మొదలైందని అన్నారు. వైజాగ్‌లో జీ అంటే గూగుల్ అనే శబ్దం ఇకపై మార్మోగబోతోందని వ్యాఖ్యానించారు. ఇక నుంచి గ్లోబల్ ఐటీ మ్యాప్‌లో విశాఖకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని హర్షం వ్యక్తం చేశారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయకత్వంలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' మంత్రంతో రాష్ట్రం చరిత్ర సృష్టిస్తోందని, డబుల్ ఇంజిన్ సర్కార్‌తో మరిన్ని ప్రయోజనాలు రాబోతున్నాయని ధీమా వ్యక్తం చేశారు.

మనది గూగుల్... వారిది గొడ్డలి

గూగుల్ ఏఐ డేటా సెంటర్ శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ వైసీపీ పాలనపై తనదైనశైలిలో సెటైర్లు వేశారు. 'లాస్ట్ పంచ్ మనదైతే వచ్చే కిక్ వేరు అని పవన్న డైలాగ్ ఉంది. మనది గూగుల్ (ఉనీనీణశ్రీవ)... వైసీపీ వాళ్లది గొడ్డలి. గూగుల్ వస్తే ఎవరైనా అహ్వానించాలి. కానీ ఇక్కడి గొడ్డలి పార్టీ ఏం చేసింది. రాయలసీమలో ఉన్న వైసీపీ ఎంపీ గూగుల్ వద్దని పిల్ వేస్తారు. వాళ్లకి ఎలాగూ ఇలాంటివి తీసుకురావడం చేత కాదు... వేరేవాళ్లు తెస్తే ఏడుస్తారు.

మాది "గూగుల్" అయితే, మాది "గొడ్డలి"..

బోత్ ఆర్ నాట్ సేమ్ బ్రదర్..

గూగుల్ ఏఐ డేటా సెంటర్‌కు భూమి పూజ అయ్యింది.సీసీడీ పేషెంట్ వచ్చి నేనే గూగుల్ తెచ్చానని తప్పకుండా అంటారు. గూగుల్ సెర్చ్‌లో గూగుల్ ఎవరు తెచ్చారని అడిగితే నారా చంద్రబాబునాయుడు అని వస్తున్నా.. వాళ్లు మాత్రం దుష్ప్రచారం చేస్తుంటారు. కనుక నేను చెప్పేది ఒక్కటే మాది గూగుల్... మాది గొడ్డలి.. బోత్ ఆర్ నాట్ సేమ్' అని గుర్తుంచుకోవాలంటూ మంత్రి నారా లోకేష్ పంచ్‌లు వేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఆలయాలు అభివృద్ధి

గత ప్రభుత్వ కాలంలో ఆలయాన్ని పట్టించుకోని పాలకులు

అందరి సహకారంతో ధర్మపురి క్షేత్ర మాస్టర్ ప్లాన్ అమలు

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల జగిత్యాల జిల్లా ధర్మపురి లోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రాన్ని గత ప్రభుత్వ పాలకులు ఏనాడు పట్టించుకోలేదని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మంగళవారం రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు, జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, దేవాదాయ శాఖ వైదిక సలహాదారు గోవిందుల హరి తో కలిసి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, మాస్టర్ ప్లాన్ అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా వారిని ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించి, ఘనంగా శాలువాతో సత్కరించి, స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతు 2027 లో నిర్వహించే గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు ఏలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారని మంత్రి అడ్లూరి తెలిపారు. ఇందులో భాగంగా గోదావరి తీరం వెంట ఉన్న పలు ఆలయాలను అభివృద్ధి చేయాలని సిఎం నిర్ణయించారని మంత్రి వివరించారు. గోదావరి తీరంలో ఉన్న భద్రాచలం లోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం మాస్టర్ ప్లాన్, టెంపుల్ సిటీ పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారని మంత్రి వివరించారు. బాసరలోని సరస్వతి అమ్మవారు, కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయం, వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంతో పాటు ధర్మపురి లోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ అభివృద్ధి మాస్టర్ ప్లాన్ అమలుతో పాటు టెంపుల్ సిటీ నిర్మాణ పనులకు ప్రణాళికలు తయారు చేయాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు దేవాదాయ శాఖ కమిషనర్ తో పాటు పలువురు అధికారులు కలిసి మాస్టర్ ప్లాన్ అమలు తీరును పరిశీలించి, నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తారని మంత్రి వివరించారు. ధర్మపురిలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి ప్రజల నుంచి సహకారం కావాలని మంత్రి కోరారు. పట్టణంలోని అన్ని వర్గాల ప్రజల సహకారంతో ధర్మపురి క్షేత్ర మాస్టర్ ప్లాన్ అమలతో పాటు టెంపుల్ సిటీ నిర్మాణ పనులు చేస్తామని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ రాజా గౌడ్, లక్ష్మి నరసింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనభట్ల దినేష్, రాష్ట్ర దేవాదాయ శాఖ అధికారులు, ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి ఆలయ అధికారులు, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి.

ఇంచార్జి కమిషనర్ శారదా దేవి.

నగరంలోని ప్రజల నుండి వచ్చిన సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఇంచార్జి కమిషనర్ శారదా దేవి అధికారులకు సూచించారు. ప్రజా పిర్యాదుల పరిష్కారం వేదికలో వచ్చిన పిర్యాదుల మేరకు మంగళవారం ఎల్ఐసి రోడ్డు, ఆఫీసర్స్ క్లబ్ , బాలాజీ కాలనీ, పోలీస్ క్వార్టర్స్, హమీద్ నగర్ తదితర ప్రాంతాలను అధికారులతో కలసి ఇంచార్జి కమిషనర్ పరిశీలించి, అనంతరం అధికారులతో సమావేశమై సమీక్షించారు. ఈ ఎస్ ఐ హాస్పిటల్ సమీపంలోని అన్న కాంటీన్లో ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కమిషనర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కారం వేదిక, వార్డుల్లో పర్యటించిన సమయంలో వచ్చే వినతులను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఆయా విభాగాల అధికారుల దృష్టికి వచ్చిన సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని తెలిపారు. ముఖ్యంగా త్రాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, కాలువలు శుభ్రం చేయడం, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించి ఎక్కువ సమస్య లు వస్తున్నాయని వాటిని పరిష్కరించాలని తెలిపారు. జనన గణన, స్వీయ గణన ను వేగవంతం చేయాలని ఆన్లైన్ ద్వారా స్వర్ణ వార్డు కార్యదర్సులను ఆదేశించారు. వార్డు పర్యటన, సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, డిసిపీ ఖాన్, రెవిన్యూ అధికారులు సేతు మాధవ్, ఏసిపి పార్వతి ప్రియ, డి.ఈ మధు ,శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, సుమతి, తదితరులు ఉన్నారు.

వికసిత భారత్ కు గూగల్ సెంటర్ ప్లస్ అవుతుంది

విశాఖపట్టణం, ఏప్రిల్ 28 (న్యూస్ పల్స్)విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తున్న గూగుల్ ఏఐ డేటా సెంటర్, 2047 నాటి వికసిత్ భారత్ లక్ష్యానికి ఒక పునాది రాయి లాంటిదని గూగుల్ క్లౌడ్ గ్లోబల్ ఇన్ ఫ్రా వైస్ ప్రెసిడెంట్ బికాస్ కోలే అన్నారు. శంకుస్థాపన కార్యక్రమం అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏఐ యుగంలో ఈ డేటా సెంటర్ కీలక పాత్ర పోషిస్తుందని, భారత డిజిటల్ పరివర్తనలో ఇది అత్యంత ముఖ్యమైనదని వివరించారు.ఈ ప్రాజెక్టుతో విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గ్లోబల్ ఏఐ ఎకానమీ దిశగా పరుగులు పెడతాయని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటివరకు అంతర్జాతీయ సబ్ సీ గేట్ వేలుగా ఉన్న ముంబై, చెన్నైల సరసన ఇప్పుడు విశాఖ కూడా నిలుస్తుందని స్పష్టం చేశారు. కొత్తగా ఏర్పాటు చేయనున్న ఫైబర్ ఆప్టిక్ కేబుల్ లైన్లు విశాఖను ఇతర ప్రాంతాలతో అనుసంధానిస్తాయని, దీనివల్ల సంప్రదాయ నౌకాయాన మార్గాలు ఇకపై డిజిటల్ ట్రేడ్ రూట్లుగా మారతాయని పేర్కొన్నారు. ఈ డేటా సెంటర్ ఏర్పాటులో భాగస్వామ్యం వహిస్తున్న అదానీ కనెక్స్, ఎయిర్‌టెల్ నెక్స్ట్రాలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.ఇండస్ట్రియల్ కారిడార్‌గా ఎదుగుతున్న విశాఖకు ఈ డేటా సెంటర్ టెక్నాలజీ భవిష్యత్తును అందిస్తుందని కోలే అన్నారు. స్థానిక యువతకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు, వారికి అడ్వాన్స్‌డ్ క్లౌడ్, ఏఐ టెక్నాలజీలపై శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. దాదాపు 10 వేల మందికి పైగా మహిళలు మైక్రో ఎంటర్‌ప్రైజ్‌లు స్థాపించేందుకు గూగుల్ సహకారం అందిస్తుందని వెల్లడించారు.ఈ ప్రాంతానికి ఇంధన భద్రత కల్పించేలా కొత్త ట్రాన్స్‌మిషన్ లైన్లు, ఎనర్జీ స్టోరేజి వ్యవస్థలను ఏర్పాటు చేస్తామన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు, ఈ ప్రాంతానికి ఆర్థిక స్థిరత్వం కల్పించేలా ఈ డేటా సెంటర్‌ను నిర్మిస్తున్నామని బికాస్ కోలే వివరించారు.

భూమి పూజ చేసిన అశ్విన్ వైష్ణవ్

ఏపీలో టెక్నాలజీ రంగంలో మరో భారీ పెట్టుబడికి అడుగుపడింది. విశాఖపట్నంలో గూగుల్ ఏర్పాటు చేయనున్న క్లౌడ్ ఏఐ హబ్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర ఐటీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మంగళవారం శంకుస్థాపన చేశారు. అదానీ కనెక్స్, ఎయిర్‌టెల్ నెక్స్ట్రా భాగస్వామ్యంతో గూగుల్ సుమారు 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడితో ఈ ప్రాజెక్టును చేపడుతోంది.విశాఖ జిల్లా తర్లువాడలో 1 గిగావాట్ సామర్థ్యంతో ఈ హైపర్ స్కేల్ ఏఐ డేటా సెంటర్‌ను నిర్మించనున్నారు. ఈ మెగా ప్రాజెక్ట్ కోసం తర్లువాడ, రాంబిల్లి, అడవివరం ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వం మొత్తం 600 ఎకరాల భూమిని కేటాయించింది. ఈ శంకుస్థాపన కార్యక్రమానికి ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గూగుల్ ఎక్స్‌పీరియన్స్ జోన్‌ను సందర్శించి అక్కడి టెక్నాలజీలను పరిశీలించారు.ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా ఇంఛార్జి మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి, ఎంపీ భరత్ పాల్గొన్నారు. గూగుల్ గ్లోబల్‌న్ఫ్రా వైస్ ప్రెసిడెంట్ బికాస్ కోలే, భారతీ ఎంటర్‌ప్రైజెస్ వైస్ చైర్మన్ రాకేష్ మిట్టల్, అదానీ గ్రూప్ ప్రతినిధి జీత్ అదానీ, హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్ జనరల్ లారా విలియమ్స్, గూగుల్ ఇండియా ప్రతినిధి ప్రీతి లొబానా తదితరులు హాజరయ్యారు. ఈ ప్రాజెక్టుతో విశాఖ నగరం గ్లోబల్ టెక్నాలజీ మ్యాప్‌లో కీలక స్థానం సంపాదించనుంది.

నీట్ పరీక్షకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఏప్రిల్ 28:మే 3 న జరుగనున్న నీట్ పరీక్ష (నేషనల్ ఎలిజిబిలిటి కమ్ ఎంట్రన్స్ టెస్ట్) ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి అన్నారు.

మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైనారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 12 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, నీట్ పరీక్ష మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. ఈ పరీక్షకు జిల్లా నుండి 3 వేల 468 మంది అభ్యర్థులు హాజరవుతున్నారన్నారు. అభ్యర్థులు నిర్ణీత సమయంలోగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టరు సూచించారు. అభ్యర్థులు చివరి నిమిషలో కంగారు పడకుండా ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా చూడాలన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్లో ఉన్న నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే అభర్థులకు కరెంట్, మంచినీరు అందులో ఉంచాలని, కేంద్రాల వద్ద పోలీసు అధికారులు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. వైద్య అధికారులు మెడికల్ కిట్, అంబులెన్సులు అందుబాటులోఉంచాలని ఆదేశించారు. నిరంతరాయ విద్యుత్తు సరఫరా ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దివ్యాంగులకు అవసరమైన వీల్ చైర్ వంటి వాటిని అందుబాటులో ఉండేలా డిడబ్ల్యూఓ అధికారిని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ చంద్రావతి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన సంస్కృత భాష శిబిరం

సంస్కృతంలో తర్ఫీదు పొందిన సాధకులు అదృష్టవంతులు

రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు కటంగూరి సత్యనారాయణ రెడ్డి

హన్మకొండ ఏప్రిల్ 28 (ఎక్స్ ప్రెస్ న్యూస్)హన్మకొండలో మూడు రోజుల ఉచిత సంస్కృత భాష శిబిరం నేడు ముగింపు సంస్కృతభారతి -- ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 26 నుండి 28 వరకు మూడు రోజులు ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు సంస్కృత భాషపై ఆసక్తి ఉన్న వారికి ఉచిత సంస్కృత భాషా ప్రవేశవర్గల శిక్షణ శిబిరం కేఎల్ఎన్ రెడ్డి కాలనీ, హన్మకొండలోని శ్రీ రామకృష్ణ సేవా మందిరంలో ఘనంగా నిర్వహించబడింది. కేవలం మూడు రోజుల్లోనే సంస్కృతంలో సరళంగా మాట్లాడేలా ప్రత్యేక పద్ధతిలో శిక్షణను ఇచ్చిన సంస్కృత భారతి టీమ్ సభ్యులు అభినందనీయులని, సంస్కృతంలో తర్ఫీదు పొందిన సాధకులు అదృష్టవంతులని, సేవా సమితి అధ్యక్షులు కటంగూరి సత్యనారాయణ రెడ్డి అన్నారు. ఇకనుండి ప్రతి ఆదివారం యోగా, ధ్యానంతో పాటుగా, ఇంగ్లీష్ మరియు సంస్కృత భాషలో శిక్షణ ఇవ్వబడుటకు కార్యాచరణ ప్రణాళిక తయారు చేస్తున్నామని దాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిబిరంలో వరంగల్ సంస్కృత భారతి

ప్రతినిధులు ఆనంద్, వరలక్ష్మి, సంపత్ కుమార్, పేట శ్రీనివాస్ దంపతులు, రామానంద సాగర్, రామన్న, కాకతీయ రచయితల వేదిక అవధాని చేకూరి శ్రీరామ్, దాత డాక్టర్ శివ రాణి, సేవా సమితి ప్రధానకార్యదర్శి ప్రభు చైతన్య, యువ విభాగ్ సభ్యులు నరేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలకు ఆర్థిక స్వాతంత్రం అవసరం

జీవితంలో అనుకున్నది సాధించాలి.

చిన్న వయసులో పెళ్లిళ్లు వద్దు.

జిల్లా కలెక్టర్ సీ.హెచ్. ప్రియాంక.

నారాయణపేట ఏప్రిల్ 28 () ఆడపిల్లకు ఆర్థిక స్వాతంత్రం అవసరమని, చిన్న వయస్సులో పెళ్లి చేసుకోకుండా ఉన్నత చదువులు చదివి జీవితంలో అనుకున్నది సాధించాలని జిల్లా కలెక్టర్ సీ.హెచ్. ప్రియాంక సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక ,బాలల భద్రత వారం (27 నుంచి 02/05 వరకు) కార్యక్రమాలలో భాగంగా మంగళవారం మహిళాభివృద్ధి/శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కౌమార బాలికల గర్భధారణ సమస్యలపై, ఇంటి నుంచి పారిపోవడం అనే అంశంపై జిల్లా బాలల సంరక్షణ విభాగం మద్దూరు రైతు వేదికలో కిశోర బాలికలతో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఒక్క నిర్ణయం జీవితాన్నే మార్చేస్తుందని, ఎలాంటి పరిస్థితుల్లోనైనా తొందర పాటు నిర్ణయం తీసుకోరాదని చెప్పారు. తాను హాస్టల్ లో చదువుకునే రోజుల్లో తన రూమ్ మెట్ ఒక అమ్మాయి వాళ్ల అమ్మకు ఆరోగ్యం బాగా లేదని చదువు ఆపేసి పెళ్లి చేసుకుందని, ఇప్పుడు ఆమె ఇద్దరు పిల్లలతో సాధారణ గృహిణిగా జీవనం సాగిస్తోందని, అదే చిన్న వయసులో పెళ్లి చేసుకోకుండా ఉంటే చదువుకుని ఉంటే ఇప్పుడు ఆమె ఎంతో ఉన్నత స్థాయి ఉద్యోగంలో ఉండేదని కలెక్టర్ చెప్పారు. అలాగే 2012 లో తాను డిప్యూటీ కలెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న సమయంలో ఒక కౌమార దశ బాలిక ప్రేమ పేరిట ఆకర్షణకు గురైతే స్వయంగా తానే

పోలీసులు, అంగన్ వాడీ సీ డి పీవో లకు సమాచారం ఇచ్చి బాల్య వివాహాన్ని అడ్డుకున్నానని అప్పటి జ్ఞాపకాలను కలెక్టర్ విద్యార్థినులతో పంచుకున్నారు. కౌమార దశలో ప్రేమా, ఇష్టం, అభిమానం అనేవి కేవలం ఆకర్షణ అని, విద్యార్థినిలు వాటికి దూరంగా ఉండాలని కలెక్టర్ హితవు చెప్పారు. బాలికలు మంచిగా చదువుకుని జీవితంలో సెట్ కావాలని అప్పుడే ఆ తర్వాత జీవితం ప్రశాంతంగా ఉంటుందన్నారు.

కౌమార వయసులో పెళ్లిళ్లు చేసుకోవడం వల్ల వచ్చే ఆరోగ్యపరమైన, సామాజికపరంగా వచ్చే సమస్యలు వాటి వల్ల ఎదుర్కొనే ప్రమాదాలపై అదేవిధంగా ఇంటి నుంచి పారిపోవడం వలన లైంగిక దోపిడి,శ్రమ దోపిడి , అక్రమ రవాణా జరగడం, చట్ట పరంగా వచ్చే సమస్యల గురించి వివరించారు. బాల్యవివాహాల నిరోధక చట్టం ,బాలలపై జరిగే లైంగిక దోపిడీ నుంచి రక్షణ చట్టాల గురించి, ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సోషల్ మీడియా ప్రభావం గురించి బాలికలకు అవగాహన కల్పించారు.

ప్రతి బాలిక వాళ్లు అనుకున్న లక్ష్యాన్ని సాధించే విధంగా చదువుకోవాలని జీవితంలో ఆర్థిక స్థిరత్వం సాధించడం వల్లనే ఏదైనా సాధ్యపడుతుందని ప్రతి ఒక్కరూ చదువు కొనసాగించడంపై దృష్టి పెట్టి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు.

పెట్రోల్ బంకులను రెండవ రోజు ఆకస్మిక తనిఖీలు

నిర్వహించిన జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు

అద్దంకి ప్రకాశం జిల్లాలో పెట్రోల్, డీజిల్ నిల్వలపై ప్రజల్లో నెలకొన్న సందేహాలను తొలగించేందుకు జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, అద్దంకి పట్టణంలోని ఐఎస్ఆర్ పెట్రోల్ బంకులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలలో భాగంగా బంక్లలో ఉన్న ఇంధన నిల్వలు, సరఫరా పరిస్థితులు, విక్రయ విధానాలపై అక్కడ ఉన్న సిబ్బందితో మాట్లాడి, పెట్రోల్, డీజిల్ సరఫరా సక్రమంగా కొనసాగించాలని సూచించారు. ఎటువంటి అంతరాయం లేకుండా వినియోగదారులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. అలాగే బంకు నిర్వాహకులు ఇంధనాన్ని కేవలం వాహనాలకు మాత్రమే నింపాలని, క్యాన్లలో నింపరాదని ఆదేశించారు. క్యాన్లలో నింపడం వలన బ్లాక్ మార్కెట్కు తరలించే అవకాశం ఉందని, అందువల్ల ఈ విధానాన్ని కచ్చితంగా పాటించాలని సూచించారు.

ఈ సందర్భంగా ఇంధన నిల్వలు, పంపిణీ విధానాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ, జిల్లాలో పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని తెలిపారు. ఇంధన సరఫరాలో ఎటువంటి అంతరాయం లేదని స్పష్టం చేశారు. ఇంధన పంపిణీలో అక్రమాలు జరగకుండా మరియు శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ప్రతి పెట్రోల్ బంకు వద్ద పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సోషల్ మీడియాలో పెట్రోల్, డీజిల్ కొరతపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. పుకార్లు ప్రజల్లో ఆందోళనలకు దారి తీసే అవకాశం ఉన్నందున వాటిని నమ్మకూడదని, షేర్ చేయవద్దని సూచించారు.అదనంగా, ప్రజలు డీజిల్ పెట్రోలు కొనుగోళ్లు చేయకుండా కేవలం అవసరమైన మేరకు మాత్రమే ఇంధనం కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అధికంగా ఇంధనం నిల్వ చేయడం లేదా తప్పుడు సమాచారం వ్యాప్తి చేయడం చట్టపరమైన చర్యలు తప్పమన్నారు. జిల్లా ఎస్పీ వెంట దర్శి డిఎస్పి బాలమురళీకృష్ణ, ఎస్బి సిఐ శ్రీనివాసరావు, అద్దంకి సీఐ సుబ్బరాజు మరియు సిబ్బంది ఉన్నారు.

మంత్రి నాదెండ్ల మనోహర్ ను

పరామర్శించిన మంత్రులు



హైదరాబాద్ హైదరాబాద్ లోని మంత్రి నాదెండ్ల మనోహర్ స్వగృహంలో ఆయన్ని మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, అచ్చెన్నాయుడు, అనగాని సత్య ప్రసాద్, సత్య కుమార్ యాదవ్ కలిసి, పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం నాదెండ్ల మనోహర్ ను ఓదార్చి, ధైర్యం చెప్పారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఎంపీ వద్దిరాజు రవిచంద్ర చొరవతో

అందుబాటులోకి పెట్రోల్, డీజిల్

ఖమ్మం, ఏప్రిల్, 28: గడిచిన రెండు రోజులుగా సరఫరా లేక, బంకులు మూతపడటంతో ఏర్పడ్డ పెట్రోల్, డీజిల్ కొరత ఇప్పుడు సమసిపోయింది. బిఆర్ఎస్ ఎంపీ, పెట్రోలియం, సహజవాయువు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు అయిన వద్దిరాజు రవిచంద్ర చొరవ ఫలితంగా జిల్లాలో 24 గంటల్లో పెట్రోల్ డీజిల్ అందుబాటులోకి వచ్చింది. ఆయిల్ సరఫరా కంపెనీలు బీపీసీఎల్, ఐఓసీఎల్, హెచ్ పీసీఎల్ ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడి ఆయిల్ ట్యాంకర్లను రిటైల్ అవుట్ లెట్ లకు తక్షణమే పంపి కొరతను నివారించాలని చేసిన సూచన మేరకు ఆయా కంపెనీలు స్పందించి సరఫరాను వేగవంతం చేశాయి. ఆ మేరకు ఖమ్మం జిల్లాకు సోమవారం150 ఆయిల్ ట్యాంకర్ల లోడు సరఫరా కాగా, మంగళవారం మరో 100 ట్యాంకర్ల లోడు సరఫరా కానుంది. దీంతో మంగళవారం రాత్రి నుంచి జిల్లాలోని అన్ని బంకుల్లో పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉండే అవకాశం ఉంది. ప్రజలెవరు ఆందోళన చెందవద్దని, అవసరానికి మించి పెట్రోల్, డీజిల్ నిల్వ చేయవద్దని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కోరారు.

ఆటో డ్రైవర్ పై కేసు నమోదు

పరిమితికి మించి ఎక్కించుకున్న ఆటో డ్రైవర్

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 28 కన్నాయిగూడెంకన్నాయిగూడెం మండల కేంద్రంలోని ఏటూరు వద్ద కన్నాయిగూడెం ఎస్సై సురేష్ కుమార్ పరిమితికి మించి ఎక్కువ ప్రయాణికులను ఎక్కించుకోరాదు.

ఎక్కించుకున్నచో చట్టపరమైన చర్యలు తీసుకోబడును..... ఏటూరు లో వాహనాల తనిఖీలు చేపడుతుండగా ఎం 25 ఎ6822 ఆటో లో 15 మంది ప్రయాణికులను ఎక్కించుకున్న వ్యక్తికి భారీగా జరిమానా విధించి కేసు నమోదు చెయ్యడం జరిగింది కావున డ్రైవర్ లు అందరూ ఇది గమనించగలరు పరిమితికి మించి ఎక్కువ మంది ప్రయాణికులను ఎక్కించుకోరాదు. అతి వేగంగా వెళ్ళరాదు పోలీసులు సి ఆర్ పి సిబ్బంది పాల్గొన్నారు

ఏటూరునాగారం మండలంలోని వివిధ గ్రామాలలో ఐకెపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఆత్మ చైర్ పర్సన్ కర్ల అరుణ.

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 28 ఏటూరు నాగారం బిరామన్నగూడెం-పాప్కాపూర్, రోహీర్, శివపూర్ గ్రామాలలో ఐకెపి ధాన్యం కొనుగోలు సెంటర్లు ప్రారంభం

రైతుల కష్టానికి తగిన మద్దతు ధర కల్పించాలని ఉద్దేశంతో ప్రభుత్వం గ్రామ గ్రామాన కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు...

ధాన్యం విక్రయాలలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను సూచించారు...

ఈ కార్యక్రమంలో ఐకెపి అధికారులు, మహిళా సంఘాలు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడ్ల దేవేందర్, మండల నాయకులు చిటమట రఘు, ఆర్టిఏ డైరెక్టర్ వసంత శ్రీనివాస్,జిల్లా ఎస్సి సెల్ కార్యదర్శి కొండగొర్ల పోషయ్య,జిల్లా యూత్ ఉపాధ్యక్షులు సర్వ అక్షిత్,సర్పంచులు గద్దల నవీన్, దేవులపల్లి విజయ్ కుమార్,జబ్బ సరోజున,మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెద్ది రాజ్ కుమార్,మండల యూత్ అధ్యక్షులు గంట కృష్ణ,గ్రామ కమిటీ అధ్యక్షులు గ్రామ మహేష్,కొండగొర్ల శ్రీనివాస్,జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు కట్కూరి రాధిక,వార్డు సభ్యులు దనసరి సుగుణ,పిఎసిఎస్ డైరెక్టర్ వంగపండ్ల రవి యాదవ్,సాయిని శ్రీనివాస్,దనసరి చందు,మల్యాల రామచందర్,మాజీ ఎంపీటీసీ కోడి వేణు గోపాల్, బంటు ఉదయ, ఎంపెల్లి రమ తదితరులు పాల్గొన్నారు...

క్రీడాకారునికి చేయూత పదివేల రూపాయలు

ఆర్థిక సహాయం అందించిన కుంజ సూర్య

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 28 ములుగు లక్నో. ఉత్తర్ ప్రదేశ్ లో 67 వ నేషనల్ స్కూల్ గేమ్స్ లో సెలెక్ట్ అయిన సైక్ ముబీన్...

పక్క రాష్ట్రం వెళ్ళుటకు నిరుపేదరికంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న క్రీడాకారుడి ప్రతిభ పట్ల స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న కుంజా సూర్య ..

బిక్రీడా పోటీలకు ఎంపికై ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న క్రీడాకారుడికి పదివేల రూపాయల ఆర్థిక సహాయం చేసి అండగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన కార్యదర్శి ఉ మంత్రి సీతక్క గారి తనయుడు కుంజా సూర్య

లక్నో వెళ్ళుటకు మరియు అక్కడి ఖర్చులను భరిస్తానని హామీ ఇచ్చారు అదేవిధంగా అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని ప్రోత్సహించడం జరిగిందన్నారు...

బితెలంగాణ ప్రభుత్వం క్రీడాకారుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఈ సందర్భంగా తెలిపారు

పాలిసెట్ పరీక్షకు విద్యార్థులు సిద్ధంకండి - జిల్లా కన్వినర్ మదన్ మోహన్

నాగర్ కర్నూలు ప్రజాబలం ప్రతినిధి నాగర్ కర్నూలు జిల్లాలో పాలీసెట్-2026 పరీక్షకు విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించిందని జిల్లావ్యాప్తంగా మొత్తం 2,912 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు పాలీసెట్ జిల్లా కన్వీనర్ మదన్ మోహన్ తెలిపారు. ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా పాలిటెక్నిక్ కోర్సులపై విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు. టెక్నికల్ విద్య ద్వారా తక్కువ కాలంలోనే ఉద్యోగ అవకాశాలు పొందే అవకాశం ఉండటంతో ఈ కోర్సులకు ఆదరణ పెరుగుతోందని వివరించారు. పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులకు మెరుగైన మార్గదర్శకత్వం అందించేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా వనపర్తి పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత కోచింగ్ తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కోచింగ్‌లో అనుభవజ్ఞులైన అధ్యాపకులు బోధన అందిస్తూ, పరీక్ష నమూనా, ముఖ్య ప్రశ్నలు, సమయ నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు.

అదనంగా, విద్యార్థుల సౌకర్యార్థం జిల్లాలో మొత్తం 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రాలను జీపీఎస్ మ్యాపింగ్ ద్వారా సులభంగా గుర్తించి చేసుకోవచ్చునని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదివి, తమ సందేహాలను నివృత్తి చేసుకుంటూ పరీక్షకు సిద్ధమైతే మంచి ర్యాంకులు సాధించగలరని పాలిసెట్ జిల్లా కన్వినర్ మదన్ మోహన్ సూచించారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడం మంచి విషయమని పేర్కొన్నారు.

మే 13న నిర్వహించనున్న పాలీసెట్-2026 పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు.

సాయిబాబా దేవాలయం 26 వ వార్షికోత్సవం సందర్భంగా

ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అన్నప్రసాద వితరణ

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 28 ఏటూరు నాగారం ఏటూరునాగారం మండల కేంద్రం లోని శ్రీ షిర్డీసాయి బాబా దేవాలయం 26 వ వార్షికోత్సవం సందర్భంగా భక్తుల సహకారంతో నిర్వహించదానికి అన్నీ ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. సాయి బాబా ఆలయంలో బుధవారం ఉదయం నుంచి సాయి నాధునికి అభిషేకం, అర్చనలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు వుంటాయని ఆలయ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్ కమిటీ సభ్యులు,ఆలయ అర్చకులు ఆనంద్ పాండే శర్మ, రాధాకృష్ణ శర్మ విలేకరులకు ఒక ప్రకటన లో తెలిపారు.

అనంతరం అన్నప్రసాదం కలదని,గ్రామస్తులు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి సాయి నాధుని ఆశీస్సులు పొంది అన్న ప్రసాదం,తీర్థ ప్రసాదాలు స్వీకరించగలరని ఈ సందర్భంగా ఒక ప్రకటన లో తెలిపారు.

ఇట్టి కార్యక్రమానికి అంజన్న మలా దారులు కూడా పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. అందరూ ఆహ్వానితులే అని అన్నారు.

వేసవి దృష్టిలో ఉంచుకొని రోగులకు వడదెబ్బ వార్డ్,నీటి వసతి,స్టీల్ కుర్చీలు,ఫ్యాన్లు ఏర్పాటు...

ప్రభుత్వ సాధారణ ఆస్పత్రి సూపర్డెంట్ డాక్టర్ టి. ఉషారాణి.

నాగర్ కర్నూలు ప్రజాబలం ప్రతినిధి నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని ఆసుపత్రికి వస్తున్న గర్భిణీలు,ఇతర రోగులకు నిత్యం ఉపయోగపడే విధంగా ప్రత్యేకంగా తాగునీటి వసతిని,ఓ.పి.సమయంలో రోగులు కూర్చునుటకు ప్రత్యేకంగా కుర్చీలు ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ సాధారణ ఆస్పత్రి మెడికల్ సూపర్డెంట్ డాక్టర్ టి.ఉషారాణి తెలిపారు. ప్రతిరోజు పెరుగుతున్న ఉష్ణోగ్రత దృష్ట్యా ఆసుపత్రికి వచ్చిన రోగులలకు మెరుగైన ఆరోగ్య సేవలతో పాటు వసతుల కల్పన కూడా నిర్వహిస్తున్నామని అన్నారు. వివిధ దూర ప్రాంతాల నుండి వస్తున్న గర్భిణీలు స్కానింగ్ ఇతర మూత్ర రక్త పరీక్షలకు చేయించుకొనుటకు గంటల పాటు ఆసుపత్రిలో ఉండాల్సి ఉంటుందని వారికి,ఇతర రోగులకు ఆసుపత్రిలో పలు వార్డులలో ప్రత్యేకంగా14నూతన స్టీల్ కుర్చీలు,20త్రాగునీరు డబ్బాలు,50ఫ్యాన్లు ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు.వడదెబ్బ దృష్టిలో ఉంచుకొని వేడిమికి తట్టు కోలేకపోతున్న అవుట్ పేషంట్ (ఓ.పి.)రోగులకు ఆసుపత్రి ఆవరణలో కూర్చునుటకు ప్రత్యేకంగా వసతులు కల్పించినట్లు ఆమె తెలిపారు. వడదెబ్బ రోగులకు ప్రత్యేకంగా వార్డు ఏర్పాటు చేసి సిబ్బందిని ప్రత్యేకంగా ఉంచి 24 గంటలపాటు వడదెబ్బ రోగులను ఆరోగ్య సేవలతో పాటు,పర్యవేక్షిస్తున్నట్లు ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ సి.జె. వసంత్ కుమార్, రేసిడెంట్ మెడికల్ అధికారులు డాక్టర్ ప్రశాంత్ డాక్టర్ రోహిత్,ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన కాంగ్రెస్ మండల నాయకులు

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 28 ఏటూరు నాగారం బిసీతక్క ఆధ్వర్యంలో ములుగు జిల్లా లోని అన్ని గ్రామాలు అభివృద్ధి వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసిన ఘనత మంత్రి సీతక్క కు దక్కుతుంది

మంగళవారం కాంగ్రెస్ మండల పార్టీ నాయకులు చిటమట రఘు ఆధ్వర్యంలో ఆత్మ చైర్మన్ కర్ల అరుణ ఆర్టిఏ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ ములుగు జిల్లా మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెద్ది రాజబాబు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి కోయగూడా ఎల్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని పాప్కపురం గ్రామాన్ని కాంగ్రెస్ మండల పార్టీ నాయకులు గ్రామ ప్రజలతో కలసి జరుగుతున్న అభివృద్ధి పనులు సిసి రోడ్లను పర్యవేక్షించడం జరిగింది. సి ఆర్ గ్రాండ్ కింద మంత్రి సీతక్క పప్కపురం గ్రామానికి కోటి రూపాయలతో సైడ్ సిసి రోడ్లను మంజూరు చేసిందని పనులు కూడా చాలా వేగవంతంగా నడుస్తున్నాయని అన్నారు గ్రామీణ ప్రజలు చాలా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని వర్షాకాలం వచ్చిన ఏ భయం లేకుండా సైడ్ డ్రైన్ సిసి రోడ్డు గ్రామంలో పూర్తి స్థాయిలో అయినాయని సంతోషాన్ని వ్యక్తం చేశారు సీతక్క మంత్రిగా ఉండడం వల్లనే ఈ అభివృద్ధి జరుగుతుందని తెలియజేశారు. గత పది సంవత్సరాల బి ఆర్ ఎస్ పాలనలో గ్రామాలు ఏ మాత్రం అభివృద్ధి చెందలేదని అభివృద్ధి అనేది ఎక్కడ కనిపించలేదని అన్నారు.

బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు పది సంవత్సరాలు అధికారంలో ఉండి ఏ గ్రామాన్ని పట్టించుకున్న పాపాన పోలేదని బి ఆర్ఎస్ పార్టీ నాయకులు డప్పు కొట్టుకోవడం తప్ప ఏమి పని చేయలేదని అన్నారు.మంత్రి సీతక్క గ్రామీణ అభివృద్ధి, శిశు సంక్షేమ, రూరల్ డెవలప్మెంట్ఉ గ్రామీణ నీటిపారుదల మంత్రిగా ఉండి గ్రామాల అభివృద్ధి ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్నారని అన్నారు.

ఈ కార్యక్రమంలో మహిళా మండల నాయకులు బంటు ఉదయ, మంజుల, సంపత్,తదితరులు పాల్గొన్నారు

మర్పల్లి మాదకద్రవ్యాల నివారణ మరియు దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు

మర్పల్లి సబ్ ఇన్స్పెక్టర్ తెలిపారు

వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి ఏప్రిల్ 28 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా: మర్పల్లి మండలంలో28.04.2026రి [POWER MECH Company)మర్పల్లి పోలీస్ వారు వారి పోలీస్ స్టేషన్ పరిధిలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మర్పల్లి స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొని విద్యార్థులకు, యువతకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు.

కార్యక్రమంలో ఎస్.ఐ మాట్లాడిన

యువత భవిష్యత్తు: దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉందని, డ్రగ్స్ వంటి అలవాట్లకు బానిసలై బంగారు భవిష్యత్తును పాడుచేసుకోవద్దని సూచించారు.

ఆరోగ్య విఘాతం: గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల వల్ల మెదడుపై తీవ్ర ప్రభావం పడుతుందని, ప్రాణాంతక వ్యాధులకు దారితీస్తుందని హెచ్చరించారు.

కఠిన చట్టాలు: డ్రగ్స్ రవాణా చేసినా లేదా విక్రయించినా చిన్నూ చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని, అటువంటి వారిపై రౌడీ షీట్లు కూడా తెరుస్తామని తెలిపారు.

సమాచార వ్యవస్థ: మీ పరిసరాల్లో ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే 100 నంబర్‌కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయి.

ముగింపు:

ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బందితో పాటు, స్థానిక ప్రజా ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండి, క్రీడలు మరియు విద్యపై దృష్టి సారించాలని

జూన్‌లో ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజం ఈవెంట్

వివిధ దేశాల ప్రతినిధులకు ఆహ్వానం

ప్రభుత్వ, ప్రైవేటు హాస్పిటళ్లను సందర్శించనున్న ప్రతినిధులు

మంత్రి దామోదర్ రాజనర్సింహా వెల్లడి

ఆరోగ్య, పర్యాటకశాఖ అధికారులతో మంత్రి సమీక్ష

ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 28 (ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా :ప్రపంచ వైద్య పర్యాటక కేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతామని, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా, అన్నారు, జూన్‌లో ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజం ఈవెంట్ నిర్వహించేందుకు,ఏర్పాట్లు చేయాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు, ఈవెంట్ నిర్వాహణ కోసం పర్యాటకశాఖతో సమన్వయం చేసుకోవాలని సూచించారు, ఈ మేరకు ఆరోగ్య, పర్యాటక శాఖ, ఉన్నతాధికారులతో సెక్రటేరియట్‌లోని తన చాంబర్‌లో మంత్రి సమీక్ష నిర్వహించారు, మంగళవారం ఉదయం జరిగిన ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి, డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, డాక్టర్ సంగీత, సత్యానారాయణ, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ, డాక్టర్ గౌరవ్ ఉప్పల్, ఆరోగ్యశాఖ, పర్యాటక శాఖ ఉన్నతాధికారులు, పాల్గొన్నారు, మెడికల్ టూరిజం అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలు, కలిగే ప్రయోజనాలపై సమావేశంలో చర్చించారు. హైదరాబాద్‌ను ప్రపంచ వైద్య పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి,చేసిన సూచనలను ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు,ఇకపై ప్రతి సంవత్సరం హైదరాబాద్‌లో కనీసం ఒక మెడికల్ టూరిజం,ఈవెంట్‌ను నిర్వహించాలని,సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారని, ఇందుకు అనుగుణంగా ఈ ఏడాది జూన్‌లో, మొదటి ఈవెంట్ నిర్వాహణకు ఏర్పాట్లు చేయాలని, ఆరోగ్యశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు,ఈ ఈవెంట్‌లో దేశ, విదేశీ, వైద్య, ఫార్మా రంగ ప్రముఖులను, భాగస్వాములను చేయాలని మంత్రి సూచించారు,మెడికల్ టూరిజంలో ఉన్న ప్రైవేటు సంస్థలను సైతం, ఈవెంట్‌లో

భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు, ఆఫ్రికా, ఏసియా, మిడిల్, ఈస్ట్ తదితర కంట్రీస్ నుంచి ప్రతినిధులనుఆహ్వానించాలని,సూచించారు, హైదరాబాద్‌లోని ప్రైవేటు, కార్పొరేట్ హాస్పిటల్స్‌తో పాటు, నిమ్స్, టిమ్స్, ఉస్మానియా, గాంధీ వంటి ప్రభుత్వ హాస్పిటళ్ల సందర్శనకు ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్న 3 టిమ్స్ హాస్పిటల్స్‌లో ఇంటర్నేషనల్ పేషెంట్ సర్వీసెస్ విభాగాలను ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు,ఒక్కో హాస్పిటల్‌లో 50 బెడ్లతో ఇంటర్నేషనల్ పేషెంట్స్ వార్డు ఏర్పాటు చేయాలని ఆదేశించారు, దేశ, విదేశాల నుంచి వచ్చే పేషెంట్లతో ప్రభుత్వ హాస్పిటళ్లకు ఆదాయం,సమకూరుతుందని, తద్వారా హాస్పిటళ్ల నిర్వాహణ మెరుగుపడి స్థానిక ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుతాయన్నారు....

మహిళా సర్పంచ్ ల ఫోరం రాష్ట్ర కన్వీనర్ గా గుంటిపల్లి రేణుక

రాష్ట్ర మహిళా సర్పంచ్ ల ఫోరం కన్వీనర్ గా శ్రీమతి గుంటిపల్లి రేణుక ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ లోని సెక్రటేరియట్ ఆవరణలో జరిగిన మహిళా సర్పంచ్ ల సమావేశంలో మహిళా సర్పంచ్ లందరూ కలిసి రేణుకను కన్వీనర్ గా ఎన్నుకున్నారు. ఎంబిసీ, సంచార జాతుల సామాజిక నేపధ్యం గల గుంటిపల్లి రేణుక ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామం నుండి భారీ మేజార్టీతో ఎన్నికయ్యారు. ఈ సారి తెలంగాణ పంచాయతీల్లో దాదాపు 50 శాతం సర్పంచ్ స్థానాలు మహిళలకే దక్కాయి. రాష్ట్రంలో మొత్తం 12,703 గ్రామాల్లో 6403 మంది మహిళా సర్పంచ్ లే ఉన్నారు. గ్రామ పంచాయతీల్లోని సమస్యలు, ముఖ్యంగా గ్రామాల్లోని మహిళలపై, మహిళా సర్పంచ్ ల ప్రాదాన్యాలపై మహిళా సర్పంచ్ ల ఫోరం పనిచేస్తుంది. మండల, జిల్లా కమిటీల ఎన్నిక అనంతరం హైదరాబాద్ లో రాష్ట్ర మహిళా సర్పంచ్ ల ఫోరం పూర్తి స్థాయి కమిటీని ఎన్నిక ఉంటుంది. ఈ లోగా మహిళా సర్పంచ్ ల ఫోరం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించి సమస్యలపై అధ్యయనం చేస్తుంది. పూర్తి స్థాయి రాష్ట్ర కమిటి ప్రకటన వరకు రేణుక కన్వీనర్ గా వ్యవహరిస్తారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించి మహిళా సర్పంచ్ లను ఏకం చేసి జిల్లా కమిటీలను, రాష్ట్ర కమిటిని అధికారికంగా నియమిస్తామని, ఇదే క్రమంలో సమస్యలపై చర్చించి పోరాటం చేస్తామని ఈ సందర్భంగా గుంటిపల్లి రేణుక చెప్పారు. గ్రామ పంచాయతీలు ఆర్థిక పరిపుష్టిని సాదించేందుకు నేరుగా నిధులు విడుదల చేయాలని, గ్రామాల్లో మహిళా సర్పంచ్ ల సాధికారిత కోసం ప్రభుత్వం చొరవ తీసుకునే విధంగా, మహిళా సర్పంచ్ ల వేతనం పెంచేవిదంగా ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తామన్నారు. నిత్యం గ్రామాల్లోనే ప్రజల మధ్య ఉంటూ ఇంటివలే ఊరిని చక్కదిద్దే బాద్యతలను కలిగిన మహిళా సర్పంచ్ ల సమస్యలపై మరింత అద్యయనం చేస్తున్నామని చెప్పారు.

ఎక్కడికక్కడే ప్రజాసమస్యలకు సత్వర పరిష్కారం

మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు

47 మంది అర్జీలు సమర్పణ

రెడ్డిగూడెం, ప్రజల వద్దకు పాలనను చేర్చి, ఎక్కడికక్కడే సమస్యలను పరిష్కరించేలా ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. రెడ్డిగూడెంలోని మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజాదర్బారులో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు పాల్గొన్నారు. నిర్విరామంగా వినతులను స్వీకరించారు. ప్రజల సమస్యలను ఓపికగా విని వారి సమస్యల పరిష్కారం కోసం ఆదేశించారు. 47 మంది అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. అధికారులు ఎక్కడా నిర్లక్ష్యంగా ఉండకూడదన్నారు. ప్రజా సమస్యలకు నాణ్యమైన పరిష్కారాన్ని చూపించాలన్నారు. ఒకవేళ సమస్య పరిష్కారం కానీ పక్షంలో ఎందుకు పరిష్కారం కావడం లేదు దానికి సంబంధించిన విషయాలను కూడా ప్రజలకు తెలియజేయాలన్నారు.ప్రభుత్వ అధికార యంత్రాంగం ఎక్కడికక్కడ బాధ్యతతో పని చేయాలన్నారు. సమస్యల మూలాలను గుర్తించి శాశ్వత పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలన్నారు.ప్రజాదర్బారులో పోలీసు, రెవెన్యూ, పంచాయతీ రాజ్, విద్యుత్తు, రహదారుల అభివృద్ధి, వివిధ శాఖలకు సంభందించిన సమస్యలతో పాటు వ్యక్తిగత సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు.

మ్యాపింగ్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలి

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఏప్రిల్ 28:ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా 2002 నుండి ఉన్న ఓటరు జాబితాను 2025 ఓటరు జాబితాకు అనుగుణంగా సవరించే మ్యాపింగ్ ప్రక్రియ పురోగతి పై డిసి, ఎఆర్ఓ, ఈఆర్ఓలతో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి సమీక్షించారు.

మంగళవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశానికి అదనపు కలెక్టర్లు ఫైజన్ అహ్మద్, విజయేందర్ రెడ్డిలతో కలిసి కలెక్టర్ హాజరైనారు. ఈ సందర్భంగా మ్యాపింగ్ ప్రక్రియ ద్వారా ఇంటింటికి వెళ్లి సర్వే చేసిన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. బిఎల్ఓలకు ఒక చోట ఎక్కువ ఒక చోట తక్కువ లిస్టులు కాకుండా ఇంచుమించు సమానంగా ఉండేలా కేటాయించాలని సూచించారు. మ్యాపింగ్ ప్రక్రియ పై తహసీల్దారులు దృష్టి పెట్టి త్వరితగతిన వెరిఫికేషన్ పూర్తి చేయించాలని ఆదేశించారు. అదేవిధంగా పది ఇరవై శాతానికి తక్కువగా అయిన మ్యాపింగ్ ప్రక్రియ శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించినారు. తదుపరి సమావేశం వరకు మ్యాపింగ్ ప్రక్రియ పురోగతి కనిపించని ఎడల తీవ్ర చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ సంబంధిత అధికారులను హెచ్చరించారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు, డిప్యూటి కమీషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న మొబైల్స్ ను రికవరీ చేసిన రైల్వే పోలీసులు

సికింద్రాబాద్. ఫోన్ పోగొట్టుకున్న వెంటనే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా నమోదు చేయడం, సంబందిత పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో పాటు బ్యాంక్ అకౌంట్ల లావాదేవీల నిలుపుదల చేయించుకోవాలని ప్రభుత్వ రైల్వే డీఎస్పీ ఎస్ ఎన్ జావెద్ ప్రజలకు తెలిపారు.

సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి స్వాదీనం చేసుకున్న సుమారు 150సెల్ ఫోన్ లను ఈ రోజు సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఇన్ స్పెక్టర్ సాయి ఈశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో వాటి యజమానులకు డీఎస్పీ చేతుల మీదుగా అందచేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ రైళ్లలో ప్రయాణం చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రయాణికులకు సూచించారు. చిన్న అజాగ్రత్త వహించినా విలువైన వస్తువులు, సెల్ ఫోన్ లు పోగొట్టుకొని బాధపడాల్సి వస్తుందని అన్నారు. చిన్న పిల్లలతో కలసి ప్రయాణం చేసేటప్పుడు తక్కువ లగేజీ ఉండే విదంగా చూసుకోవాలని, విలువైన వస్తువులు వెంట తీసుకు పోకపోవడమే మంచిదని, సెల్ ఫోన్ లు ఛార్జింగ్ పెట్టినప్పుడు తగిన జాగ్రత్తలు వహించాలని, మరుగుదొడ్డికి వెళ్లెప్పుడు కుటుంబ సభ్యులకు లేదా సహచర ప్రయాణికులకు చెప్పి వెళ్లాలని వివరించారు. సెల్ ఫోన్ లను రికవరీ చేయడంలో సీఈఐఆర్ పోర్టల్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.

ప్రశ్నించే వారిపై అక్రమ కేసులా ?
ప్రభుత్వ తీరుపై మండిపడ్డ మాజీ మంత్రి హరీష్ రావు



జహీరాబాద్ ప్రజాబలం ప్రతినిధి జహీరాబాద్ , ఏప్రిల్ 28 కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలు, రైతుల ఇబ్బందులు, రాష్ట్ర అభివృద్ధిని గాలికొదిలేసి.. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే గొంతులపై అక్రమ కేసులు, సిట్లు, కమిషన్లు వేస్తూ అణచివేసే కుట్ర చేస్తుందన్నారు. సంగారెడ్డి జిల్లా కంది సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌తో పాటు మరో ఏడుగురు పార్టీ కార్యకర్తలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు, జహీరాబాద్ శాసనసభ్యులు మాణిక్ రావు, సంగారెడ్డి శాసనసభ్యులు చింత ప్రభాకర్ పరామర్శించారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పోలీసుల తీరుపై మండిపడ్డారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలతో పాటు ఏదో గ్యారంటీగా ప్రజాస్వామ్యం కల్పిస్తామని చెప్పి నేడు నియంతలా వ్యవహరించడం సరైనది కాదన్నారు. కేసీఆర్, బీఆర్ఎస్ నాయకత్వంపై ఫేక్ పోస్టులు పెడుతున్న వారి గురించి పోలీసులకు ఆధారాలతో సహా ఫోన్ అప్పగించి క్రిశాంక్ ఫిర్యాదు చేశారని కానీ తప్పు చేసిన వారిని వదిలేసి, కంప్లైంట్ ఇచ్చిన క్రిశాంక్ నే అరెస్టు చేయడం అత్యంత దుర్మార్గం. దొంగలను వదిలేసి ఫిర్యాదుదారులను జైల్లో పెడతారా? ఇదెక్కడి న్యాయమన్నారు . ముఖ్యమంత్రి, హోం మంత్రి రెండు బాధ్యతలూ మీరే పెట్టుకుని ఇలాంటి అరాచకాలకు పాల్పడతారా అని ప్రశ్నించారు. ఇదేనా మీ ప్రజాస్వామ్యం? క్రిశాంక్ పై నాన్ బెయిలబుల్ కేసులు ఎలా పెడతారని సాక్షాత్తూ మెజిస్ట్రేట్ పోలీసులను ప్రశ్నించారంటేనే మీ కక్షసాధింపు ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. అంగన్వాడీ ఫోన్ల కుంభకోణం, టెన్త్ పేపర్ లీక్, హెచ్‌సీయూ గచ్చిబౌలి భూములు, సోమ్ డిస్టిలరీస్ వ్యవహారం, మిస్ వరల్డ్ పోటీల్లో మిస్ ఇంగ్లాండ్ వివాదం.. ఇలా ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపినందుకే ఆయనపై వరుసగా కేసులు పెట్టారని ఆరోపించారు.

లగచర్లలో గిరిజనుల పైనా, మెదక్, సంగారెడ్డిలో మా నాయకుల పైనా అక్రమ కేసులు పెట్టారన్నారు. జూబ్లీహిల్స్ ప్యాలెస్ లో కూర్చుని నేనే రాజు, నేనే మంత్రి అనుకుంటున్నారని, మీ అరాచకాలను గమనిస్తున్న రాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందన్నారు.బెంగళూరు నుంచి ప్రైవేట్ హ్యాకర్లను తెచ్చి కమాండ్ కంట్రోల్ రూమ్‌లో కూర్చోబెట్టుకొని ప్రతిరోజూ బీఆర్ఎస్ నేతల ఫోన్లను, మా ఇళ్ల ముందున్న సీసీ కెమెరాలను చట్టవ్యతిరేకంగా హ్యాక్ చేస్తున్నారన్నారు.

మా ఫోన్లు ట్యాప్ చేస్తున్న ఐపీఎస్ అధికారులకు ఇదే మా హెచ్చరిక. మా దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయన్నారు.

మేము అధికారంలోకి వచ్చాక రిటైర్ అయినా సరే మిమ్మల్ని ఎక్కడున్నా వదిలిపెట్టే ప్రసక్తి లేదని కచ్చితంగా విచారణ జరిపిస్తామన్నారు. చట్ట వ్యతిరేక పనులు చేస్తున్న ఐపీఎస్ అధికారులకు తగిన మూల్యం తప్పదని హెచ్చరించారు.

అప్పుడు మిమ్మల్ని రేవంత్ రెడ్డి కూడా కాపాడలేడు. మీ సొంత డబ్బుతో అడ్వకేట్లను పెట్టుకుని కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందని గుర్తుంచుకోవాలన్నారు.

క్రిశాంక్ ను జైల్లో పెట్టి రేవంత్ రెడ్డి వికృత ఆనందం పొందుతున్నాడన్నారు . మీ పార్టీ కార్యాలయంలో జరిగే అవినీతి, అక్రమాల వ్యవహారాలన్నీ రికార్డు అవుతున్నాయి. రేవంత్ రెడ్డికి మాటలు ఎక్కువ, చేతలు తక్కువ అన్నారు.

జూబ్లీహిల్స్ ప్యాలెస్ చాలదన్నట్టు ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో వంద కోట్లతో కొత్త ప్యాలెస్ కట్టడంలో బిజీగా ఉన్నారన్నారు.

నీ పాలనలో సగం కాలం పూర్తయింది, మిగిలిన సగం కాలమైనా ప్రజలకు ఏదైనా మేలు చేసే ప్రయత్నం చేయాలని సూచించారు.

రైతులు 20 రోజులుగా కొనుగోలు కేంద్రాల దగ్గర పడిగాపులు కాస్తుంటే శనగలు, సన్ ఫ్లవర్ కొనే నాథుడే లేడన్నారు .మీ మంత్రులు నిద్రపోతున్నారా? మీ ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఏం చేస్తుందని ప్రశ్నించారు.

ఎకరాకు కేవలం 26 క్వింటాళ్లు మాత్రమే కొంటామని మక్కలకు కొత్త షరతులు పెట్టి రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్నారన్నారు.

13 లక్షల ఎకరాల్లో పంట వస్తే కనీసం సగం కూడా కొనలేని దుస్థితి ఉందన్నారు.

వడ్ల కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభం కాలేదు. వడ్లకు ఐదారు కిలోల తరుగు తీస్తున్నారని ఆరోపించారు. తరుగు పెడితే తోలు తీస్తానన్న రేవంత్ రెడ్డి ఇప్పుడెవరి తోలు తీస్తాడో చెప్పాలి.యాసంగి సన్నవడ్లకు బోనస్ ఇస్తావా? ఇవ్వవా? స్పష్టం చేయాలన్నారు

ఇప్పటికైనా అక్రమ కేసులు బండ్ చేసి, ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు గురించి ఆలోచించాలన్నారు.

క్రిశాంక్ పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలి. మళ్లీ పీటీ వారెంట్లు వేసి ఇబ్బంది పెట్టాలని చూస్తే మాత్రం చూస్తూ ఊరుకోం అని అన్నారు..

పంచముఖ అంజన్నకు అమృతాభిషేకం..!

– మాడ వీధుల్లోని ఉప ఆలయాల్లో దేవతలకు పంచామృతాభిషేకాలు

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 28 మంగపేటబ్రహ్మోత్సవాల్లో మంగళవారం ఉదయం 10 గంటలకు పంచముఖ ఆంజనేయస్వామికి స్నపనం, పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని ఉప ఆలయాలైన శ్రీ ఎ ణ ు గ ో ఎ ా ల ని ా వ ి ు , శ్రీరమాసత్యనారాయణస్వామి ఆలయాల్లోని దేవతలకు సైతం అభిషేకాలు నిర్వహించారు. భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ ఉప అర్చకులు మురళీకృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో రుత్వికుల బృందం కోనేటి జలాలతో దేవతా ఉత్సవ మూర్తులకు శుద్ధి కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఉదయం 6 గంటల నుండే ఆలయ మాడ వీధులలోని ఉప ఆలయాల్లో మహానివేదన కార్యక్రమాలు నిర్వహించి తిరుమంజనం, శ్రీకృష్ణ సహస్రనామార్చన స్తోత్రపారాయణం, హవనం కార్యక్రమాలను పూర్తి చేశారు. సాయంత్రం 6 గంటలకు గరుడాధివాసం నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

భక్తుల రాక..

బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు మంగళవారం భక్తులు వందలాదిగా తరలివచ్చారు. పది రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాల కార్యక్రమాలను తిలకించేందుకు తరలిరావడంతో ఆలయ ప్రాంగణంతో పాటు క్యూలైన్లు, చింతామణి, దైత అమ్మవారి పరిసరాలు భక్తుల రద్దితో కిటకిటలాడింది. హాజరైన భక్తుల కోసం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో వీరస్వామి తెలిపారు.

చింతామణిలో భక్తుల కోలాహలం..

బుదవారం బ్రహ్మోత్సవాలకు హాజరైన భక్తులు చింతామణి సెలయేరులో స్నానాలు చేస్తూ కోలాహలంగా గడిపారు. వందలాదిగా చేరుకున్న భక్తులు చింతామణి సెలయేరులో పవిత్ర స్నానాలు చేసేందుకు పోటీలు పడ్డారు. స్నానాలు చేసిన భక్తులు చింతామణి నీటిని ఖాళీ సీసాలు, డబ్బాలతో నింపుకుని తమ ఇళ్లకు పట్టకెళ్లే క్రమంలో భక్తుల మధ్య తోపులాట జరిగింది. చింతామణి సెలయేరు నీటితో సకల రోగాలు నయమవుతామనే భక్తుల విశ్వాసంతో నీటిని పట్టుకునేందుకు భారులుతీరారు.

భక్తులకు వైద్య సేవలు :

ఉచిత వైద్య సేవలు అందించి బీపీ, షుగర్, బ్లడ్ టెస్టులు నిర్వహించి భక్తులకు డీహైడ్రేషన్ కాకుండా ఓఆర్ఎస్, మందులు అందచించినట్లు తెలిపారు. వైద్య సేవలు ఈ మే నెల 06 వరకు కొనసాగుతాయని వైద్యురాలు తెలిపారు. వైద్య సిబ్బంది వెంకటేశ్, నాగమణి,హలీమా, ఆశలు నవ్య, సుగుణ, నాగమణి తెలిపారు.

భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు : సీఐ అనుముల శ్రీనివాస్

హేమాచల లక్ష్మీనృసింహాస్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ చర్యలు తీసుకోనున్నట్లు ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై టీవీఆర్.సూరి తెలిపారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకోని 4 గురు సీఐలు, 10 ఎస్సైలు, 100 మంది పోలీస్ సిబ్బందితో భందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గుట్ట కింద ప్రాంతంలో ప్రైవేటు వాహనాల కొరకు పార్కింగ్ ఏర్పాటు చేశామని అక్కడ నుండి ప్రత్యేక వాహనాల్లో భక్తులను గుట్టకు తీసుకెల్లనున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన కాంగ్రెస్ మండల నాయకులు

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 28 ఏటూరు నాగారం సీతక్క ఆధ్వర్యంలో మలుగు జిల్లా లోని అన్ని గ్రామాలు అభివృద్ధి వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసిన ఘనత మంత్రి సీతక్క గారికి దక్కుతుంది...

ఈరోజు కాంగ్రెస్ మండల పార్టీ నాయకులు చిటమట రఘు ఆధ్వర్యంలో ఆత్మ చైర్మన్ కర్ల అరుణ ఆర్టిఏ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ ములుగు జిల్లా మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెద్ది రాజబాబు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి కోయగూడా ఎల్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని పాప్కపురం గ్రామాన్ని కాంగ్రెస్ మండల పార్టీ నాయకులు గ్రామ ప్రజలతో కలసి జరుగుతున్న అభివృద్ధి పనులు సిసి రోడ్లను పర్యవేక్షించడం జరిగింది.

సి ఆర్ గ్రాండ్ కింద మంత్రి సీతక్క పప్కపురం గ్రామానికి కోటి రూపాయలతో సైడ్ సిసి రోడ్లను మంజూరు చేసిందని పనులు కూడా చాలా వేగవంతంగా నడుస్తున్నాయని అన్నారు గ్రామీణ ప్రజలు చాలా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని వర్షాకాలం వచ్చిన ఏ భయం లేకుండా సైడ్ డ్రైన్ సిసి రోడ్డు గ్రామంలో పూర్తి స్థాయిలో అయినాయని సంతోషాన్ని వ్యక్తం చేశారు సీతక్క మంత్రిగా ఉండడమే ఈ అభివృద్ధి జరుగుతుందని తెలియజేశారు. గత పది సంవత్సరాల టిఆర్ఎస్ పాలనలో గ్రామాలు ఏ మాత్రం అభివృద్ధి చెందలేదని అభివృద్ధి అనేది ఎక్కడ కనిపించలేదని అన్నారు. బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు పది సంవత్సరాలు అధికారంలో ఉండి ఏ గ్రామాన్ని పట్టించుకున్న పాపాన పోలేదని టిఆర్ఎస్ పార్టీ నాయకులు డప్పు కొట్టుకోవడం తప్ప ఏమి పని చేయలేదని అన్నారు.మంత్రి సీతక్క గ్రామీణ అభివృద్ధి, శిశు సంక్షేమ, రూరల్ డెవలప్మెంట్ఉ వాటర్ మంత్రిగా ఉండి గ్రామాల అభివృద్ధి ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్నారని అన్నారు.కొంతమంది టిఆర్ఎస్ పార్టీ నాయకులు సీతక్క ని రీల్స్ చేస్తున్నారని అనడం వారి అవివేగానికి వదిలేస్తున్నామని అన్నారు.సీతక్క గ్రామీణ పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ఉన్న క్రమంలో ఏటూరునాగారం మండలం వందల కోట్ల రూపాయలతో ప్రతి గ్రామములో సీసీ రోడ్లు ఫ్రైడ్ రైస్ అదే విధంగా గ్రామానికి పోయే కల వర్ట్ బ్రిడ్జిలు మంజూరు చేసి అభివృద్ధిపరిచిందని అన్నారు 10 సంవత్సరాల టిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఏటూరు నాగారంలో ఏ అభివృద్ధి జరగలేదని తెలియజేసినారు.ఈ కార్యక్రమంలో మహిళా మండల నాయకులు బంటు ఉదయ, మంజుల, సంపత్,తదితరులు పాల్గొన్నారు

తెలంగాణ మోడల్ స్కూల్లో మాదకద్రవ్యాల వినియోగం పై అవగాహన కల్పించిన కలెక్టర్ కె. హైమావతి

మీరుదొడ్డి మండలకేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం 99 రోజుల కార్యాచరణ ప్రక్రియ ఈ వారం మిషన్ వాత్సల్య పథకం లో భాగంగా మాదకద్రవ్యాల వినియోగం అరికట్టడం, సైబర్ నేరాలు, కిషోర బాలికల గర్భధారణ సమస్యలపైన నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి శారద, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, సిడిపిఓ రాము, ఏంఈఓ, తహసీల్దార్, ఏంపిడిఓ, మెడల్ స్కూల్ ప్రిన్సిపల్ మరియు అధ్యాపకులు, స్నేహ సంఘాలు ప్రతినిధులు, స్థానిక కిషోర బాలికల తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రక్రియ లో ఈ వారం పిల్లల భద్రత, నో డ్రగ్స్ ప్రచారం పైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఈ కిశోర వయసు అనేది మంచి చెడు తెలియని వయస్సు మీది. ఎవరు చెప్పింది నమ్మాలి, ఎలా సమాజం లో మెలగాలి, భద్రత సమస్య వస్తె ఎలా ఎదుర్కోవాలి అనే ప్రతి అంశం గూర్చి ఈ కార్యక్రమం ద్వారా క్లుప్తంగా అధికారులు వివరిస్తారు.ఈ వయసులో చదువుకోవడం అనేదే మీ యొక్క విధిగా భావించాలని, మీ జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగాలంటే చదువు అనేది ఒక కాన్ఫిడెంట్ ఇస్తుందనీ తెలిపారు.మహిళ సమాజం అనేది చాలా పరిమితంగా ఉంటుందని కుటుంబానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని బయట స్నేహాలు ఎక్కువగా ఉండకూడదని తెలిపారు.ప్రవేట్ విద్యాసంస్థలు లో వెళ్ళి చదువు, ఆరోగ్యం లో ఇబ్బందులు పడిన వారు చాలా మంది ఉన్నారు. అందుకే ప్రభుత్వం అనేక విద్యా సంస్థల ద్వారా మంచి విద్యను అందిస్తుంది. ముందుగా చదువులో ఎక్కడ ఏ సబ్జెక్ట్ లో మనం వీక్ ఉన్నామో ఉన్నామో మీకుమీరు తెలుసుకోవాలి. ముందు వీక్ ఉన్న సబ్జెక్ట్ కి ఎక్కువ సమయం కేటాయించి చదివితే సబ్జెక్ట్ పైన గ్రిప్ వస్తుందని తెలిపారు.కెరీర్ గైడెన్స్ ప్రతి ఒక్కరికీ అవసరం. చదువు మాత్రమే కాకుండా ఏ రంగంలో ఎంచుకున్న దాంట్లో ఉన్నతంగా ఎదగాలని, చేసే పని అంత నిబద్ధతో చెయ్యాలని ఎక్కడ కూడా నిరాశ పడకుండా వృద్ధిలోకి రావాలని సూచించారు. దేవుడు ఇచ్చిన ఈ జీవితంలో 10 మందికి ఆదర్శంగా నిలిచేలా మన ఎదుగుదల ఉండాలని తెలిపారు.ప్రతి ఒక్కరు ఓడిపోవడం అనేది విజయానికి గట్టి పునాది వంటిదనీ ఒక దారి మూసుకుపోయింది అంటే 10 దారులు తెరుచుకుంటాయని సూచించారు. డిగ్రీ లో ఫెయిల్ అయిన వాళ్ళు కూడా గొప్ప గొప్ప వాళ్ళు అయినా వాళ్ళు చాలా మంది ఉన్నారు.డాక్టర్ అబ్దుల్ కలాం జీవితం గురించి అందరూ తెలుసుకోవాలి. కష్టంలో పెరిగి, చదువుకొని శాస్త్రవేత్తగా ఎదిగే మిసైల్ కనిపెట్టి దేశ అత్యున్నత పదవి రాష్ట్రపతి పదవి నిర్వర్తించారు.చిన్న చిన్న సమస్యలకు క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకోవద్దని ప్రేమలు, సోషల్ మీడియా జోలికి వెళ్లకుండా మీకు చదువు ఒక్కటే మీకున్న పని చదివే మిమ్మల్ని ఉన్నత స్థాయిలో తీసుకెళ్తుందని సమయాన్ని వృధా చేయవద్దని మీ కుటుంబం సభ్యులను ఉపాధ్యాయులను గౌరవించాలనీ తెలిపారు.ఆరోగ్యం, చదువు, భద్రత ఇలా అన్ని అంశాలపైన అధికారులు అవగాహన కల్పిస్తారని తెలిపారు. సమాజం లో గుడ్, బ్యాడ్ టచ్ లు డ్రగ్స్ బారిన, చెడు వ్యసనాల బారిన పడి ఎలా జీవితాలు నాశనం అవుతున్నాయని, ఇలాంటి అనర్థాలు ఎదురైతే సంప్రదించాల్సిన టోల్ ఫ్రీ నెంబర్ నోట్ చేసుకోవాలని తెలిపారు. ఎవరు ఎన్ని చెప్పిన మీ జీవితాన్ని నిర్మించుకుని చదవాల్సింది, ఎదగాల్సింది మీరే అంటూ ఎల్లపుడు పాజిటివ్ ఎనర్జీ రావాలంటే యోగ, ధ్యానం లాంటివి మంచి ప్రవర్తన, అలవాట్లతో ఉన్నత శిఖరాలకు చేరాలని తెలిపారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com